ఆదివారం
21-9-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 01
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సీపీఐ జాతీయ మహాసభలకు
రంగం సిద్ధం

నేడు సబ్జీ మండిలో భారీ ర్యాలీ, బహిరంగ సభ

- రేపటి నుంచి ప్రతినిధుల సభ
- సభా వేదికల వద్ద ఎర్రజెండాల రెపరెపలు
- సభల నిర్వహణకు భారీ ఏర్పాట్లు
- పర్యవేక్షించిన డి.రాజా

(చండీగఢ్ నుంచి విశాలాంధ్ర ప్రతినిధి)

పంజాబ్ హర్యానా ఉమ్మడి రాష్ట్రాల రాజధాని, కేంద్రపాలిత ప్రాంతమైన చండీగఢ్ వేదికగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 25వ జాతీయ మహాసభలకు రంగం

- మిగతా 2 లో

సింగరేణి ఉద్యోగులకు దసరా అడ్వాన్స్

విశాలాంధ్ర-హైదరాబాద్: సింగరేణి ఉద్యోగులకు దసరా పండుగను పురస్కరించుకుని సంస్థ పండుగ అడ్వాన్స్ చెల్లించాలని నిర్ణయించింది. ఈ మేరకు యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అర్హులైన శాశ్వత సిబ్బందికి రూ. 25 వేలు, తాత్కాలిక కార్మికులకు రూ. 12,500 ఇవ్వనున్నట్లు యాజమాన్యం తెలిపింది. ఈ నెల 23వ తేదీన నగదు జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సింగరేణి గుర్తింపు సంఘం ప్రతినిధులు కలిశారు. కొత్తగూడెం ఎమ్మెల్యే, యూనియన్ గౌరవాధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు అధ్వర్యంలో

- మిగతా 2 లో

10 పార్టీలకు షోకాజ్ నోటీసులు

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి... రాష్ట్రంలో గుర్తింపు లేని 10 రాజకీయ పార్టీలకు శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వాటి కార్యకలాపాలపై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ, అక్టోబరు 10లోపు సమాధానం ఇవ్వకపోతే గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 19న ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకే ఈ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను నోటీసులు

- మిగతా 2 లో

ఎన్‌కౌంటర్‌లో జవాన్ మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్, ఉధంపూర్‌లో ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక జవాన్ ప్రాణాలు కోల్పోగా, నలుగురు జైషే ఉగ్రవాదులను భద్రతా బలగాలకు పట్టుబడ్డారు. ఉగ్రవాదుల కదలికలపై నిఘా వర్గాల సమాచారంతో ఆర్మీ, స్పెషల్ ఆపరేషన్ గ్రూప్, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఉధంపూర్‌లోని దుదు బసంత్‌గఢ్ పర్వత ప్రాంతాల్లో గాలింపులు చేపట్టగా ముగ్గురు, నలుగురు ఉగ్రవాదులను చుట్టుముట్టి ఆపరేషన్ కొనసాగించారు. ఉగ్రవాదులు కాల్పులు జరపగా.. ఓ ఆర్మీ జవాను గాయపడ్డారు. చికిత్స పొందుతూ మరణించారు

మహారాణుల్ని చేస్తాం

- ఆర్థికంగా ఎదిగేందుకు ఖర్చుకు వెనుకాడం
- కోటి మందిని కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యం
- వడ్డీలేని రుణాల పంపిణీలో భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుని అత్యంత శక్తిమంతులుగా ఎదిగేందుకు ఎన్ని కోట్ల రూపాయలనైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసఫ్‌గూడాలో శనివారం స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన భట్టి మాట్లాడుతూ హైదరాబాదు నగరానికి సంబంధించి 63 లక్షల మంది సభ్యులు ఉంటే జీహెచ్ఎంసీ పరిధిలో 30 సర్కిళ్లలో 50,764 సంఘాల్లో 5,09,957 మంది సభ్యులు ఉన్నారని వివరించారు. ఈ సంఖ్యను గణనీయంగా పెంచుతాం అన్నారు. మెప్మా ద్వారా రూ.41.51 కోట్లు వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 8,130 మంది మహిళలు లబ్ధి పొందుతున్నారని డిప్యూటీ సీఎం వివరించారు. ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యమన్నారు. అందులో భాగంగా ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించాలని నిర్ణయిస్తే ప్రతిపక్షాలు ఇది సాధ్యమేనా అంటూ అవహేళన చేశారని గుర్తు చేశారు. వారి అంచనాలు తలకిందులు చేస్తూ మొదటి ఏడాదే రూ.21,632 కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు అందించి రికార్డు సృష్టించామన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో హైదరాబాదులో ఖరీదైన శిల్పారామం వద్ద మహిళలు వ్యాపారం చేసుకునేందుకు వీలుగా వంద దుకాణాలను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా బస్సులు కొనుగోలు చేయించి 150 బస్సులు ఆర్టీసీకి లీజుకు ఇప్పించాం... మరో 450 బస్సులు త్వరలోనే లీజుకు కు ఇప్పించే కార్యక్రమం జరుగుతుందన్నారు. మహిళలను మహాలక్ష్ములుగా చూడాలన్న ఆలోచనతో వారు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించేందుకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇప్పటివరకు 222.50 కోట్ల మంది మహిళలు ప్రయాణం చేశారని, వారి పక్షాన రూ.7,422 కోట్లు ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఏ కార్పొరేట్ ఆసుపత్రిలోనైనా రూ.పది లక్షల వరకు

- మిగతా 2 లో

మోహన్‌లాల్‌కు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు

న్యూఢిల్లీ: మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది. సినీ రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డు ప్రకటించింది. కేంద్ర సమాచార, ప్రసారశాఖ శనివారం ఈ విషయాన్ని తెలియజేస్తూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది. 2023 సంవత్సరానికిగాను మోహన్‌లాల్ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందుకోనున్నారు. నటుడు, దర్శకుడు, నిర్మాతగా భారతీయ చలన చిత్రరంగానికి ఆయన ఆదర్శవంతమైన సేవలు అందించారని పేర్కొంది. మోహన్‌లాల్ అద్భుత ప్రతిభ, వైవిధ్యం, కృషి, పట్టుదల భారతీయ సినీ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ అధ్యాయమని కొనియాడింది. సెప్టెంబరు 23న జరిగే 71వ నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో మోహన్‌లాల్ ఈ అవార్డును అందుకోనున్నారు. మోహన్‌లాల్ ఇప్పటివరకూ మొత్తం ఆరు జాతీయ అవార్డులు గెలుచుకున్నారు. ఉత్తమ నటుడిగా రెండు, స్పెషల్ జ్యూరీ అవార్డుల విభాగాల్లో నాలుగు

- మిగతా 2 లో

ట్రంప్ వీసా పిడుగు

- హెచ్-1బీ దరఖాస్తు రుసుం లక్ష డాలర్లు
- ఉత్తర్వులపై ట్రంప్ సంతకం
- 24 గంటల్లో తిరిగి రండి: ఇమిగ్రేషన్ అటార్నీలు, కంపెనీలు
- భారత టెక్ సర్వీసులపై ప్రతికూల ప్రభావం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌ను దెబ్బతీసే మరో నిర్ణయం తీసుకున్నారు. హెచ్-1 బీ వీసాల దరఖాస్తు రుసుమును అమాంతం లక్ష డాలర్లకు పెంచేశారు. ఈ మేరకు కార్యనిర్వాహక ఉత్తర్వుల (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్)పై సంతకాలు చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి రానున్నాయి. ఇమ్మిగ్రేషన్‌పై ఉక్కుపాదం మోపడమే కాకుండా ఉద్యోగాల్లో అమెరికన్లకు తొలి ప్రాధాన్యత కల్పించే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ యంత్రాంగం పేర్కొంది. ఇక హెచ్-1బీ వీసా కోసం ఏటా లక్ష డాలర్లు చెల్లించాల్సి ఉంటుందని యూఎస్ కామర్స్ సెక్రటరీ హోవార్డ్ లుట్నిక్ ప్రకటించారు. తాజాగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. ఇతర దేశాల నుంచి అమెరికాకు ఉద్యోగులు వచ్చి తమ వారికి అవకాశాలు లేకుండా చేస్తున్నారని, ఇకపై అలాంటి పరిస్థితి ఉండబోదని, అత్యంత నైపుణ్యత కలిగివుండేవారికి మాత్రమే అవకాశం లభిస్తుందన్నారు. ఇప్పటికే దిగ్గజ కంపెనీలకు కొత్త విధానంపై వివరించినట్లు లుట్నిక్ చెప్పారు. ఉద్యోగాల్లో అమెరికన్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇతర దేశాల నుంచి ఉద్యోగులను తీసుకురావడం ఆపాలని సూచించామన్నారు. ప్రస్తుత ఇమిగ్రేషన్ వ్యవస్థలో అత్యంత దుర్వినియోగమయ్యేది హెచ్1బీ నాన్ ఇమిగ్రెంట్ వీసా ప్రోగ్రామ్ అని శ్వేతసౌధం స్టాఫ్ సెక్రటరీ విల్ షాఫ్ వెల్లడించారు. అద్భుతమైన నైపుణ్యతను కలిగివుంటే తప్ప సాధారణ ఉద్యోగులకు అవకాశం లభించకూడదన్నదే తాజా ఉత్తర్వుల ముఖ్య ఉద్దేశమన్నారు. అమెరికన్ల ఉద్యోగాలను కొల్లగొట్టేందుకు వీల్లేకుండా హెచ్1బీ వీసా రుసుమును ట్రంప్ యంత్రాంగం పెంచిందన్నారు.

అమెరికా వర్కర్లకు రక్షణ: ట్రంప్

అమెరికా వర్కర్లకు రక్షణ కల్పించే ఉద్దేశంతో టెక్నాలజీ రంగానికి దోహదమయ్యేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ చెప్పారు. 'మనకు వర్కర్లు కావాలి. గొప్ప వర్కర్లు కావాలి. ఇప్పటి నుంచి జరగబోయేది అదే' అని ఓవల్ కార్యాలయంలో హెచ్1 బీ వీసా రుసుము పెంచే ఉత్తర్వులపై సంతకం చేసే సమయంలో ట్రంప్ అన్నారు. హెచ్1బీ వీసా విధానం దుర్వినియోగం దేశానికి ముప్పన్నారు. నాన్-ఇమిగ్రెంట్ వర్కర్లు అమెరికాకు రాకుండా ఈ ఉత్తర్వులు జారీచేసినట్లు వెల్లడించారు. అమెరికా పనిచేసేందుకు, ఇక్కడే స్థిరపడేందుకు విదేశీ ఉద్యోగులకు కంపెనీలు అవకాశం కల్పిస్తున్నాయి. ఇకపై అమెరికన్లను ఉద్యోగాలు వస్తాయని ట్రంప్ అన్నారు. గోల్డ్‌కార్డును సైతంప్రకటించారు. దీనికి 10 లక్షల డాలర్లుగా నిర్ణయించారు. తద్వారా

- మిగతా 2 లో

వైద్య వ్యవస్థలో మార్పులు అవశ్యం

విదేశీ చికిత్సా పద్ధతులు పరిశీలన
25 కిలోమీటర్లకు ఓ డయాలసిస్ సెంటర్
రోగులకు అన్ని రకాల వైద్యసేవలు: మంత్రి రాజనర్సింహ

విశాలాంధ్ర - హైదరాబాద్: ఒక్కప్పుడు అంటువ్యాధుల సమస్య ఎక్కువగా ఉండేదని... ఇప్పుడు జీవనశైలి వ్యాధుల సమస్య ఎక్కువైందని... ఇందుకు అనుగుణంగా వైద్య వ్యవస్థలో మార్పులు రావాల్సిన అవసరం ఉందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. రాష్ట్రంలో కొత్త డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుపై ఆ శాఖ ఉన్నతాధికారులతో శనివారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ హాజరయ్యారు. రాష్ట్రంలో కిడ్నీ... డయాలసిస్ రోగుల సంఖ్య పెరుగుతున్న తీరును అధికారులు మంత్రికి వివరించారు. 2009లో 1230 మంది డయాలసిస్ పేషెంట్లు ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 12 వేలు దాటిందని తెలిపారు. ఇదే అంశంపై మంత్రి మాట్లాడుతూ కిడ్నీ, క్యాన్సర్ జబ్బులు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ మారిన పరిస్థితులకు అనుగుణంగా వైద్య వ్యవస్థ మారాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర దేశాల్లో అవలంభిస్తున్న చికిత్స పద్ధతులను పరిశీలించాలని అధికారులకు సూచించారు. జబ్బుల బారిన పడిన ప్రజలకు చికిత్స అందించేందుకు అనుగుణంగా ఆసుపత్రులు తయారు కావాలన్నారు. అందులో భాగంగానే

- మిగతా 2 లో

ఆలయ భూములు కాపాడలేరా?

కోర్టుల్లో బలంగా వాదించలేరా: మంత్రి సురేఖ

విశాలాంధ్ర-హైదరాబాద్: దేవుడి భూములపై న్యాయ పోరాటం సరైన రీతిలో ఎందుకు జరగడం లేదని మంత్రి కొండా సురేఖ ప్రశ్నించారు. దేవుడి భూములు కాపాడటంలో జాప్యమెందుకు? నా ముందు వాదించినట్టు కోర్టులో వాదించలేరా? అని నిలదీశారు. దేవాదాయ శాఖ మంత్రిగా తన రెండేళ్ల పదవీకాలంలో గెలిచిన కేసులు ఎన్నో చెప్పాలన్నారు. కేసుల పురోగతిపై సమాచారం ఇవ్వలేకపోవడాన్ని, న్యాయ విభాగం అప్‌డేట్ చేయకపోవడాన్ని మంత్రి ప్రశ్నించారు. ఏ కేసుల మీద న్యాయ పోరాటం చేశారు, వాటిని పరిష్కరించడంలో వచ్చిన ఇబ్బందులు ఏమిటో చెప్పాలని న్యాయవాదులను కోరారు. రాష్ట్ర సచివాలయంలోని దేవాదాయ శాఖ మంత్రి పేషీలో ఎండోమెంటు గవర్నమెంటు ప్లీడర్ల సమావేశం శనివారం జరిగింది. మంత్రి సురేఖ మాట్లాడుతూ ఎండోమెంటు కేసుల విషయంలో న్యాయవాదులతో ప్రతి ఆరు నెలలకొక సమావేశం పెట్టి పురోగతిని చెప్పాలని ఆ శాఖ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

యువత ఆకాంక్షలు విస్మరిస్తే ఉద్యమాలు తప్పవు

- ప్రజల దృష్టి మళ్లించడంలో మోదీ విజయం
- జెన్-జీ శక్తిని తక్కువ అంచనా వేయొద్దు
- ముంబై సదస్సులో కేటీఆర్

విశాలాంధ్ర -హైదరాబాద్: యువత ఆకాంక్షలను విస్మరిస్తే, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వచ్చే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. దేశ యువత ఆకాంక్షలు ఆకాశాన్ని తాకుతుంటే, పాలకుల ఆలోచనలు పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల చుట్టూనే తిరుగుతున్నాయని విమర్శించారు. ప్రజల మౌలిక భావోద్వేగాలను రెచ్చగొడుతూ, మందిర్-మస్జిద్, ఎవరు ఏం తింటున్నారు... ఎవరేం కట్టుకుంటున్నారన్న అంశాలపై

- మిగతా 2 లో

ట్రంప్ ఆలోచన మోదీకే తెలుసు

హెచ్-1బీ వీసా ఫీజు పెంచితే స్పందించకపోవడం దారుణం
సమస్యను పరిష్కరించడంలో కేంద్రం విఫలం: మంత్రి శ్రీధర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆలోచన తీరు ఆయన ప్రియ మిత్రుడు ప్రధాని మోదీకే బాగా తెలుసని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అంబేద్కర్ సచివాలయంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ హెచ్-1బీ వీసా రుసుం ఏటా రూ.లక్ష డాలర్లకు పెంచితే కేంద్రం ఎందుకు మౌనంగా ఉంటుంది... దీని వెనుకున్న మర్మమేంటి అని ప్రశ్నించారు. హెచ్ 1బీ వీసా పొందేవారిలో 73 శాతం మంది భారతీయులేనని, ఈ ప్రభావం భారత్ పైనే అధికం ఉంటుందని వివరించారు. 2024-25 లో భారత్ కు రికార్డు స్థాయిలో 135.46 బిలియన్ డాలర్లు వచ్చాయన్నారు. ఇందులో అమెరికా వాటా 27.7 శాతం. ట్రంప్ తాజా నిర్ణయంతో మనకు పంపించే డబ్బులు తగ్గిపోతాయని పేర్కొన్నారు. ఆ ప్రభావం మన విదేశీ మారక ద్రవ్య నిల్వలపై పడుతుందని, ఈ విషయం తెలిసినా ముందస్తుగా అమెరికాతో సంప్రదింపులు జరిపి సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం చొరవ చూపలేదని విమర్శించారు. కనీసం ప్రస్తుతం అమెరికాలో ఉన్న హెచ్- 1బీ వీసాదారులకు మినహాయింపులను సాధించడంలోనూ విఫలమయిందన్నారు. ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి మేల్కొని సమస్య పరిష్కారానికి నేరుగా అమెరికాతో చర్చించాలని సూచించారు. భారతీయ ఐటీ నిపుణులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, విదేశీల నుంచి వచ్చే డబ్బులపై ఆధారపడే కుటుంబాలు, సంస్థల పట్ల సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. భారతదేశానికొచ్చే మొత్తం నగదులో తెలంగాణ 8.1 శాతం వాటాతో నాలుగో స్థానంలో ఉందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రం దృష్టికి తీసుకెళ్తూ... ప్రత్యేకంగా లేఖ రాస్తాం అని వివరించారు.

విశాలాంధ్ర

ప్రపంచం

2

హైదరాబాద్

ఆదివారం

21 సెప్టెంబరు 2025

హెచ్-1బి వీసాల రుసుం పెంపుపై ముప్పేటదాడి

ట్రంప్ చర్యలను వ్యతిరేకించిన అమెరికా చట్టసభ సభ్యులు

వాషింగ్టన్: హెచ్-1బి వీసా దరఖాస్తులపై లక్ష డాలర్ల రుసుము విధించాలనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రణాళికపై అమెరికా చట్టసభ సభ్యులు, కమ్యూనిటీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ తీసుకున్న ఈ చర్య నిర్లక్ష్యపూరితమని, దురదృష్టకరమని చట్టసభ సభ్యులు మండిపడ్డారు. ఇది ఐటీ పరిశ్రమపై తీవ్రస్థాయిలో ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అమెరికా కాంగ్రెస్ సభ్యుడు రాజాకృష్ణమూర్తి స్పందించారు. 'హెచ్1బి వీసా దరఖాస్తు రుసుము లక్ష డాలర్లకు పెంచడం వల్ల అమెరికా తీవ్రంగా నష్టపోతుంది. మన శ్రామికశక్తిని దీర్ఘకాలంగా బలోపేతం చేసిన, ఆవిష్కరణలకు ఆజ్యం పోసిన లక్షలాది మంది అమెరికన్లకు ఉపాధి కల్పించే పరిశ్రమలను నిర్మించడంలో సహాయపడిన అధిక నైపుణ్యం గల కార్మికుల నుండి అమెరికాను వేరు చేయడానికి ట్రంప్ చేసిన నిర్లక్ష్యపూరిత ప్రయత్నం' అని ఆయన మండిపడ్డారు. చాలామంది హెచ్1-బి వీసాదారులు అమెరికా పౌరులుగా మారి... అమెరికాలో మంచి జీతంతో ఉద్యోగాలు సృష్టించే వ్యాపారాలు ప్రారంభిస్తారని ఆయన అన్నారు. ఇతర దేశాలు ప్రపంచ ప్రతిభను ఆకర్షించడానికి పోటీపడుతుండగా... అమెరికా మాత్రం దానికి విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా తన శ్రామిక శక్తిని బలోపేతం చేయాలి. వలస వ్యవస్థను ఆధునీకరించాలి. ఆర్థిక వ్యవస్థను, దాని భద్రతను బలహీనపరిచే అడ్డంకులను సృష్టించకూడదని రాజాకృష్ణమూర్తి హితవు పలికారు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ మాజీ సలహాదారు, వలస విధానంపై ఆసియా-అమెరికన్ కమ్యూనిటీ నేత అజయ్ భుటోరియా మాట్లాడుతూ 'హెచ్1-బి రుసుము విధించాలనే ట్రంప్ కొత్త ప్రణాళికతో అమెరికా సాంకేతిక రంగ పోటీతత్వం తీవ్ర సంక్షోభానికి గురవుతుంది' అని హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా అగ్రశ్రేణి ప్రతిభావంతులను ఆకర్షించిన ఆవిష్కరణలకు జీవనాధారమైనది హెచ్1-బి కార్యక్రమమని అన్నారు. ప్రస్తుత హెచ్-1 బి వీసా దరఖాస్తుల రుసుము రెండువేల డాలర్లు, ఐదు వేల డాలర్లుగా ఉంది. ఈ రుసుము ఒకేసారి లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ తీసుకున్న నిర్ణయం... భవిష్యత్తులో తీవ్ర అడ్డంకులు సృష్టిస్తుంది. ఇది విభిన్న ప్రతిభపై ఆధారపడే చిన్న వ్యాపారాలు, స్టార్టప్‌లను అణచివేస్తుంది' అని భుటోరియా ఆందోన వ్యక్తం చేశారు. ట్రంప్ చర్యతో ప్రతిభావంతులను కెనడా లేదా యూరప్ దేశాలవైపు నెట్టడమేనని, ఈ చర్య ద్వారా అమెరికాకు ఎదురుదెబ్బ తగలవచ్చని, దీనికిబదులుగా స్టార్టప్‌లకు మినహాయింపునివ్వడం లేదా మెరిట్ ఆధారిత ఎంపికకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి సమతుల్య సంస్కరణకు ట్రంప్ పిలుపునివ్వాలని భుటోరియా సలహానిచ్చారు. హెచ్-1 బి వీసాలకు లక్ష డాలర్ల రుసుము చాలా దరదృష్టకరం. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, టెక్ పరిశ్రమల వ్యాపారాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అమెరికాలోని ఉన్నత విద్యావంతులపై ఇప్పటికే ఏఐ... సుంకాల ప్రతికూల ప్రభావం పడిందని ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా స్టడీస్‌కు చెందిన ఖండేరావ్ కాంద్ అన్నారు.

60 రోజుల్లోగా దేశం వీడండి

సిరియన్లకు అమెరికా ఆదేశాలు

వాషింగ్టన్: సిరియన్లపై అమెరికా ఉక్కుపాదం మోపింది. అక్రమ వలసదారుల పేరుతో కఠిన చర్యకు ఉపక్రమించింది. సిరియా వలసదారులకు కల్పిస్తున్న తాత్కాలిక రక్షణ హోదాను రద్దు చేసింది. దీనికింద రక్షణ పొందుతున్న వారంతా 60 రోజుల్లోగా దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. లేదంటే అరెస్టులు చేస్తామని హెచ్చరించింది. తాత్కాలిక రక్షణ హోదా కింద వేలాదిమంది సిరియన్లు అమెరికాలో నివసిస్తున్నారు. 2012 నుంచి దాదాపు ఆరు వేలకు పైగా సిరియా వలసదారులు ఈ రక్షణ పొందుతున్నట్లు అంచనా. వారి బహిష్కరణపై అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. అక్కడ నెలకొన్న పరిస్థితులు వారిని తిరిగి స్వదేశానికి వెళ్లకుండా నిరోధించలేవని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ అధికార ప్రతినిధి ట్రిసియా మెక్లాఫ్లిన్ స్పష్టం చేశారు. దాదాపు రెండు దశాబ్దాలుగా ఉగ్రవాదం, ఉగ్రకార్యకలాపాలకు సిరియా కేంద్రంగా మారిందని, తమ దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా అక్కడి వారిని తమ దేశంలో ఉండేందుకు అనుమతించడం కుదరదని ట్రిసియా పేర్కొన్నారు. 60 రోజుల గడువులోగా స్వచ్ఛందంగా దేశం వీడాలని, లేదంటే సంబంధిత చట్టాల కింద అరెస్టు, డిపోర్టేషన్ చేస్తామన్నారు.

ఉగ్రవాదంతో సింధు జలాల ఒప్పందం ఉల్లంఘన

పాక్‌పై భారత్ మండిపాటు

జెనీవా: భారత్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ వేదికను ఉపయోగించుకోవాలని ప్రయత్నించిన పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో సింధు జలాల అంశాన్ని ప్రస్తావించిన పాకిస్థాన్‌కు భారత్ గట్టిగా సమాధానం చెప్పింది. జెనీవాలో ఐరాస మానవ హక్కుల మండలి సమావేశం జరిగింది. ఇందులో భారత్ జల వనరులను ఆయుధంగా మారుస్తోందని పాక్ దౌత్యవేత్త అబ్బాస్ సర్వస్ ఆరోపించారు. దీనికి భారత దౌత్యవేత్త అనుపమ సింగ్ గట్టిగా బదులిచ్చారు. కౌన్సిల్ కార్యకలాపాలను రాజకీయం చేయడానికి పాక్ ప్రతినిధి బృందం ఉద్దేశపూర్వకంగా నిరంతరం ప్రయత్నిస్తోందని విమర్శించారు.

ఇలాంటి చర్యలు వేదిక సమగ్రతను దెబ్బతీస్తున్నాయన్నారు. 1960లో సోదరభావం, స్నేహపూర్వకమైన సంబంధాలు అనే ప్రాతిపదికన సింధు జలాల ఒప్పందం జరిగిందని అనుపమ పేర్కొన్నారు. కానీ, ఇప్పుడు పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ ఆ దేశం ఉద్దేశపూర్వకంగా ఒప్పందాన్ని ఉల్లంఘించిందన్నారు. కౌన్సిల్ సమావేశం ఉద్దేశాల నుంచి దృష్టి మళ్లించేందుకు పాక్ ఇలాంటి అంశాలు లేవనెత్తుతుందన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే ఆ దేశం... ఒప్పందాల గురించి ఉపన్యాసాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ఐరోపా విమానాశ్రయాలపై సైబర్ దాడి

లండన్: లండన్‌లోని హీత్రో, బెల్జియంలోని బ్రసెల్స్, జర్మనీలోని బెర్లిన్ సహా పలు యూరోపియన్ దేశాల విమానాశ్రయాలు సైబర్‌దాడికి గురయ్యాయి. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలిగింది. సైబర్ నేరగాళ్లు సర్వీస్ ప్రొవైడర్లను లక్ష్యంగా చేసుకోవడంతో చెక్-ఇన్, బోర్డింగ్ వ్యవస్థలు వంటి సేవలు నిలిచిపోయినట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. విమానాశ్రయ సేవల్లో అంతరాయం నెలకొనడంతో అనేక విమానాలు ఆలస్యం కాగా... పలు విమానాలు రద్దయినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. దీంతో వివిధ దేశాలకు వెళ్లాల్సిన వేలాదిమంది ప్రయాణికులపై ప్రభావం పడింది. విమానాల స్థితిని తెలుసుకోవడానికి సంబంధిత వెబ్‌సైట్లు పరిశీలిస్తూ ఉండాలని విమానాశ్రయ అధికారులు ప్రయాణికులకు సూచించారు. సైబర్ దాడి కారణంగా బ్రసెల్స్ విమానాశ్రయంలోని ఆటోమేటెడ్ చెక్-ఇన్, బోర్డింగ్ సేవలు పనిచేయడం లేదని అధికారులు తెలిపారు. సిస్టమ్‌ను సరిచేసేందుకు తమ సాంకేతిక బృందం శ్రమిస్తోందని, త్వరలో సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. ఇప్పటికే విమానాశ్రయానికి చేరుకున్న ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. యూరప్‌లోని దాదాపు అన్ని ప్రఖ్యాత విమానాశ్రయాలు సైబర్ దాడికి గురైనట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. సిస్టమ్ ప్రొవైడర్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య వల్ల విమానాలు ఆలస్యమవ్వడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపాయి.

సీపీఐ జాతీయ మహాసభలకు రంగం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధమైంది. సెప్టెంబర్ 21వ తేదీ ఆదివారం నుంచి 25వ తేదీ వరకు ఈ మహాసభలు జరుగుతాయి. దేశంలో నెలకొన్న రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో ఈ మహాసభలకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. తొలిరోజు 21వ తేదీ ఆదివారం పంజాబ్, హర్యానా సరిహద్దు ప్రాంతంలో సెక్టార్ 65 సబ్జీ మండి షెడ్ మైదానంలో భారీ బహిరంగ సభ జరుగుతుంది. సాయంత్రం రెండు గంటలకు జరిగే ర్యాలీ అనంతరం సభ జరుగుతుంది. ఈ రెండు రాష్ట్రాలకు చెందిన రైతులు, యువకులు, విద్యార్థులు, మహిళలు పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొననున్నారు. ఈ విషయాన్ని సీపీఐ పంజాబ్ రాష్ట్ర కార్యవర్గం ధ్రువీకరించింది. వేలాది మంది ప్రజలు ర్యాలీకి తరలిరానున్నారు. రెండవ రోజైన 22వ తేదీన ప్రతినిధుల సభ ప్రారంభమవుతుంది. ప్రతినిధుల సభలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి దాదాపు 750 మంది ప్రతినిధులు పాల్గొంటారు. దక్షిణాది రాష్ట్రాలతో పాటు దూర ప్రాంతాల నుంచి ఇప్పటికే చాలామంది ప్రతినిధులు చండీగఢ్ చేరుకున్నారు. ఐదు రోజులపాటు మహాసభలో పాల్గొనే ప్రతినిధుల కోసం సీపీఐ పంజాబ్ రాష్ట్రం శాఖ అధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. విశేషమేమిటంటే ఇతరుల ప్రమేయం లేకుండా పంజాబ్ సీపీఐ, దాని ప్రజాసంఘాల సభ్యులు స్వయంగా ఈ ఏర్పాట్లు చేశారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌కు చెందిన విద్యార్థులు, యువజనులు మాత్రమే జెండా కర్రలు మోస్తూ... జండాలు కడుతూ బ్యానర్లు ఏర్పాటు చేస్తూ విమానాశ్రయం, రైల్వేస్టేషన్‌కు వచ్చిన ప్రతినిధులకు ఎప్పటికప్పుడు స్వాగతం పలుకుతూ

చెమటోడుస్తున్నారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మహాసభల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర పార్టీ నాయకులు శనివారం సాయంత్రం మహాసభల షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేశారు. ప్రతినిధుల సభ ప్రారంభోత్సవానికి ముందు షాహిద్ భగత్‌సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జగన్‌మోహన్ సింగ్ జాతీయ పతాకాన్ని, పంజాబ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి భూపేంద్ర సాంబార్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పిస్తారు. ప్రతినిధుల సభ సెక్టార్ 35ఏ లోని కిసాన్ భవన్‌లో నిర్వహిస్తారు. ఈ వేదికకు కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి పేరు పెట్టారు. సుధాకరరెడ్డి స్ఫూర్తితో మహాసభల లక్ష్యాన్ని పరిపూర్తి చేస్తామని డి.రాజా పేర్కొన్నారు. ప్రతినిధుల సభను డి.రాజా లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్), ఏఐఎఫ్‌బీ, ఆర్ఎస్‌పీ ప్రధాన కార్యదర్శులు సౌహార్ద సందేశాలు ఇస్తారు. ప్రతినిధుల సభ మొదటి సెషన్‌లో సంతాప తీర్మానాల అనంతరం డి.రాజా ముసాయిదా రాజకీయ తీర్మానంతో పాటు నిర్మాణ, సమీక్ష నివేదికలు ప్రవేశపెడతారు. అనంతరం రాజకీయ తీర్మానంపై చర్చ ప్రారంభమవుతుంది. మరో రెండు రోజులు పాటు ఈ నివేదికలపై చర్చ కొనసాగుతుంది. ఆఖరి రోజు సెప్టెంబర్ 25వ తేదీన జాతీయ నూతన కార్యవర్గాన్ని, కమిటీని ఎన్నుకుంటారు. ప్రధాన కార్యదర్శిని కూడా ఆ రోజే ఎన్నుకుంటారు. మహాసభల సందర్భంగా ప్రతిరోజు సాయంత్రం ఏడు గంటల తర్వాత ఇప్టా అధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

భగత్‌సింగ్ అమరుడైన చోటు నుండి జాతా

జాతీయ మహాసభ గౌరవ సూచకంగా పంజాబ్‌లో అమరవీరుల స్మారక ప్రాంతాల నుండి ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌లకు చెందిన యువ కామ్రేడ్లు కాగడాల జాతాతో ఆదివారం జరగనున్న బహిరంగ సభకు చేరుకోనున్నారు. కాగడాలను డి.రాజాకు అందజేస్తారు. షహీద్ భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు అమరత్వం పొందిన హుస్సేనీ వాలా నుండి, బ్రిటిషర్లు హత్యాకాండకు పాల్పడిన జలియన్‌వాలాబాగ్ నుండి, గదర్ పార్టీ ఉద్యమం ప్రారంభమైన దుద్‌కే గ్రామం నుండి ఈ జాతాలు ప్రారంభమయ్యాయి.

మోహన్‌లాల్‌కు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు

(మొదటిపేజీ తరువాయి)

అవార్డులు దక్కించుకున్నారు. నిర్మాతగా 'వానప్రస్థానం' చిత్రానికి మరో అవార్డు వచ్చింది. కేరళ రాష్ట్ర అవార్డులు, ఫిలింఫేర్ అవార్డులు ఆయనకు కొత్తేమీ కాదు. సినిమాకు చేసిన సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మ భూషణ్ అవార్డులతో ఆయనను సత్కరించింది. తాజాగా దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుతో ఆయన గౌరవాన్ని మరింత పెంచింది.

సింగరేణి ఉద్యోగులకు దసరా అడ్వాన్స్

(మొదటిపేజీ తరువాయి)

సీఎంతో భేటీ అయ్యారు. సింగరేణి అంశాలపై కీలక చర్చలు జరిపారు. సింగరేణి లాభాల వాటా 35 శాతం చెల్లించాలని సీఎంను విజ్ఞప్తి చేశారు. దీనికి సీఎం కూడా సానుకూలంగా స్పందించారు. కూనంనేనితో పాటు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్ కుమార్ ముఖ్యమంత్రిని కలిసినవారిలో ఉన్నారు.

ట్రంప్ వీసా పిడుగు

(మొదటిపేజీ తరువాయి)

అమెరికాకు 100 బిలియన్ డాలర్లు సమకూరే అవకాశముంది. ఈ డబ్బును పన్నుల తగ్గింపు, అభివృద్ధి ప్రాజెక్టులకు, రుణాల చెల్లింపులకు వినియోగించనున్నట్లు ట్రంప్ వెల్లడించారు.

ఏటా 85వేల వీసాల జారీ

1990లో అత్యంత నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణుల కోసం హెచ్-1బీ వీసా విధానాన్ని తీసుకొచ్చారు. అమెరికాలోని టెక్ కంపెనీలకు విదేశీ నిపుణుల కోసం ఈ వీసాలు దోహదమవుతాయి. హెచ్-1బీ వీసాదారుల్లో భారత్ 71 శాతం, చైనా 11.7 వాటాను కలిగివున్నాయి. వీటిని మూడేళ్ల కోసం జారీ చేస్తారు. తదుపరి మరో మూడేళ్ల కోసం రెన్యూవల్ చేసుకోవచ్చు. హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులకు లాటరీ విధానం అమల్లో ఉంది. దరఖాస్తుకు సాధారణ రుసుము, లాటరీలో ఎంపికైతే అదనపు చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. చాలా సందర్భాల్లో కంపెనీలే ఈ చార్జీలు భరిస్తాయి. అమెరికా ఏటా 85వేల వీసాలను లాటరీ విధానం ద్వారా జారీ చేస్తోంది.

టెక్ కంపెనీలు అప్రమత్తం: ఉద్యోగులకు 24 గంటల గడువు

హెచ్1 బీ వీసాలకు సంబంధించిన ట్రంప్ తాజా నిర్ణయంతో మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ టెక్ కంపెనీలన్నీ అప్రమత్తమయ్యాయి. హెచ్-1బీ, హెచ్4 వీసాలు కలిగివున్న తమ ఉద్యోగులను తక్షణమే అమెరికాకు తిరిగి రావాలంటూ ఆదేశించాయి. ఒక్క రోజు డెడ్‌లైన్ విధించాయి. గడువు దాటితే ఉద్యోగంపై ఆశలు వదులుకోవాల్సిందేనని తేల్చిచెప్పాయి. ఈ వీసాలు కలిగి అమెరికాలోనే ఉన్న వారు ఎక్కడికీ కదలవద్దని సూచించాయి. హెచ్1-బీ, హెచ్ 4 వీసాలు కలిగి ఉన్న ఉద్యోగులను 21వ తేదీ (ఆదివారం)లోగా అమెరికాకు తిరిగి రావాలంటూ మైక్రోస్టాఫ్ట్, జేపీ మార్గన్, కాగ్నిజెంట్, మెట్ వంటి దిగ్గజ కంపెనీలు ఆదేశాలిచ్చాయి. ఇమిగ్రేషన్ అటార్నీలు సైతం డెడ్‌లైన్ ముగిసే లోపు రాకపోతే అమెరికాలో ప్రవేశం ఉండదని హెచ్చరించారు. అమెరికాలో ఉన్న హెచ్1బీ వీసాదారులు ఎటూ కదలవద్దని ఇమిగ్రేషన్ అటార్నీలతో పాటు కంపెనీలు స్పష్టంచేశాయి. మైక్రోస్టాఫ్ సంస్థ తమ ఉద్యోగాలకు ఓ ఈమెయిల్ పంపింది. భవిష్యత్తు నిర్ణయం వరకు అమెరికాలోనే ఉండాలని తేల్చిచెప్పింది. అంతర్జాతీయ ప్రయాణాలకు దూరంగా అమెరికాలోనే ఉండాలని తమ ఉద్యోగులను జేపీ మోర్గాన్ కోరింది.

ట్రంప్ నిర్ణయంపై పూర్తి స్పష్టత వచ్చే వరకు కనీసం రెండు వారాలు అమెరికాలోని ఉద్యోగులు ఎటూ వెళ్లొద్దని మెటా ఆదేశించింది. ఇతర దేశాల్లో ఉన్న హెచ్-1బీ, హెచ్-4 వీసాదారులంతా 24 గంటల్లోగా అమెరికాకు చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. కాగ్నిజెంట్ కూడా విదేశీ ప్రయాణాలు పెట్టుకోవద్దని ఆదేశించింది. అమెరికా నుంచి బయటకు వెళ్లడం, లేక ప్రవేశించడం కోసం హెచ్1బీ వీసా స్టాంపులు లేక పిటిషన్ ఆమోదాల వంటి ప్రక్రియలకు దూరంగా ఉండాలని పేర్కొంది. ట్రంప్ ఉత్తర్వులపై స్పష్టత వస్తేగానీ ఏ విధంగా ముందుకెళ్లాలో నిర్ణయించగలమని తెలిపింది.

హెచ్1బీ వీసాల్లో అమెజాన్, టీఎస్ఎస్ టాప్

ఈ ఏడాది జారీ అయిన హెచ్1బీ వీసాలలో అధికంగా అమెజాన్, టీఎస్ఎస్ కంపెనీలు పొందాయి. జూన్ నాటికి అమెజాన్‌లో హెచ్1బీ వీసాదారులు 10,044 మంది , టీఎస్ఎస్‌లో 5,505గా మంది ఉన్నారు. ఈ కంపెనీల తర్వాత స్థానాల్లో మైక్రోసాఫ్ట్ (5,189), మెటా (5,123), యాపిల్ (4,202), గూగుల్ (4,181), డెలాయిట్ (2,353), ఇన్ఫోసిస్ (2,004), విప్రో (1,523), టెక్ మహీంద్ర అమెరికన్స్ (951) ఉన్నాయి. ఈ మేరకు యూఎస్ సిటిజన్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) వెల్లడించింది.

నేడు భారీ వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ, ఉత్తర అంతర కర్నాటక మీదుగా దక్షిణ మహారాష్ట్ర తీరం వరకు ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో ఆదివారం కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉరుములతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల కింద నిలబడరాదని సూచించారు. ఆదివారం ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.

ముగిసిన మిథున్ రెడ్డి కస్టడీ విచారణ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : మద్యం కుంభకోణం కేసులో వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి రెండు రోజుల సిట్ కస్టడీ విచారణ ముగిసింది. విజయవాడ సిట్ కార్యాలయంలో అధికారులు ఆయనను రెండో రోజు శనివారం నాలుగు గంటల పాటు ప్రశ్నించారు. కస్టడీ విచారణ ముగిసిన అనంతరం ఏసీబీ కోర్టుకు హాజరుపరిచి కోర్టు ఆదేశాల మేరకు మరల రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. మద్యం కుంభకోణం కేసులో మిథున్ రెడ్డి ఏ 4 గా ఉన్నారు. కోర్టు అనుమతి మేరకు శుక్ర, శనివారాల్లో ఆయనను సిట్ అధికారులు కస్టడీ విచారణ జరిపారు. సిట్ అధికారుల ప్రశ్నలకు ఆయన సరైన సమాధానాలు చెప్పలేదని తెలిసింది. ప్రధానంగా మిథున్ రెడ్డి కుటుంబీకులకు చెందిన పీఎల్ఆర్ ప్రొడక్ట్స్ ఖాతాలోకి మద్యం ముడుపుల సొమ్ము రూ.5 కోట్లు జమ కావడంపై సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం.

మహారాణుల్ని చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఉచిత వైద్యం చేయించుకునే సౌకర్యాన్ని కల్పించినట్టు చెప్పారు. సన్నబియ్యాన్ని ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా అందజేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 96 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ జరుగుతుందన్నారు. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. పేదల పక్షాన రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ సంస్థలకు నెల నెలా బిల్లులు చెల్లిస్తుందని భట్టి తెలిపారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గత ప్రభుత్వంలో హైదరాబాద్ లో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వలేదని గుర్తు చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఒక ఏడాదిలోనే రూ.27 వేల కోట్ల బ్యాంక్ లింకేజీలు అందించినట్టు మంత్రి సీతక్క తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో కోట్లాది రూపాయల పొదుపు నిధులు ఎగవేయబడ్డాయని విమర్శించారు. బతుకమ్మ పండుగపైనా రాజకీయాలు చేయడం దుర్మార్గమని సీతక్క మండిపడ్డారు. మంత్రి గడ్డం వివేక్ మాట్లాడుతూ మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించటం ప్రభుత్వ సంకల్పమన్నారు. మహిళల సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యం అన్నారు. స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి, లక్షలాదిమంది మహిళల ఆర్థికశక్తికి ప్రభుత్వం పునాది వేసిందని మేయర్ విజయలక్ష్మి తెలిపారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, అశ్వరావుపేట శాసనసభ్యులు ఆదినారాయణ, టిఎస్ఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, కలెక్టర్ హరిచందన దాసరి, అడిషనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ పంకజ, కార్పొరేషన్ చైర్మన్లు, కార్పొరేటర్లు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

10 పార్టీలకు షోకాజ్ నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

అందజేయాలని ఆదేశిస్తూ, జాతీయ, స్థానిక పత్రికలలో ప్రచురణతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ ప్రజలకు తెలియజేయాలని సూచించారు. నోటీసులు అందుకున్న పార్టీలు... బహుజన రాష్ట్రమ్ సమితి (హైదరాబాద్), ఇండియన్ రక్షక నాయకుడు పార్టీ (నారాయణపేట), జై మహా భారత్ పార్టీ (జోగులాంబ గద్వాల్), జై స్వరాజ్ పార్టీ (రంగారెడ్డి), మజ్లిస్ మార్కజ్-ఏ-సియాసీ పార్టీ (హైదరాబాద్), నవ ప్రజారాజ్యం పార్టీ (ఆదిలాబాద్), న్యూ ఇండియా పార్టీ (పెద్దపల్లి), ప్రజా స్వరాజ్ పార్టీ (రంగారెడ్డి), శ్రమజీవి పార్టీ (మేడ్చల్-మల్కాజిగిరి), తెలంగాణ ఇంటి పార్టీ (నల్గొండ). సంబంధిత అధికారులు నిర్దిష్ట ఫార్మాట్‌లో సవివరమైన నివేదికలు తయారు చేసి, ఈ పార్టీలు కొనసాగించాలా లేదా గుర్తింపు రద్దు చేయాలా అన్న దానిపై స్పష్టమైన సిఫారసులు ఇవ్వాలని సీఎస్ఈఓ ఆదేశించారు.

ఆలయ భూములు కాపాడలేరా?

(మొదటిపేజీ తరువాయి)

అధికారులను ఆదేశించారు. దేవుడి భూములు కబ్జా చేస్తే పీడీ యాక్టు పెట్టాలన్నారు. ఎండోమెంటు ప్లీడర్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 2002-25 వరకు 1,500 కేసులు పెండింగ్ ఉన్నాయని, 543 కేసులను కొట్టివేశారని మంత్రికి ప్రభుత్వ ప్లీడర్లు వివరించారు. ఎండోమెంటు ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని, ట్రస్టీల వ్యవహారాల్లో వాదనలు గట్టిగా వినిపించాలని మంత్రి సూచించారు. పురావస్తు శాఖ సమాచారం ఆధారంగా వాదనలు బలంగా ఉండాలన్నారు. అందుకోసం నిపుణుల కమిటీ నియమించాలని మంత్రి చెప్పారు. ఎండోమెంటు కేసుల్లోని కోర్టు ధిక్కరణపై దృష్టి పెట్టాలన్నారు. ఈ విషయంలో న్యాయ బృందం, వారి పరిధిలోని వ్యవస్థ సమయానుచితంగా ఉన్నతాధికారులను అప్రమత్తం చేస్తూ, ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ అనుమతితో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని, పౌర సరఫరా విభాగం మాదిరిగా అది జరగాలని మంత్రి తెలిపారు. ఎండోమెంటు చట్టం మీద అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాకో న్యాయాధికారిని నియమించాలని, హైకోర్టుకు కూడా న్యాయాధికారి ఉండాలని, ఈవోల నుంచి ఒకరుండేలా న్యాయ విభాగ బృందం సూచనకు అంగీకరిస్తూ, ప్రతిపాదనలు తనకు పంపాలని మంత్రి సురేఖ సూచించారు.

యువత ఆకాంక్షలు విస్మరిస్తే ఉద్యమాలు తప్పవు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజల దృష్టిని మళ్లించడంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విజయం సాధించారని ఆరోపించారు. దేశ భవిష్యత్తుకు కీలకమైన అభివృద్ధి, ఆవిష్కరణలను మోదీ గాలికొదిలేశారన్నారు. చైనా, జపాన్, అమెరికా వంటి దేశాలతో పోటీపడి వారిని అధిగమించే ప్రయత్నం చేయాలే తప్ప, మనకన్నా వెనుకబడిన దేశాలతో పోల్చుకుని సంతృప్తి చెందడం సరికాదన్నారు. ముంబైలో శనివారం జరిగిన 'ఎన్డీటీవీ యువ 2025 - ది ముంబై చాప్టర్' సదస్సులో ముఖ్య అతిథిగా విచ్చేసిన కేటీఆర్ మాట్లాడుతూ... జెన్-జీ ఆలోచనలు, దేశ యువత ఆకాంక్షలు, ప్రభుత్వాల పాత్ర వంటి అంశాలపై తనదైన శైలిలో అద్భుతంగా ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. ప్రస్తుత తరం యువత (జెన్-జీ) కేవలం డిజిటల్ మీడియాకే పరిమితం కావద్దన్నారు. సమాజం పట్ల అపారమైన బాధ్యతతో పనిచేయాలన్నారు. జెన్-జీ శక్తిని తక్కువ అంచనా వేయద్దని పాలకులను హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 400 ఎకరాల అటవీ భూమిని అమ్మాలని ప్రయత్నిస్తే, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు అద్భుతంగా పోరాడి ప్రభుత్వ మెడలు వంచిన విషయాన్ని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆ భూముల విక్రయాన్ని నిలిపివేసిందన్నారు. ఇదే జెన్-జీ పవర్ అన్నారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే యువత, రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. యువశక్తిని దేశ నిర్మాణానికి వాడుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం తెలంగాణలో ఉంది. ప్రపంచంలోనే అమెజాన్‌కు అతిపెద్ద క్యాంపస్ హైదరాబాద్‌లో ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ (టీ-హబ్) హైదరాబాద్‌లో ఉంది. కేవలం 10 సంవత్సరాల్లోనే తెలంగాణ ఇన్ని చేయగలిగినప్పుడు, మిగతా భారతదేశం ఎందుకు చేయలేకపోయిందని కేటీఆర్ నిలదీశారు. సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల వంటి వారు అమెరికన్ కంపెనీలకు సీఈవోలు అయితే మనం సంతోషిస్తాం కానీ, మన దేశం నుంచి ఒక్క ప్రపంచ స్థాయి ఆవిష్కరణ కూడా రాలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మనకు వెంచర్ క్యాపిటల్ కాదు, అడ్వెంచర్ క్యాపిటల్ కావాలన్నారు. మనదేశంలోని 38 కోట్ల జెన్-జీ యువత సరికొత్త ఆలోచనలతో ప్రపంచ గతిని మార్చేందుకు ప్రభుత్వాలతో కలిసి పనిచేయాలన్నారు. ప్రస్తుతం తెలంగాణలో రీకాల్, రిగ్రెట్, రివోల్ట్ నడుస్తోందన్నారు. కాంగ్రెస్ పనితీరును బీఆర్ఎస్‌తో ప్రజలు పోల్చి చూసుకుంటు న్నారని చెప్పారు. త్వరలోనే అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడే అవకాశం ఉందన్నారు.

వైద్య వ్యవస్థలో మార్పులు అవశ్యం

(మొదటిపేజీ తరువాయి)

ఎన్సీడీ క్లినిక్‌లు, క్యాన్సర్ డే కేర్ సెంటర్లు పెట్టుకున్నామని గుర్తు చేశారు. డయాలసిస్ పేషెంట్లకు కొంతమేర ఆర్థికంగా బాసటగా నిలుస్తున్నామన్నారు. ప్రతి గ్రామం, పట్టణానికి సమీపంలోనే అవసరమైన అన్నిరకాల వైద్య సేవలు ఉచితంగా డయాలసిస్ పేషెంట్లకు అందాలన్నారు. రోగుల కుటుంబ సభ్యులు ఇబ్బంది పడే పరిస్థితి ఉండొద్దన్నారు. ప్రతి 20 లేదా 25 కిలోమీటర్లకు ఓ డయాలసిస్ సెంటర్ ఉండాలన్నారు.

ఇందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని హెల్త్ సెక్రటరీని మంత్రి ఆదేశించారు. ఇప్పటికే ఉన్న సెంటర్లలో అవసరమైనచోట మిషన్ల సంఖ్యను పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రజా ప్రభుత్వంలో కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం102 డయాలసిస్ సెంటర్లు ఉన్నాయన్నారు. 7,550 మంది రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారన్నారు. ఆరోగ్యశ్రీ కింద ప్రైవేట్ ఆసుపత్రుల్లో మరో 5,060 మందికి ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు.

డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో బతుకమ్మ ఆడిన మంత్రి సీతక్క

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: నాంపల్లి ఇంటర్ బోర్డు పక్కన ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభా రాణిలతో మంత్రి సీతక్క ఆట పాటలతో బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మనందరికీ స్ఫూర్తి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ఆమె పేరుపై నెలకొల్పిన ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులంతా, ఆమె స్ఫూర్తితో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఈ సంవత్సరం మొదటి బతుకమ్మ ఇందిరా ప్రియదర్శిని కాలేజీలో జరుపుకోవడం సంతోషంగా ఉందని, తెలంగాణకు పెద్ద పండుగ బతుకమ్మ అని, రకరకాల పూలతో బతుకమ్మలను తయారుచేసి ఆడబిడ్డలు బతుకమ్మ ఆడుతారన్నారు. తెలంగాణ మహిళల సామూహిక జీవన విధానానికి ఈ పండగ నిదర్శనం అని, పూర్వీకులు ఎన్నో చెరువులు తవ్వించారని, రామప్ప, లక్నవరం లాంటి పెద్ద పెద్ద చెరువులు ఎన్నో కట్టించారని, బోర్లు కాలువలు లేని కాలంలో వ్యవసాయం మొత్తం చెరువుల కిందనే సాగేదని పేర్కొన్నారు.రైతన్నలు పండించే నవధాన్యాలు ఈ సమయంలోనే కోతకు వస్తాయని, చెరువులే తెలంగాణకు జీవనాధారం అన్నారు. అందుకే అటువంటి చెరువుల్లో బతుకమ్మలను వదిలి ఆడబిడ్డలు తమ కృతజ్ఞతలు చాటుకుంటారని వివరించారు. కట్లపువ్వు గుమ్మడపువ్వు, తంగేడు పువ్వుకు నీటిని శుద్ధి చేసే గుణం ఉంటుందని, ఆడబిడ్డలంతా బతుకమ్మ దగ్గర కలుసుకొని తమ కష్టసుఖాలను పంచుకుంటారని, చిన్ననాటి మధుర జ్ఞాపకాలను చెరువుగట్ల వద్ద గుర్తు చేసుకుంటారని తెలిపారు. బతుకు నిచ్చిన చెరువులకు పూజలు చేసుకోవడమే బతుకమ్మ పండుగ అన్నారు. మనం ఎంత ఎత్తుకు ఎదిగినా బతుకమ్మ చరిత్రను మర్చిపోవద్దని, తాత్కాలిక వైఫల్యాలతో విద్యార్థులు వెనకడుగు వేయవద్దన్నారు. త్వరలో 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అమ్మాయిల కోసం బాలికా సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని, అమ్మాయిలకు విద్య అనేది ఎంతో ముఖ్యం, నక్సలైట్ ఉద్యమంలో పనిచేసి ఒక నిందితురాలుగా కోర్టులో జడ్జిల ముందు నిలబడే దాన్ని, కానీ ఆ తర్వాత నేనే అడ్వకేట్ నై నా కేసును నేనే వాదించుకున్నారు.ఆ తర్వాత రాజకీయాల్లో కి వచ్చి మంత్రిగా సేవ చేస్తున్నారు. విద్యతోనే ఈరోజు నేను ఈ స్థాయిలో నిలబడ్డాను, ఎన్ని కష్టాలు ఎదురైన మీరు కూడా మంచిగా చదువుకొని ఎదగాలని, బతుకమ్మ స్ఫూర్తితో శుభాకాంక్షలు పదిమందికి ఆదర్శంగా అమ్మాయిలు విజయాలు అందుకోవాలన్నారు. మీ కాలేజీ కి కావాల్సిన అదనపు తరగతి గదులను నిర్మించే అంశాన్ని పరిశీలిస్తామని, సీఎం దృష్టికి తీసుకెళ్లి క్లాస్ రూములు కట్టించే, ఏర్పాట్లు చేస్తామని, బతుకమ్మలను మంచిగా పేర్చిన పలువురు విద్యార్థినులను అభినందించి, మంత్రి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులు, సిబ్బంది ఆయుధాలపై పరిజ్ఞానం పెంచుకోవాలి

విశాలాంధ్ర - వనపర్తి : వనపర్తి జిల్లా పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీరావుల గిరిధర్ అన్నారు. శనివారం ఉదయం జిల్లా పోలీసు అధికారులు సిబ్బందికి జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఎర్రవల్లి 10వ పట్టాలియన్ ఫైరింగ్ రేంజ్‌లో ఈ ఏడాది ఫైరింగ్ ప్రాక్టీసు 3 రోజులు నిర్వహించారు. ఈ ఫైరింగ్ ప్రాక్టీసులో పోలీసులు వారి విధుల్లో వినియోగించే ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీసులో చేయించారు. ఒక్కొక్కరికి పది రౌండ్లు చేసే అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్, వనపర్తి జిల్లా సాయిదలాల అదనపు ఎస్పీ జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఫైరింగ్ చేసి ఆయుధ నైపుణ్యాన్ని పరీక్షించుకున్నారు. జిల్లా ఎస్పీ ఫైరింగ్ ప్రాక్టీసులో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. అదేవిధంగా ఫైరింగ్‌లో ప్రతిభను కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది, విధినిర్వహణలో వినియోగించే ఆయుధాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆయుధాలను క్రమం తప్పకుండా శుభ్ర పరచుకోవాలని ఆదేశించారు. సమయం దొరికినప్పుడు సిబ్బంది, అధికారులు వ్యాయామం చేయడం అనేది చాలా ముఖ్యం అని, మంచి శక్తి సామర్థ్యాలతో ఎలాంటి అనారోగ్యానికి గురి కాకుండా విధులు నిర్వహించాలి. చెడు అలవాట్లకులోను కాకూడదు అన్నారు. పోలీసులు మంచిజీవన విధానాన్ని అవలంబించాలన్నారు. క్రమశిక్షణతో డ్యూటీలను నిర్వర్తించాలని వనపర్తి జిల్లాకు, తెలంగాణ పోలీసుశాఖకి మంచిపేరు తీసుకురావాలన్నారు. వ్యాయామాన్ని నిత్య జీవితంలోనూ భాగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. స్పెషల్ బ్రాంచ్ సిఐ, నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్, రిజర్వు సబ్ ఇన్స్పెక్టర్లు, వినోద్, జిల్లాలోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా భావాన్ని పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : విద్యార్థులు చదువుతో పాటు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి సిహెచ్ మదార్ గౌడ్ అన్నారు. జిల్లాలోని నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మర్సకట్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో 50 మంది వాలంటీర్లతో రామన్నగూడెం గ్రామంలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరం శనివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి సిహెచ్ మదార్ గౌడ్ హాజరై వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సేవా భావాన్ని పెంపొందించుకోవాలని, ఏడు రోజులపాటు జరిగే ప్రత్యేక శిబిరంలో గ్రామంలో ప్రధానంగా స్వచ్ఛభారత్, మొక్కల నాటడం, ఆరోగ్య శిబిరం, మూఢనమ్మకాలు, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ క్రైమ్, కెరీర్ గైడెన్స్ రోడ్డు భద్రత వంటి అంశాలపై అవగాహన సమావేశంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఎ. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉత్తమ పౌరుడిగా ఎదగడానికి మంచి వేదిక ఎన్ఎస్ఎస్ అని, ఎన్ఎస్ఎస్‌లో చేరడం వల్ల వాలంటీర్లు సద్గుణాలను పెంపొందించుకొని దేశ అభివృద్ధిలో కీలకపాత్ర వహిస్తారని తెలిపారు. స్కూల్ హెడ్ మాస్టర్ మచ్చా సోమయ్య, కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, యాకన్న, సతీష్, కవిరాజ్, బాబు, నాగేశ్వరరావు, రామ్మూర్తి ఉపాధ్యాయ బృందం బుచ్చిరాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మాజీ సర్పంచ్

విశాలాంధ్ర-మరిపెడ: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వీరారం గ్రామ మాజీ సర్పంచ్ దుస్స నరసయ్య మానవత్వం చాటుకున్నాడు. ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచులు లేక అనేక సమస్యలు తాండవిస్తున్నాయి. సమస్యలపై స్పందించిన మాజీ సర్పంచ్ తనవంతుగా గ్రామానికి తనవంతుగా సహకారం అందించాడు. దసరా పండుగను పురస్కరించుకొని తన డోజర్ వాహనం, సొంత ఖర్చులు వెచ్చించి గ్రామంలోని బతుకమ్మ ప్రాంగణాన్ని శుభ్రం చేశాడు. అదేవిధంగా గ్రామంలోని అన్ని అంతర్గత వీధులకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశాడు. గ్రామంలోని ఆడపడుచులు బతుకమ్మలు చేత పట్టుకొని పురవీధుల నుంచి వెళ్లే విధంగా వీధులన్నీ శుభ్రం చేయించారు. తన వంతుగా గ్రామానికి తోడ్పాటు అందించనున్నట్లు మాజీ సర్పంచ్ నరసయ్య తెలిపారు. గతంలో గ్రామ అభివృద్ధికి పాటుపడిన మాజీ సర్పంచ్ ప్రస్తుతం కూడా గ్రామంలో తన వంతుగా సమస్యలకు పరిష్కారానికి కృషి చేస్తున్న మాజీ సర్పంచ్ దుస్సా నరసయ్యను గ్రామస్తులు అభినందించారు.

నేరస్థులకు శిక్ష పడేలా కృషిచేయాలి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: నేరస్థులకు శిక్ష పడేలా కోర్టు కానిస్టేబుళ్లు కృషి చేయాలని రామగుండం పోలిస్ కమీషనర్ అంబర్ కిశోరే ఝా అన్నారు. రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో పనిచేస్తున్న కోర్టు డ్యూటీ అధికారులు, లైజనింగ్ అధికారులతో ఆయన శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్థులకు శిక్షపడే విధంగా సాక్షులను ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరిగేలా చూడాలని సీపీ సూచించారు. కోర్టులో బాధితులకు న్యాయం జరిగే విధంగా మానవత్వంతో మెదలాలని కోరారు. దోషులకు శిక్ష పడడంతో కోర్టు కానిస్టేబుళ్ల బాధ్యత చాలా కీలకమైదని అన్నారు. ఈ సందర్భంగా కేసులో నిందితునికి శిక్ష పడడంలో కీలకమైన బాధితురాలి సాక్ష్యాన్ని అనువదించిన కే.యోసేపుని సీపీ సన్మానించినారు. సమీక్ష సమావేశంలో గోదావరి ఖని ఏసీపీ ఎం.రమేష్, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, లీగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ఐటి సెల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, సిసి ఆర్‌బి ఎస్ఐ చంద్ర కుమార్, సిసి హరీష్‌తో పాటు పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల కోర్టు డ్యూటీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

తెలంగాణ సాంప్రదాయ పండుగ బతుకమ్మ

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : పెద్దపల్లి మండలం మారేడుగొండ బడి ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించడం జరిగింది. లయన్స్ క్లబ్ శ్రీ శక్తి ప్రెసిడెంట్ అనిత మాట్లాడుతూ తెలంగాణ సాంప్రదాయం పండుగ అయినటువంటి బతుకమ్మ పండుగను సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని మన సాంప్రదాయాలకు విలువ ఇవ్వాలని విద్యార్థులకు చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జానకి దేవి మేడం లయన్స్ క్లబ్ పెద్దపల్లి శ్రీశక్తి ప్రెసిడెంట్ లైసెట్టి అనిత, రేకులపల్లి సుష్మ, రజిత పవిత్రం, వేల్పుల సుజాత పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు, విద్యార్థుల తల్లులు పాల్గొనడం జరిగింది.

అంగన్వాడీలు, ప్రాథమిక పాఠశాలలు, హాస్టళ్లను

ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సందర్శించాలి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్లు తప్పనిసరిగా వారి పరిధిలోని అంగన్వాడీలు, ప్రాథమిక పాఠశాలలు, హాస్టళ్లను సందర్శించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం ఆమె నల్గొండ జిల్లా, వేములపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పి హెచ్ సి డాక్టర్లు ఆర్ బి ఎస్ కే బృందాలతో కలిసి అంగన్వాడీలు, పాఠశాలల విద్యార్థుల ఆరోగ్య పరీక్షలకు వెళ్లిన సందర్భంగా మెరుగైన చికిత్స కోసం విద్యార్థులను పై ఆసుపత్రులకు రెఫరల్ చేయవలసి వస్తే ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులకు పంపించాలని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన వివరాలన్నింటిని రిజిస్టర్‌లో నిర్వహించాలని తెలిపారు. ఆర్ బి ఎస్ కే బృందాలు విద్యార్థులకు నిర్వహించే ఆరోగ్య పరీక్షలలో భాగంగా ప్రభుత్వం ద్వారా జారీ చేసిన ప్రొఫార్మాలు, నివేదికలలో అన్ని విషయాలు పొందుపరచాలని అన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వైరల్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారిని నిరంతరం పరీక్షిస్తూ వారికి నయమయ్యే విధంగా చికిత్స అందించాలని అన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ వేములపల్లి కేజీబీవీని ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కాగా ఆదివారం నుండి పాఠశాలలకు దసరా సెలవులు ఇచ్చినందున విద్యార్థులను తీసుకువెళ్లేందుకు వారి తల్లిదండ్రులు పాఠశాలకు రాగా, జిల్లా కలెక్టర్ విద్యార్థినిల తల్లిదండ్రులతో మాట్లాడారు. భోజనం, చదువు ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని ఎస్ఓకు సూచించారు. డాక్టర్ సుచరిత, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఉన్నారు.

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

విశాలాంధ్ర - కోదాడ : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగా అని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, గర్ల్స్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ పుల్లారి వెంకట నారాయణ అన్నారు. శనివారం ముందస్తు బతుకమ్మ సంబరాలను పాఠశాల, కళాశాల ఆవరణంలో విద్యార్థినిలతో కలిసి నిర్వహించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పువ్వుల పండుగా కేవలం తెలంగాణలో మాత్రమే ఉందని, తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో దేవతలను కొలిచే ప్రత్యేక సంస్కృతి తెలంగాణ ఆడపడచుల గొప్పతన మన్నారు. ప్రకృతితో ముడిపడి ఉన్న గొప్ప సంస్కృతి కేవలం తెలంగాణలోనే ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు తయారు చేసిన బతుకమ్మలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఇంచార్జ్ బోయినపల్లి గోవర్ధన్, ఉపాధ్యాయులు రాయుడు, కన్నయ్య, రవీందర్ నాయక్, ఆంజనేయులు, దుర్గా ప్రసాద్, వెంకటరెడ్డి, రూబెన్, విజయ్, వెంకటేష్, సుజాత, బ్రాహ్మణి, రెహానా, శాంత కుమారి, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఉన్నత స్థానాలు సాధించండి : కలెక్టర్

విశాలాంధ్ర - సూర్యాపేట బ్యూరో : ఆకాశమే హద్దుగా అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే - 2025 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థినిలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి సాంకేతిక, కృత్రిమ మేధస్సు యుగంలో స్వతంత్ర ఆలోచనలతో భవిష్యత్తులో ఏమి అవ్వాలో నిర్ణయించుకుని, పట్టుదలతో కృషి చేస్తే తప్పక విజయాలు సాధించవచ్చని సూచించారు. పదో తరగతి నుండి డిగ్రీ వరకు విద్యార్థులకు ఎన్నో క్లిష్ట పరిస్థితులు ఎదురైనా వాటిని అధిగమిస్తూ, ఏ సబ్జెక్టుపై ఆసక్తి ఉంటదో ఆ సబ్జెక్టుపై నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు దక్కుతాయని వివరించారు. పట్టభద్రులైన విద్యార్థినిలందరికీ ఇంజనీరింగ్ కాలేజీల ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం లభించడం సంతోషకరమని, ఇలాగే కృషి చేస్తూ ఉన్నత స్థానాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం 108 మంది విద్యార్థినిలకు పట్టా సర్టిఫికెట్లు అందజేశారు. పరిశ్రమల శాఖ జిఎం సీతారాం, ప్రిన్సిపల్ సుజాత, హెచ్‌ఓడీలు బివి.రావు, రాజేశ్వరరావు, అంజయ్య, అధ్యాపకులు హాజరయ్యారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి

విశాలాంధ్ర-నేరేడుచర్ల : ప్రతి ఒక్కరు సంస్కృతి సంప్రదాయం కాపాడుకోవాలని అంజలి ఇంగ్లీష్ మీడియం అన్నారు. శనివారం బతుకమ్మ పండుగ సందర్భంగా స్థానిక అంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో సైది రెడ్డీ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రజలు ప్రకృతిలో పూసే పువ్వులతో నిర్వహించడం ఆ సంస్కృతి సంప్రదాయాలకు ప్రత్యేక అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మ వద్ద పెట్టి పూజలు నిర్వహించారు. అనంతరం పాట పాట నిర్వహించి బతుకమ్మ స్థానిక జాన్ పహాడ్ మేజర్ కలల్లో వదిలిపెట్టారు. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం : కాగజ్‌నగర్ మున్సిపల్ కార్మికులు గత కొద్ది రోజులుగా కొనసాగించిన సమ్మెను శనివారం విరమించారు. జీతాల బకాయిల పరిష్కారం కోసం ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ జోక్యం చేసుకోవడంతో కార్మికులు ఉద్యోగాల్లో చేరేందుకు అంగీకరించారు. ఇటీవల ఎమ్మెల్సీ దండే విఠల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, పరిష్కారం దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులతో సమావేశమైన ఎమ్మెల్సీ విఠల్ మాట్లాడుతూ మూడు నెలలుగా బకాయి ఉన్న జీతాలలో రెండు నెలల జీతాలను సోమవారం విడుదల చేస్తామని, మిగిలిన ఒక నెల జీతాన్ని సెప్టెంబర్ 30లోపు అందజేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. అదే సమయంలో తమ పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను కూడా పరిష్కరించాలంటూ విజ్ఞప్తి చేయగా, ఎమ్మెల్సీ విఠల్ సానుకూలంగా స్పందించారు.

పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు

విశాలాంధ్ర - గూడూరు : బతుకమ్మ, దసరా పండుగలను శనివారం గూడూరు మండలంలోని కొంగరి గిద్ద, గూడూరు, చంద్రుగూడెం, లక్ష్మీపురం గిరిజన ప్రాథమిక పాఠశాల, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు రకరకాల పూలతో బతుకమ్మను పేర్చి మధ్యలో గౌరవం అని పెట్టి బతుకమ్మ ఆటపాటలతో సందడి వాతారణం నెలకొన్నది. కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు పెనుక ఎల్లయ్య, ఉపాధ్యాయులు వట్టం నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ తాటి అమృత, ఉపాధ్యాయులు వీరయ్య, హాస్టల్ వార్డెన్ దేవా దేవి, ప్రధానోపాధ్యాయులు ఎండి షాహిన్, సిఆర్పి నరేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద మందులతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - తొర్రూరు: ప్రజలు ఆయుర్వేద మందులను వాడడం వలన ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఆయుర్వేద సీనియర్ వైద్యులు డాక్టర్ పాలడుగు కిరణ్ కుమార్ అన్నారు. ఈ నెల 23న ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా స్థానిక సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదం పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని కోరారు. స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్‌లో ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను అందిస్తామని తెలిపారు. ఎలాంటి సమస్య ఉన్న నేరుగా ఆసుపత్రికి రావాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సందర్భంగా విద్యార్థులకు మహిళలకు స్వశక్తి స్వస్థనారి పరివార్ అయోధ్య అనే కార్యక్రమంపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - చర్ల : మత్తుకు బానిసలు కాకుండా మంచి స్నేహాలు, సన్మార్గం పయనించాలని యువతకు భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ శివనాయక్ పిలుపునిచ్చారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో చర్ల మండల యూత్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు- భవిష్యత్తులో దుష్ప్రభావాలు "అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివ నాయక్ మాట్లాడుతూ నేడు యువత మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చర్ల మండలం ఛత్తీస్ ఘడ్ రాష్ట్రానికి సరిహద్దున ఉన్నందున డ్రగ్స్ సరఫరా జరుగుతుందాన్నారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యం వైపు పట్టుదలగా శ్రమించి పయనిస్తె బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. సీఐ రాజు వర్మ మాట్లాడుతూ డ్రగ్స్ వద్దు... చదువే ముద్దు.. సెల్ ఫోన్ వద్దు... జీవితం ముఖ్యం అన్నారు. నేటి తరం విద్యార్థులకు ఫోన్ కూడా ఒక వ్యసనంలో మారిందన్నారు. సెల్ఫోన్ ద్వారా నాలెడ్జిని పెంపొందించుకోవాలి తప్ప అనవసరమైన చాటింగ్లు, వీడియోలు, సైట్లు జోలికి పోవద్దని సూచించారు. విద్యార్థుల పట్ల ముఖ్యంగా తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని, ఉపాధ్యాయులపై కూడా తీర్చిదిద్దే బాధ్యత ఉందన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు అవులూరి సత్యనారాయణ, సాధనపల్లి సతీష్, భాష్యం శారద, దాట్ల సంధ్య, యలమందల జగదీష్, చల్లా శివ కృష్ణ, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ నరేంద్ర, డాక్టర్లు దివ్య, రామకృష్ణ, నగేష్, మండల విద్యాశాఖ అధికారి పరిటాల వెంకటరమణ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవులు, చర్ల మండల యూత్ సభ్యులు నరసింహారెడ్డి, పరిటాల సంతోష్ కుమార్, కొట్టే నవీన్, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను సాధించడానికి బ్యాంకర్లు సహకరించాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం : ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనలో భాగంగా సకాలంలో రుణాలు అందించి బ్యాంకర్‌లు సహకరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కోరారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో కలెక్టర్ భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రీణాల్ శ్రేష్టతో కలిసి జిల్లాలో ఉన్న బ్యాంకర్లు, జిల్లా అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులకు రుణాల పంపిణీ, స్వశక్తి సంఘాల రుణాలు- రికవరీ, పీఎం స్వానిధి రుణాలు, ఎఫ్.పి.ఒల ఏర్పాటు పై చర్చించారు. ఈ ఏడాది రూ. 2291 కోట్ల పంట రుణ లక్ష్యానికి సెప్టెంబర్ చివరి వరకు కేవలం రూ.409.55 కోట్లు, రూ.1416.09 కోట్ల వ్యవసాయ టర్మ్ రుణాలకు గాను కేవలం 342.31 కోట్లు రుణాలను అధికారులు అందించినట్లు సమీక్షలో వెల్లడి అయింది. తెలంగాణ గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తక్కువ పంట రుణాల పంపిణీ గల కారణాలను కలెక్టర్ ఆరా తీశారు. స్వయం శక్తి సంఘాలకు చేపల పెంపకం యూనిట్లు, కౌజు పిట్టల పెంపకం తదితర యూనిట్ల స్థాపనకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలకు తక్కువగా రుణాలు అందించిన అన్ని బ్యాంకులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న 3 నెలల కాలంలో 500 యూనిట్ల స్థాపనకు బ్యాంకర్లు సహకరించాలని స్పష్టం చేసారు. జిల్లా ప్రజలు అభివృద్ధి కోసం చేపట్టే యూనిట్ల స్థాపనకు అన్ని బ్యాంకులు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి విద్యాచందన, ఎల్ డి ఎం రామ్ రెడ్డి, మెప్మా పీడీ రాజేష్, వివిధ బ్యాంకు మేనేజర్లు , సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ

విశాలాంధ్ర - ఖమ్మం : దేశంలో రోజు రోజుకు కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని పెరిగిన అవసరాలకు అనుగుణంగా జాతీయ మహాసభల్లో కార్యాచరణ రూపొందించ నున్నట్లు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. పార్టీ విస్తరణ, సైద్ధాంతిక అవగాహన, ప్రజా పోరాటాలే ఎజెండాగా మహాసభలు జరగనున్నాయన్నారు. శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్ లో జరిగిన ప్రజా సంఘాల సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ సిపిఐ 25వ జాతీయ మహాసభలు ఈనెల 21 -నుంచి 25 వరకు ఛండిఘర్లో జరగనున్నాయన్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ మహాసభల్లో వివిధ ప్రాంతాల్లో పార్టీ పరిస్థితులు, విస్తరణపై దృష్టి సారించాలని ఎజెండా రూపొందించడం జరిగిందన్నారు. 21వ తేదీన మొహలీలో జరిగే ప్రదర్శన, బహిరంగ సభతో సమావేశాలు ప్రారంభం కానున్నాయన్నారు. బిజెపితో దేశానికి ఎప్పటికైనా ప్రమాదమేనని ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయించిందని, ప్రభుత్వ రంగాన్ని సైతం ప్రైవేటీకరిస్తూ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తుందన్నారు. ముఖ్యంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థను పరిశీలిస్తే సంపద కొద్ది మంది చేతుల్లో పోగుపడుతుందని ఇది భవిష్యత్తులో దేశంలో అశాంతికి దారి తీస్తుందని హేమంతరావు తెలిపారు. ఖమ్మంజిల్లా ప్రతినిధి వర్గం శనివారం సాయంత్రానికి మొహలీ చేరుకుంటుందని ఈ జిల్లా నుంచి ఎనిమిది మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. యర్రాబాబు అధ్యక్షతన జరిగిన - సమావేశంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చేయూత పింఛన్లు పెంచాలి

విశాలాంధ్ర - భద్రాచలం : చేయూత పింఛన్ దారులకు పెన్షన్ పెంపు కోసం గ్రామ పంచాయితీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ కార్యక్రమం ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. ఇందులో మండల అధ్యక్షుడు బొక్కా వినేష్ మాదిగ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గుండే సుహాసిని మాదిగ నాయకత్వం వహించారు. అనంతరం పంచాయతీ ఈఓ శ్రీనివాసరావుకు మెమోరాండం అందించారు. దింతో ఈవో స్పందించి ఉన్నత అధికారుల దృష్టికి ఈ సమస్యలు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన చేయూత పెన్షన్ పెంపు హామీని గాలికొదిలేసిందని బొక్కా వినేష్ మాదిగ అన్నారు. ఈ కార్యక్రమంలో మంద నవీన, తిప్పనపల్లి సమత, సముద్రాల బుజ్జి, షేక్ బేగం, ఆదిలక్ష్మి, చేయూత పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

సిపిఐ జాతీయ మహాసభలకు వెళ్లిన ప్రతినిధులు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ఈ నెల 21 నుంచి ఐదు రోజులపాటు పంజాబ్ రాష్ట్రంలోని చండీఘర్లో జరగనున్న సిపిఐ జాతీయ మహాసభలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి తొమ్మిది మంది ప్రతినిధులకు అవకాశం లబించించి. ఈ ప్రతినిధులు బృందంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వర్ రావు, నరాటి ప్రసాద్, సారెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, ఎస్ డి. సలీం, సలిగంటి శ్రీనివాస్, దేవరకొండ శంకర్ వున్నారు. శనివారం విరంతా చండీఘర్ బయలుదేరివెళ్లారు. రాష్ట్ర పార్టీ కోటా నుంచి కొత్తగూడెంకు చెందిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రతినిధిగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ రాష్ట్రంలోని కోల్ బెల్ట్ ప్రాంతాల్లో ప్రతిపాదనలో వున్న నూతన బొగ్గుగనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, అదేవిధంగా మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీపథకం, వన్ ఆఫ్ సెవెంటీ చట్టంఅమలు, కార్మిక చట్టాల అమలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, గ్రామీణ ప్రాతంలో గిరిజన, గిరిజనేతర పేదల భూ సమస్యలు, విమానాశ్రయం, జిల్లాలో కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు వంటి ప్రధాన సమస్యలు అంశాలపై కొత్తగూడెం జిల్లా తరుపున తీర్మానం ప్రవేశపెడతామని తెలిపారు.

ఘనంగా ప్రభుత్వ కళాశాలలో ఫ్రెషర్ డే వేడుకలు

విశాలాంధ్ర - పెనుబల్లి : పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పెనుబల్లి మండలం విద్యా, వైద్య రంగాలకు నిలయమని అన్నారు. ప్రభుత్వ కళాశాలలలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ లో ఎంసెట్, జూనియర్ కాలేజీలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు డాక్టర్ మట్టా దయానంద్ చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ అభివృద్ధికీ సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయికి కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, కిసరీ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, నియోజకవర్గం యూత్ అధ్యక్షులు పసుమర్తి విశ్వనాథ్, జిల్లా అధికార ప్రతినిధి పొట్లపల్లి వెంకటేశ్వరరావు, బొర్రా కోటేశ్వరావు, మేకతోట్టి కాంతయ్య, అలుగోజు చిన్న స్వామి, అన్నపురెడ్డి శ్రీనివాస్, వంగా దామోదర్, నవ జీవన్, గోగినేని రమేష్, మిట్టపల్లి కిరణ్, దొంతు మాధవ్, మల్లెల రాజా, భూక్యా ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

దసరా ఉత్సవాలకు మతం రంగు చెల్లదు

మతంకన్నా సంస్కృతి చాలా విస్తృతమైంది. మతం సంస్కృతిలో భాగం కావొచ్చు కానీ సంస్కృతికన్నా మించిన స్థానం మతానికి ఉండదు. సంస్కృతికి ఒక మతంతో బంధం ఉండొచ్చు. కానీ మతమే సంస్కృతి కాదు. కానీ సంస్కృతీ సంప్రదాయాలకు మతం ముసుగు కప్పి విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు ఈ మధ్య కాలంలో మితిమీరి పోయాయి. సంఘ్ పరివార్, దానికి అనుబంధమైన భారతీయ జనతా పార్టీలది ఈ ధ్వంస రచనలో గురుపీఠం. దీనికి తాజా ఉదాహరణ చూస్తే ఈ పన్నాగాలు రాను రాను ఎంత తీవ్రమవుతున్నాయో, మతాధిపత్యాన్ని సర్వవ్యాప్తం చేసే కుట్రలు జరుగుతున్నాయో తేలిపోతోంది. ఇలాంటి వారికి మతాభినివేశం కన్నా మతతత్వం ఎక్కువ. సంస్కృతి మీది వారికి కనీస అవగాహన ఉన్నట్టు కూడా కనిపించదు. మన దేశంలో రెండు రాష్ట్రాలలో ప్రభుత్వమే నిర్వహించే సంస్కృతిక ఉత్సవాలు ఉన్నాయి. ఒకటి బెంగాల్‌లో దుర్గా ఉత్సవాలు. రెండు మైసూరులో దసరా ఉత్సవాలు. ఈసారి మైసూరు దసరా ఉత్సవాలకు ఇటీవలే బుకర్ ప్రైజ్ అందుకున్న బానూముస్తాఖ్‌ను ఆహ్వానించాలని కర్నాటక ప్రభుత్వం నిర్ణయించింది. బానూముస్తాఖ్ బుకర్ ప్రైజ్ సాధించడం కన్నడ సాహిత్యానికి, కర్నాటక ప్రజలకు మాత్రమే గర్వకారణం కాదు. రచయిత్రిగా బానూ ముస్తాఖ్‌కు బుకర్ ప్రైజ్ రావడం దేశవాసులందరూ గర్వించదగ్గ విషయం. బానూ ముస్తాఖ్‌ను మైసూరు దసరా ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తున్నామని, ఆ ఉత్సవాలను ఆమే ప్రారంభిస్తారని మైసూరు జిల్లా పాలనా విభాగం గత మూడో తేదీన ప్రకటించింది. మత దృష్టి తప్ప సాంస్కృతిక దృక్కోణం ఎంత మాత్రం లేని వారికి ఇది విపరీతంగా అభ్యంతరకరం అయిపోయింది. ఇక అంతే! సింహప్రతాప్ అనే బీజేపీ నాయకుడి అధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు మొదలైనాయి. ఆమెను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేస్తున్న వారు కర్నాటక హైకోర్టుకెక్కారు. గత 15 న హైకోర్టు ఈ పిటిషన్‌ను కొట్టేసింది. కానీ మతతత్వం నషాళానికి ఎక్కిన వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం ఈ వ్యవహారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు విక్రంనాథ్, సందీప్ మెహతాతో కూడిన బెంచి ముందుకు వచ్చింది. బానూ ముస్తాఖ్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తున్న వారి తరపు న్యాయవాది సురేశ్ ఈ అంశాన్ని ప్రస్తావించగానే న్యాయమూర్తి విక్రంనాథ్ ఈ పిటిషన్‌ను కొట్టేస్తున్నాం అన్నారు. ఆ న్యాయవాది తన వాదనలు వినిపించడానికి మూడు నిముషాల వ్యవధి ఇవ్వాలని కోరారు. న్యాయమూర్తి సరేనన్నారు. ముస్తాఖ్‌ను ఆహ్వానించడం రాజ్యాంగంలోని 25 వ అధికరణానికి వ్యతిరేకం అని న్యాయవాది సురేశ్ అన్నారు. వెంటనే న్యాయమూర్తి విక్రంనాథ్ మళ్లీ "కొట్టేస్తున్నాం" అన్నారు. మళ్లీ ఆ న్యాయవాది మాట్లాడడం మొదలు పెట్టి ముస్తాఖ్‌ను దసరా సమారోహాలకు ఆహ్వానించడం హిందువుల ఆరాధనా పద్ధతులకు విఘాతం కలిగించడం అన్నారు. మళ్లీ విక్రమనాథ్ "కొట్టేస్తున్నాం" అన్నారు. మీరు రాజ్యాంగ పీఠిక చదవారా అని సదరు న్యాయవాదిని నిలదీశారు. మైసూరు దసరా ఉత్సవాలు చాముండేశ్వరీ ఆలయం వేదికగా జరుగుతాయి. ఆ ఆలయంలో దీపారాధన, హారతి లాంటివి ఉంటాయి. ఇవి మతాచారాలే తప్ప సెక్యులరిజంలో భాగం కావు అని న్యాయవాది రెట్టిస్తే న్యాయమూర్తి విక్రంనాథ్ మళ్లీ "కొట్టేస్తున్నాం, కొట్టేస్తున్నాం, కొట్టేస్తున్నాం" అని మూడు సార్లు చెప్పారు. బానూముస్తాఖ్ అనేక సార్లు హిందువులకు వ్యతిరేకంగా మాట్లాడారన్న సురేశ్ వాదనను కూడా న్యాయమూర్తులు ఖాతరు చేయలేదు. న్యాయమూర్తులు ఇలా వ్యవహరించడానికి రాజ్యాంగ పీఠికలో ఉన్న "సెక్యులరిజం" అన్న భావనకు కట్టుబడి ఉండాలన్న సంకల్పమే ప్రధాన కారణం.

భానూముష్తాఖ్‌ను దసరా ఉత్సవాలకు ఆహ్వానించడం సాహిత్యం, సంస్కృతికి ఎత్తిపట్టిన నివాళిగా కర్నాటకలోని రచయితలు, మేధావులు, ఆలోచనాపరులు భావించారు. ఉత్సవాలు దసరా పండగ సందర్భంలో జరుగుతాయి. కానీ ఇవి హిందూ మతానికి పరిమితమైనవి కావు. దసరా ఉత్సవాలు అక్కడి సంస్కృతికి చిహ్నం. సోమవారం మొదలయ్యే ఈ ఉత్సవాలలో జరిగే పూజాదికాలు హిందూ ఆచారాల్లో భాగం కనక ఓ ముస్లింకు వీటిని ప్రారంభించే అవకాశం ఇవ్వడం కుదరదని సంఘ్ పరివార్ వారి వాదన. ఇందులో దీపం వెలిగించడం, కుంకుమ, పసుపు, పళ్లు, పూలు ఉంటాయి కనక ఇది హిందూ సంప్రదాయమేనని వితండవాదానికి దిగుతున్నారు. వాస్తవం ఏమిటంటే ఈ దసరా ఉత్సవాలు ఎప్పటి నుంచో ప్రభుత్వమే ఒక వేడుకగా నిర్వహిస్తోంది. ఈ ఉత్సవాలలో ఇతర మతాల వారు పాల్గొనడం రాజ్యాంగోల్లంఘన కాదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు భావించారు. ఈ అభిప్రాయానికి నిబద్ధులై ఉన్నారు. న్యాయమూర్తులు బీజేపీ నాయకులు పిటిషన్‌ను కొట్టి వేయడం అంటే రాజ్యాంగ పీఠికకు, అందులో ఉన్న "సెక్యులర్" అన్న మాటకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడమే. ఏ ఉత్సవాలలోనైనా అన్య మతస్థులు పాల్గొనడం ఏ మత భావాలకూ విరుద్ధమైంది కాదు. మొహర్రం సందర్భంగా పీర్లు మోసేది సాధారణంగా హిందువులు అన్న వాస్తవం తెలియని వారు దసరా ఉత్సవాలలో భానూముస్తాఖ్ పాల్గొనడాన్ని సహించడం లేదు. బెంగాల్‌లో దుర్గా ఉత్సవాల సందర్భంగా వేల సంఖ్యలో అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. విగ్రహాలు ఎవరు తయారు చేసినా అమ్మవారి కేశాలంకరణ చేసేది మాత్రం ముస్లింలే. ఇదంతా హౌరాలోని ఓ బస్తీలో జరుగుతుంది. ఆ బస్తీ పేరు పార్వతీపురం. కానీ అక్కడ విగ్రహాలను దిద్ది తీర్చడంలో ప్రధాన పాత్ర ముస్లింలదే. అవే విగ్రహాలను బెంగాల్ అంతటా ఏర్పాటు చేస్తున్నారు కదా. ముస్లింలు కేశాలంకరణం చేసినంత మాత్రాన ఆ విగ్రహాలకు అదనపు సొబగులు అద్దినట్టు అయిందే తప్ప అవి మైలపడి పోలేదు. మతాంతరీకరణకూ గురి కాలేదు. ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్ పట్టణంలో మాతా మందిరం ఉంది. ఆ మందిరం మేనేజింగ్ ట్రస్టీ (నిర్వాహక ధర్మ కర్త) మహమ్మద్ అలీ. హిందూ దేవాలయానికి ఓ ముస్లిం ధర్మకర్తగా ఉండడం మన సెక్యులర్ విధానాల ఫలితమే. మహమ్మద్ అలీ నిష్ఠా గరిష్ఠుడైన ఇస్లాం మతానుయాయి. రోజుకు అయిదు సార్లు నమాజ్ చేస్తారు. సాయంత్రం దేవికి హారతి ఇస్తారు. ఇది భారత్ అన్న భావనకు సంకేతం. రాజ్యాంగ నిర్మాతల ఆశయానికి ప్రబల నిదర్శనం. కర్నాటక ప్రభుత్వం బానూ ముస్తాఖ్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకించే వారిలో కేవలం ముస్లిం వ్యతిరేకతే లేదు. మహిళ ఎదుగుదలను సహించే తత్వం బొత్తిగా లేదు. ఒక మహిళ, అందునా ముస్లిం స్త్రీ ఇంత ఉన్నత స్థాయికి వెళ్లడం సంఘ్ పరివార్ వారికి మింగుడు పడడం లేదు. కానీ రాజ్యాంగాన్ని, రాజ్యాంగ పీఠికలోని అంశాలను పరిరక్షించే పట్టుదల ఉన్న న్యాయమూర్తులు ఇంకా మిగిలే ఉన్నారు. అందుకు అందరం గర్వపడాల్సిందే. బుకర్ ప్రైజ్ తెచ్చిపెట్టిన "హార్ట్ లాండ్" ను బానూముస్తాఖ్ రాసింది కన్నడంలో అన్న జ్ఞానం కూడా లేకపోవడం జుగుప్స కల్గిస్తోంది.

ఇండియాపై ట్రంప్ మరో దెబ్బ

టి.ఎస్.అశోక్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇండియా తదితర దేశాలపై మరో గట్టి దెబ్బ కొట్టాడు. భారతదేశంపై కక్ష కొద్దీ 50 శాతం సుంకాలు విధించినా భారత ప్రభుత్వం ముఖ్యంగా ప్రధాని మోదీ మౌనం వహించారే గాని తీవ్రంగా స్పందించలేదు. ఇప్పుడు హెచ్-1బి వీసా దరఖాస్తుకు లక్ష డాలర్ల సర్‌ఛార్జీని విధించి ఇండియా తదితర దేశాలలోని యజమానులకు విదేశీ ఉద్యోగులకు ఆశ్చర్యం కల్పించాడు. ఉన్నత విద్యారంగంలో ఉన్నవారు సైతం లక్ష డాలర్ల సర్‌ఛార్జీని చెల్లించవలసిందే. 2025 సెప్టెంబరు 19న ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులు జారీ చేశారు. వీసా ఫీజులను సాధారణంగా సర్దుబాటు చేయడంలేదు. అమెరికాలో భారతదేశం నుంచి వెళ్లి టెక్ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు ఉన్నత స్థాయి విద్యనభ్యసించే విద్యార్థులు పెంచిన సర్‌ఛార్జీని చెల్లించవలసిందేనని ప్రకటించారు. ఇతర దేశాల నుంచి వచ్చి ఇక్కడ పనిచేసే వారి సంఖ్యను తగ్గించడమే ట్రంప్ లక్ష్యం. ఎక్కువ వేతనాలను తీసుకొని పనిచేసే వారిని తమ సొంత దేశాలకు పంపించి తమ దేశంలో ఉండే ఉద్యోగులను, కార్మికులను ఆయా కంపెనీలు తీసుకోవాలని వీరికి తక్కువ వేతనాలు ఇవ్వవచ్చునని అమెరికాకు చెందిన వారిని రక్షించాలని ఈ పని చేసినట్టుగా ట్రంప్ చెబుతున్నాడు. విదేశాల నుంచి వచ్చే వారి సంఖ్యను గణనీయంగా తగ్గించడమే వ్యూహమని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ డిపార్టుమెంట్, వైట్‌హౌస్‌లు విదేశాల నుంచి వచ్చే ఉద్యోగులు, విద్యార్థుల సంఖ్యను గణనీయంగా తగ్గిస్తామని తెలిపారు. అమెరికాలో నెలకొల్పిన కంపెనీల యాజమాన్యాలకు కూడా తీవ్రమైన ప్రభావం పడుతుందని చెప్తున్నారు. ఇంతకాలం అమెరికా ఇతర దేశస్థులకు ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ప్రపంచంలోని అనేక దేశాల నుంచి నైపుణ్యం గల టెక్నాలజీ ఉద్యోగలను అమెరికా ఎక్కువగా ఆకర్షిస్తోంది.

సిలికాన్ వ్యాలీలో కంపెనీలలో చేరే ఇతర దేశస్థులు ప్రత్యేకించి ఇండియా, చైనా, దక్షిణాసియాల నుంచి వచ్చే వారిని చౌకగా తీసుకోవాలనేది ట్రంప్ లక్ష్యం. అలాగే దేశంలోని వారిని తక్కువ వేతనాలు ఇచ్చి తీసుకోవాలన్నది కూడా ఆలోచన. హెచ్-1బి వీసా కార్యక్రమం కింద అమెరికా కంపెనీలు విదేశీ వృత్తి నిపుణులను ప్రత్యేక వృత్తులలో ఉన్న నిపుణులను సిలికాన్ వ్యాలీలోని కంపెనీలు తీసుకోవాలని కూడా ట్రంప్ చెబుతున్నారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేథమెటిక్స్‌లోని ప్రత్యేక వృత్తులలో విదేశీ నిపుణులను చేర్చుకున్నారు. ప్రస్తుతం హెచ్-1బి వీసాలకు ఏడాదికి 65 వేలు ఫీజు ఉన్నది. అమెరికా మాస్టర్స్ డిగ్రీ లేదా ఉన్నత స్థాయి డిగ్రీకి అదనంగా మరో 20 వేలు దరఖాస్తులకి వసూలు చేస్తున్నారు. ఆకస్మికంగా తీసుకున్న ఈ నిర్ణయంపై భారతదేశం ఇంకా ప్రకటన చేయలేదు. ఉద్యోగాలలో కొనసాగించడానికి అలాగే అదనపు కాలాన్ని అనుమతించేందుకు మొత్తం ప్రోగ్రాం చాలా భారీగా ఉంది. ఇటీవల సంవత్సరాలలో ఏడాదికి దాదాపు 40 వేల హెచ్-1బి దరఖాస్తులను అంగీకరించారు. వీటిలో ఎక్కువగా ఇండియా, చైనాల నుంచి అంగీకరించిన దరఖాస్తులు ఉన్నాయి. ముఖ్యంగా టెక్ రంగానికి ఇండియా నుంచి వచ్చే వాళ్ల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్, ఐబీఎం, టాటా కన్సల్టెన్సీ సర్వీసులు ఎక్కువ పిటిషన్లను స్వీకరించాయి. తాజా దరఖాస్తులకు ఫీజు లక్ష డాలర్లు చెల్లించాలి. ఇంతవరకు 1700 డాలర్లు నాలుగు వేల ఐదువందల డాలర్ల మధ్య ధర ఉంది. అయితే వేగంగా పిటీషన్లను అంగీకరించే దానిని బట్టి వసూలు చేస్తున్నారు. కొద్దిమంది సీనియర్ ఇంజినీర్లు లేదా పరిశోధన శాస్త్రవేత్తలు భారీ కంపెనీలు అధిక ధరను చెల్లించి దరఖాస్తులను అనుమతిస్తున్నాయి. మధ్యతరహా వాణిజ్య కంపెనీలు సర్‌ఛార్జీలు చెల్లించడానికి తీవ్రంగా ఇబ్బందులు పడతాయి. అలాగే భారీ టెక్ కంపెనీలు కూడా ఒకొక్క ఉద్యోగికి లక్ష డాలర్లు చెల్లించవలసి ఉంటుంది. అయితే కెనడా, బ్రిటన్ లేదా యురోపియన్ యూనియన్ దరఖాస్తులకు చాలా తక్కువ ఫీజును చెల్లించడానికి అనుమతించారు. ఇకపైన ఇతర దేశాల నుంచి వచ్చే దరఖాసులు గణనీయంగా తగ్గిపోతాయి.

కార్పొరేట్లకు భూములు అభివృద్ధికా...?

ప్రొఫెసర్ పీటా బాబీ వర్ధన్

దేశంలోనైనా, రాష్ట్రంలోనైనా అభివృద్ధి జరగాలంటే పరిశ్రమలు కావాలి. కొత్త ప్రాజెక్టులు రావాలి. అయితే ఆ ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపన వల్ల ఒరిగేమేలెంత? జరిగే కీడెంత? ఇవన్నీ బేరీజు వేసుకుని ప్రభుత్వాలు భూకేటాయింపులు జరపాలి... సరళీకృత ఆర్థిక విధానం వల్ల కార్పొరేట్ కంపెనీలు క్యూలు కడుతున్నాయి. ప్రభుత్వాలు కూడా కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్ వేసి మరీ ద్వారాలు తెరుస్తున్నాయి. కొన్ని కంపెనీలు భూముల కేటాయింపులు జరిగాక పరిశ్రమల ఏర్పాటులో తీవ్ర జాప్యం చేస్తున్నాయి. ప్రభుత్వం విధించిన షరతులను సైతం బేఖాతరు చేస్తూ ఏళ్లు గడిపేస్తున్నారు. ఒక ప్రభుత్వం కేటాయించిన భూములను మరో ప్రభుత్వం ఏర్పడ్డాక రద్దు చేయడం కూడా చూస్తున్నాం. ఇటీవల కాలంలో 'లూలూ' కంపెనీకి కూటమి ప్రభుత్వం మరోసారి భూకేటాయింపులు చేసింది. తగిన సమయంలో మాల్స్ ప్రారంభించకపోవడం వల్ల వైసీపీ పాలనలో లూలూ కంపెనీ భూముల కేటాయింపును రద్దు చేయడంతో లూలూ వెనక్కు వెళ్లిపోయింది. ఈ సందర్భాన్ని ఆసరాగా చేసుకుని తెలుగుదేశం నేతలు జగన్‌మోహన్ రెడ్డిని దుమ్మెత్తి పోశారు. కార్పొరేట్ కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేసినట్లుగా ప్రచారం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 2024లో విజయం సాధించాక మళ్లీ కార్పొరేట్ సంస్థలు సంప్రదింపులు ప్రారంభించాయి. కూటమి ప్రభుత్వం భాగస్వామ్య సదస్సులు నిర్వహించి కార్పొరేట్ కంపెనీలను రాష్ట్రానికి రావాలని పిలుపునిచ్చింది. అడిగిన వారందరికీ భూముల కేటాయింపులు చేస్తోంది.

కారుచౌకగా భూములు

చాలా కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. కేటాయింపులు జరుగుతున్నాయి. అయితే, అవసరాన్ని మించి ఎకరాలు లెక్కన భూకేటాయింపులు చేయడం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ భూములు తీసుకున్న కార్పొరేట్ కంపెనీలు ఏయే పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నాయి? పెట్టుబడులు ఎంత మేరకు పెడుతున్నాయి? ఎంత మందికి ఉపాధి అవకాశాలు కనిపిస్తున్నాయి? వంటి అంశాల పట్ల అంచనాలు రూపొందించడం తప్పనిసరి కాగా, ఆ మేరకు కార్యాచరణ లేనట్టు కన్పిస్తోంది. ఈ మధ్య కాలంలో ఉత్తరాంధ్రకు సంబంధించిన భూములను అనేక కార్పొరేట్ కంపెనీలకు కేటాయింపులు జరిపారు. వాటిల్లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ప్రముఖమైంది. ఈ సంస్థకు ఎకరం భూమి 99 పైసల నామమాత్రపు ధరకు 26.16 ఎకరాలు కేటాయించారు. ఈ సంస్థ 1370 కోట్ల రూపాయల పెట్టుబడులతో డేటా సెంటర్ ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. 13 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు పట్టాలు ఎక్కితే వనగూడే లాభాల సంగతి ఎలావున్నా, ఉపాధి లేక వలస బాట పడుతున్న ఉత్తరాంధ్ర యువతకు ఏమాత్రం ఉపయోగపడుతుందన్నదే సమస్య. డేటా సెంటర్లో పనిచేసే నైపుణ్యం స్థానిక నిరుద్యోగులకు ఉంటుందా అనేది చిక్కు ప్రశ్న. పైగా కృత్రిమ మేధ (ఏఐ) పరిజ్ఞానం అభివృద్ధి చెందిన నేపథ్యంలో, ఇటీవలే టాటా కంపెనీ 12 వేల మందికి ఉద్వాసన పలికింది. మరి విశాఖలో నెలకొల్పబోయే డేటా సెంటర్ నియామకాలు ఏ మేరకు జరుగుతాయో వేచి చూడాల్సిందే. టాటా సంస్థతో పాటు మరికొన్ని టెక్నాలజీ ఆధారిత కార్పొరేట్ సంస్థలకు కూడా భూకేటాయింపులు జరిపారు. ఇందులో ప్రధానమైనది సిఫీ ఒకటి. ఇది ఏఐ ఆధారిత ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థను విశాఖలోని పరదేసి పాలెంలో నెలకొల్పేందుకు ముందు కొచ్చింది. దీనికి 25 ఎకరాల భూములు కేటాయించారు. ఎకరానికి యాభై లక్షలు

చొప్పున 99 సంవత్సరాల లీజు పద్ధతిలో కేటాయింపులు చేశారు. ఇక అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లిలో లారస్ ఫార్మా కంపెనీకి 532 ఎకరాలు కేటాయించారు. దశలవారీగా ఈ కంపెనీ ఆరు వేల కోట్ల పైన పెట్టుబడులు పెడతామని తెలిపింది. 600 మందికి ఉపాధి కల్పిస్తామని నమ్మబలుకుతోంది. సత్య టెక్నాలజీ పేరుతో మరో సంస్థ విశాఖపట్నం శివారు మధురవాడలో తమ సంస్థను ఏర్పాటు చేస్తామని ముందుకొచ్చింది. దీనికి కూడా ఖరీదైన భూములు కారుచౌకగా లీజుకు ఇచ్చారు. పదిహేను వందల కోట్ల పెట్టుబడుల అంచనాతో పాతిక వేల మందికి ఉద్యోగాలు ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. ఇది ఏ మేరకు సఫలీకృతం అవుతుందో భవిష్యత్‌లో తేలుతుంది.

లూలూ మాల్-గోల్ మాలేనా ?!

మిగతా కంపెనీల విషయం ఒక ఎత్తు. లూలూ మాల్‌కి భూకేటాయింపులు మరో ఎత్తు. ఇది 'పేరుగొప్ప- ఊరు దిబ్బ' చందాన ఏర్పాటు చేయబోతున్న మెగామాల్ (పెద్ద పచారీ దుకాణం).హోల్‌సేల్ దుకాణం. ఇప్పటికే డీమార్ట్, రిలయెన్స్, మోర్, మెట్రో, స్పెన్సర్స్ వంటి దిగ్గజ వ్యాపార సంస్థలు విశాఖలో వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. కానీ లూలూ పట్ల 'అపార'మైన శ్రద్ధ కనబరిచింది కూటమి సర్కారు. విశాఖకి గుండెకాయలా పరిగణించే బీచ్ రోడ్డులోని హార్బర్ పార్క్ భూములు 13.5 ఎకరాలను కేటాయించింది. దీనికి కూడా 99 సంవత్సరాల లీజు పద్ధతిలోనే ఒప్పందం కుదిరింది. నిర్మాణం పూర్తయ్యాక మూడేళ్ల పాటు ఎలాంటి అద్దె వసూలు చేయరు. ఆ తర్వాత వేలం పద్ధతిలో దుకాణాలు విక్రయిస్తారు. దీని ద్వారా వెయ్యి కోట్ల రూపాయల మేర ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. దుకాణ సముదాయాలు, సినిమా హాళ్లు, హోటళ్లు నిర్మిస్తున్నారు?

1989లో యూఏఈలోని అబుదాబి కేంద్రంగా ఏర్పాటైన లూలూ సంస్థ అంచలంచెలుగా తన వ్యాపార సామ్రాజ్యాన్ని ఇతర దేశాలకు విస్తరించింది. ఆసియాతో పాటు, యూరోప్, ఆఫ్రికా, మధ్యప్రాచ్య ప్రాంతం, అమెరికాలో వివిధ వ్యాపారాలు నిర్వహిస్తోంది. విశాఖలో హైపర్ మార్కెట్ మాల్ మాత్రమే ఏర్పాటు చేయబోతోంది. తయారీ యూనిట్లను ఏర్పాటు చేయబోవడం లేదు కనుక, అంతా దిగుమతుల మీద ఆధారపడి రిటైల్ వ్యాపారం చేస్తుంది. ఒకవేళ, సినిమా హాళ్లు, హోటళ్లు నిర్మించినా ఎంత మందికి ఉద్యోగాలు కల్పిస్తుంది? ఎలాంటి ఉపాధి కల్పిస్తుంది? సేల్స్‌మెన్, సేల్స్ గాళ్స్, మహాఅయితే సూపరువైజర్లు, ఇద్దరు ముగ్గురు మేనేజర్లు. ఇంతకు మించి ఉద్ధరించేదేముంది? ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్ చదువున్న వాళ్లు సరిపోతారు కదా ? అంత ఖరీదైన భూములు కేటాయిస్తే ఒనగూడే ప్రయోజనం ఇదేనా ? 3500 కోట్ల ఖరీదు చేసే భూమిని ఇంత తేలిగ్గా ఇచ్చేస్తారా? నిర్మాణం పూర్తి అయ్యాక చదరపు అడుగు రూపాయిన్నరకే ఇచ్చేలా ఒప్పందం కుదిరింది.

ప్రభుత్వ భూములను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కేటాయించే బదులు ఎన్నో తరాల ప్రజలకు ముఖ్యంగా యువతకు ఉపయోగకరమైన సైన్సు సిటీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది.' విశాఖ ప్రజా వనరుల పరిరక్షణ వేదిక' పేరుతో ఉద్యమం మొదలయింది. లూలూ భూముల కేటాయింపుల విషయంలో అనేక ఉల్లంఘనలు జరిగినట్లు ఈ 'వేదిక' స్పష్టం చేస్తోంది. తీర నియంత్రణ జోన్ (సీఆర్‌జడ్) నియమాల ప్రకారం సముద్ర తీరానికి 500 మీటర్లలోపు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. కానీ, లూలూమాల్‌కి కేటాయించిన భూములు సముద్ర తీరానికి అతి సమీపంలోనే ఉన్నాయి. ప్రభుత్వ స్థలాలను ప్రజా, ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించాలి మినహా ప్రైవేటు సంస్థలకు కాదన్నది వేదిక వాదన. హైదరాబాద్‌తో పాటు అనేక ప్రాంతాల్లో లూలూ తమ వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తోంది. అయితే వాటిల్లో ఎక్కువ శాతం భూములు ప్రైవేటు వ్యక్తులకు చెందినవి కావడం విశేషం. బీచ్‌లో నిర్మిస్తున్న లూలూ మాల్ వల్ల పర్యావరణ సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. సముద్రం కోతకు గురైతే పెద్ద ప్రమాదం ఏర్పడుతుంది. లూలూమాల్ భారీ ఎత్తున నిర్మిస్తున్నారు కనుక ట్రాఫిక్ రద్దీ పెరిగి సమస్యలు తలెత్తే ప్రమాదం లేకపోలేదు. పబ్‌లకు పర్మిషన్లు ఇస్తే పరిసర ప్రాంతాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. అహ్మదాబాద్, హైదరాబాద్ వంటి చోట్ల జరుగుతున్న చేదు అనుభవాలు పునరావృతం కావు అన్న భరోసా లేదు.

జర్నలిజం పూర్వపు విభాగాధిపతి &డీన్
ఆంధ్ర విశ్వవిద్యాలయం., 9393100566

భారత-అమెరికా సంబంధాలు ఎటు?...



పతకమూరు దామోదర్ ప్రసాద్

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ ఉక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తోందనే కుంటిసాకుతో, భారత్ అధిక సుంకాలు విధిస్తూ "సుంకాల రారాజు"గా నిలిచిందని ఆరోపిస్తూ ప్రతీకారంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 50 శాతం దిగుమతి సుంకాలు విధించడంతో వాణిజ్యంలో తీవ్ర ప్రతిష్ఠంభన నెలకొంది. ఈ విషయమై యమై బ్రెండెన్ లించ్ నాయకత్వంలో కొత్త ఢిల్లీకి వచ్చిన అమెరికా ప్రతినిధి బృందానికి, భారత వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి భారత బృందానికి మధ్య జరిగిన చర్చల్లో పెద్ద పురోగతి కనిపించలేదు. అయితే భారత ప్రధాని నరేంద్రమోదీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయడం, దృశ్య మాధ్యమాల ద్వారా చర్చలు కొనసాగించి త్వరలోనే ఒక అంగీకారానికి రావాలని నిర్ణయించడమే ఓ సానుకూల పరిణామంగా భావిస్తున్నారు. భారత్‌కు పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి వ్యవసాయోత్పత్తులు, పాలు, వివిధ రకాల వెన్నలు, పాలపొడి వంటి పాడి ఉత్పత్తులు ఎగుమతి చేయాలని, 146 కోట్ల అతి పెద్ద జనాభా గల మార్కెట్‌ను చేజిక్కించుకోవాలని అమెరికా తహతహలాడుతోంది. అందుకు సరళమైన సుంకాలతో అనుమతి ఇవ్వాలని దశాబ్దాలుగా మన దేశంపై ఒత్తిడి తెస్తోంది. అయితే 86 శాతం చిన్న, సన్నకారు రైతులు, 8కోట్ల పాడిరైతుల జీవితాలపై దుష్ప్రభావము పడుతుందని భారత ప్రభుత్వం అందుకు అంగీకరించడంలేదు. అదీగాక పాల అధికోత్పత్తికి వాడే దాణాలో కలిపిన ఎంజైములును మాంసకృత్తులు అధికంగా ఉండటం, ఆరోగ్యానికి హానికరమని భావించడం, అవి భారత ఆచారాలు, సంప్రదాయాలు, ఆహార అలవాట్లకు విరుద్ధంగా ఉండటం వల్ల ప్రభుత్వం వాటికి అనుమతించడం లేదు. దీంతో డాలర్ ప్రభువు ట్రంప్‌కు పట్టరాని ఆగ్రహం కలిగి భారత్‌ను ఆర్థికంగా దెబ్బతీయడానికి 50 శాతం సుంకాలు విధించడంతో, జౌళీ వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, వజ్రాలు, స్వర్ణాభరణాలు, టోలువస్తువులు, పాదరక్షలు, సుగంధ ద్రవ్యాలు రబ్బర్, రొయ్యలు, చేపలు, ఇతర మత్స్య సంపద ఉత్పత్తిలో భాగస్వాములైన లక్షలాదిమంది మహిళలు ఇతర శ్రామికుల జీవనోపాధులపై తీవ్ర ప్రభావం పడింది. పనులు, ఆదాయాలు కోల్పోయి వారు వీధినపడి జీవనమెలా అని ఆక్రోశిస్తున్నారు. రొయ్యల ఎగుమతులలో 80 శాతం, చేపలు, సముద్రఉత్పత్తుల్లో 39 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచి జరుగుతున్నాయి. ట్రంప్ సుంకాల దెబ్బకు వాటి ఎగుమతులు ఆగిపోయి 25 వేలల కోట్లనష్టం వాటిల్లనుందని అంచనా. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా అభివృద్ధి చేస్తానని, తయారీ రంగంలో మేటిగా నిలుపుతానని, అన్నింటా అమెరికాయే ఫస్ట్ అని నినదిస్తూ, శ్వేతజాతి దురహంకారాన్ని రెచ్చగొట్టి రెండో దఫా అమెరికా అధ్యక్షుడైన ట్రంప్ ఇంటా బయటా పెట్రేగి పోతున్నాడు. భారత్ పైనే గాక బ్రెజిల్, అర్జెంటీనా, మెక్సికో, కెనడా తదితర దేశాలపై భారీ సుంకాలు విధించి అమెరికా మళ్లీ సామ్రాజ్యవాద పెత్తనాన్ని, ప్రాబల్యాన్ని పెంచడానికి చేస్తున్న యత్నాలు అంతర్జాతీయ వ్యవస్థలను అతలాకుతలం చేస్తున్నాయి. అమెరికాలో సేద్యంపై ఆధారపడి జీవిస్తున్న వారు 2శాతం, యూరోపియన్ దేశాలలో కేవలం 4శాతం కాగా, చైనాలో 22 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. అమెరికాలో వేల ఎకరాల వ్యవసాయ క్షేత్రాలను కంపెనీలు అత్యాధునిక యంత్రాలు, నూర్పిడి పరికరాలతో చేయడం వల్ల సాగు ఖర్చు తక్కువ. యూరోప్ చైనా తదితర దేశాలలో కూడా యంత్రాల వాడకం వల్ల సాగు ఖర్చు తక్కువ, ఉత్పాదకత ఎక్కువ. భారత్ ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశం కనుక ఉత్పత్తి, ఉత్పాదకత పెంచడానికి, సేద్యాన్ని లాభసాటి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి ప్రయత్నాలు చేయడం అవసరం. చైనా, అమెరికా వ్యవసాయ రంగంలో ముందున్నా భారీగా వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నాయి. 2024లో చైనా 100 బిలియన్ డాలర్లు, అమెరికా 59 బిలియన్ డాలర్ల వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకున్నాయి. అమెరికా భారీగా మొక్కజొన్న, పత్తి వంటి 182.8బిలియన్ డాలర్ల వ్యవసాయోత్పత్తులను ఎగుమతి చేసింది. అమెరికా, చైనా అనుభవాలను భారత ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి. పంట సీజన్‌లో యూరియా తదితర ఎరువులను సరఫరా చేయలేని స్థితి భారత ప్రభుత్వానిది. మన దిగుమతులలో మూడోవంతు వంటనూనెలే. వాటిపై 10 శాతం సుంకం. పత్తిపై సున్నా, పచ్చబఠానీలపై నామమాత్రంగా సుంకాలున్నాయి. అమెరికా కోడికాళ్లపై, వాల్‌నట్స్‌పై 100శాతం, యాపిల్స్‌పై 50శాతం, పాలపొడిపై50 శాతం సుంకాలు విధిస్తున్నది. మన దేశం అతి పెద్ద బియ్యం ఎగుమతిదారు. బియ్యం దిగుమతిపై 70 శాతం ఉంది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేళ్లు అవుతుంది కనుక అప్పటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలనే భారత ప్రభుత్వ లక్ష్యానికి చేరాలంటే వివిధ రంగాలలో ఎన్నో మార్పులు తేవాలి. అమెరికా సుంకాలు ఆ దేశానికి కూడా నష్టం కలిగిస్తాయని, ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రెండోసారి అధ్యక్షుడైన తర్వాత ట్రంప్ సుంకాల విషయంలో కరకుగా వ్యవహరించడమే గాక అక్కడ పనిచేస్తున్న భారతీయులను ఇబ్బందులకు గురిచేసే నిర్ణయాలెన్నో తీసుకున్నారు. హెచ్1బి వీసాలపై ఎన్నో ఆంక్షలు విధించాడు. భారత్ అమెరికాలో మితవాద ప్రభుత్వాలే అధికారంలో ఉన్నా ప్రధాని మోదీ దేశ ప్రయోజనాల కోసం గళం వినిపించక తప్పటంలేదు. నిజానికి ప్రచ్ఛన్న యుద్ధకాలం నుంచి భారత్ అమెరికా సంబంధాలలో ఎన్నో ఒడిదుడుకులు తప్పడం లేదు. అమెరికా పాకిస్తాన్ పాలకులను దువ్వుతూ ఆయుధ, ఆర్థిక సాయం అందిస్తూ వస్తోంది. 1971లో ఎన్నికైన షేక్ ముజిబుర్ రహమాన్‌కు పాక్ సైనిక పాలకులు అధికారం అప్పగించకపోవడం, సైనికదమనకాండతో ఆగ్రహించిన బంగ్లా ప్రజలు విముక్తి పోరాటాన్ని ప్రారంభించగా భారత్ నైతిక మద్దతు ఇచ్చి ఆయుధ సహాయం చేసింది. లక్షలాదిమంది శరణార్థులకు ఆశ్రయమిచ్చి ఆదుకుంది. అప్పుడు అమెరికా అధ్యక్షుడుగా ఉన్న రిచర్డ్ నిక్సన్ పాక్‌కు మద్దతుగా తమ సప్తమ నౌకా దళాన్ని పంపారు. అప్పటి సోవియట్ యూనియన్ భారత్‌కు మద్దతుగా నిలవడంతో వెనుదిరగక తప్పలేదు. అలా యెన్నో అవాంతరాలు, విభేదాలతో నడిచిన భారత అమెరికా సంబంధాలు 2000సంవత్సరంలో అప్పటి అధ్యక్షుడు క్లింటన్ భారత్ పర్యటనకు రావడంతో కొత్త మలుపు తిరిగాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన భారత్, అమెరికా ప్రభుత్వాల నేతలు కూడా యధాశక్తి చేసిన కృషితో రెండు దేశాల సంబధాలు ఈ స్థాయికి వచ్చాయి. 2003లో అమెరికా మానవహనన ఆయుధాలున్నాయనే కుంటి సాకుతో ఇరాక్‌పై దురాక్రమణకు పాల్పడినప్పుడు భారత సైన్యాన్ని పంపమని కోరగా మన దేశం నిరాకరించింది. భారత మిత్రుడైన సద్దాం హుస్సేన్‌ను అమెరికా సేనలు వెంటాడి, వేటాడి దారుణంగా హతమార్చాయి. ఒసామా బిన్ లాడెన్‌ను తొలుత పెంచిపోషించింది అమెరికా. ఇస్లామిక్ మత చాందసవాదం పెచ్చుపెరిగి ఉగ్రవాదులు న్యూయార్క్, వాషింగ్టన్‌లో ఆకాశ హర్మ్యాలను పేల్చివేశాకగానీ విషభుజంగాలను చేరదీస్తే కలిగే ముప్పు అగ్రరాజ్యానికి బోధపడలేదు. ఆ తర్వాత పాక్‌లో నక్కిన బిన్‌లాడెన్‌ని అమెరికా గుట్టుగా మట్టుపెట్టింది. ఇరాక్‌పై అమెరికా దాడిని వాజపేయి ప్రభుత్వం ఖండించింది. ఇందిరాగాంధీ, వాజపేయి ప్రధానులుగా ఉన్నప్పుడు శాంతియుత ప్రయోజనాల కోసం జరిపిన అణు పరీక్షలను అమెరికా వ్యతిరేకించింది.ఫలితంగా తారాపూర్ అణువిద్యుత్ కేంద్రానికి యురేనియం సరఫరాను అమెరికా నిలిపి వేసింది. అణ్వస్త్ర వ్యాప్తి ఒప్పందం, అణుపరీక్షల నిషేధ ఒప్పందాలపై సంతకం చేయాలనే అమెరికా డిమాండ్‌ను భారత్ ఖాతరు చేయలేదు. చైనా బలీయమైన దేశంగా ,తయారీ కేంద్రంగా ఎదగడాన్ని సహించలేని అమెరికా భారత్ తో చెలిమి చేసి ఎదుర్కొనే వ్యూహం లో ఉంది. ఇప్పుడుఎన్నికయిన పాక్ ప్రధానిని పక్కనపెట్టి మతవాది అయిన సైన్యాధ్యక్షుడు ఆసిమ్ మునీర్ ను శ్వేత భవనానికి ఆహ్వానించి విందులివ్వడం ఏ పజాస్వామ్య స్ఫూర్తి. భారత్‌లో ఆర్థిక సంస్కరణలు మొ దలయ్యాక విద్యావంతులైన మధ్య తరగతి వర్గం అభివృద్ధి చెంది వారి సంతానాన్ని ఉన్నత విద్య ఉద్యోగాల కోసం కోటి ఆశలతో అమెరికా పంపడం అధికమైనది. ఇప్పుడు ట్రంప్ నిలకడ లేని నిర్ణయాల వల్ల వారి భవిష్యత్ అగమ్య గోచరంగా వుంది. ఏ దేశంతో సంబంధాలైనా, వాణిజ్యమైనా పరస్పర ప్రయోజనాల ప్రాతిపదికగానే జరగాలి. ట్రంప్ నిర్ణయాలు అమెరికాకు నష్టం కలిగిస్తాయని ఆయుధ తదితర పరిశ్రమ వర్గాలు ఆందోళనవ వ్యక్తం చేయటంతో పెంటగన్ సూచనపై కంపెనీలునీలు తమకు అవసరమైన నిపుణులను ఉద్యోగాలలోకి తీసుకోవచ్చునని, మినహాయింపు ఇవ్వడం కొంత ఊరట. భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై జరుగుతున్న చర్చలు త్వరలో ఒక కొలిక్కి రాగలవని ఆశాభావం వ్యక్తం అవుతోంది. మోదీ తన మిత్రుడని, భారత్ గొప్ప దేశమని ట్రంప్ కొత్త రాగం ఆలపించగా, అమెరికా సహజ మిత్రదేశం అని మోదీ స్పందన. భారత్ తొలి నుంచి స్వతంత్ర విదేశాంగ వాణిజ్య విధానాలను అనుసరిస్తోంది. సోవియట్ కుప్పకూలాక ఏకధ్రువ ప్రపంచంగా కొన్నాళ్లు, అమెరికాకు తిరుగులేదని ఊదరగొట్టారు. చైనాలో పుతిన్, మోదీ,షి జిన్ పింగ్ సమావేశం తర్వాత అమెరికా తత్తరపడి కొంత తగ్గింది. ప్రాచీన సంస్కృతి, నాగరికత గల భారత్ చైనా దగ్గరైతే ఉభయ తారకంగా వుంటుంది. సుదీర్ఘ సరిహద్దు వివాదం, పాకిస్థాన్‌కు చైనా మద్దతు అవరోధనలుగా వున్నాయి. చైనాకు మన ఎగుమతులు పెంచాలి. ప్రస్తుతం దిగుమతులే ఎక్కువ. భారత్‌లో తయారీ అనేది మోదీ నినాదంగా మిగిలింది. నాయకత్వం మన ప్రజల బహుళ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని దృఢంగా వ్యవహరించినప్పుడే మన ఎగుమతులను వివిధ దేశాలకు విస్తరించినప్పుడే లక్షలాది మంది ఉద్యోగ ఉపాధులను కాపాడగలం. భారత్ అన్ని రంగాలలో రానున్న కాలంలో అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి ఎంతో శ్రమించాల్సి వుంది.

- సీనియర్ జర్నలిస్టు.,9440990381

స్వదేశానికి వచ్చేయండి: రాధికాగుప్తా

న్యూఢిల్లీ: హెచ్-1బీ వీసా ఫీజును డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం పెంచడంపై ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ రాధికాగుప్తా స్పందించారు అమెరికాలో భారతీయ విద్యార్థులకు మారిపోతున్న అవకాశాల గురించి మాట్లాడారు. తాను 2005లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన సమయంలో హెచ్-1బీ వీసా నిబంధనలు అంతర్జాతీయ విద్యార్థులకు చాలా అనుకూలంగా ఉండేవని గుర్తుచేసుకున్నారు. '2008లో సంభవించిన ఆర్థికమాంద్యంతో అంతా మారిపోయింది. అది ఎంతో మంది జీవితాలను మలుపు తిప్పింది. ఆ సమయంలో భారతీయ విద్యార్థులు కొందరు స్వదేశానికి తిరిగివచ్చారు. వీసా ఉన్నవారు కూడా అలాగే చేశారు. అలా తిరిగి వచ్చినవారు భారత్‌లో సంతృప్తికరమైన జీవితాన్ని నిర్మించుకున్నారు. వ్యక్తిగతంగా, వృత్తిగతంగా ఎదగడమేగాకుండా దేశానికి సహకరిస్తున్నామనే సంతృప్తిని సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం అమెరికాలో చదువుకుంటున్న విద్యార్థుల ఆలోచనలు ఎలా ఉంటాయో నేను అర్థం చేసుకోగలను. కానీ ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఒక తలుపు మూసుకుంటే... స్వదేశానికి తిరిగి వచ్చేందుకు ఎన్నో తలుపులు తెరుచుకుంటాయి. 2025 నాటి భారతం... 2005 నాటికంటే ఎంతో ఉత్తేజకరంగా ఉంది' అని తన అనుభవాన్ని వెల్లడించారు.

భారత టెక్ కంపెనీలపై తీవ్ర ప్రభావం: నాస్కామ్

న్యూఢిల్లీ: హెచ్-1బీ వీసా రుసుమును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా తీసుకున్న నిర్ణయం భారత టెక్ కంపెనీలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్) ఆందోళన వ్యక్తంచేసింది. ఈ పరిణామాలతో ఆఫ్‌షోర్ ప్రాజెక్టులకు అంతరాయం కలుగుతుందని తెలిపింది. అంతేకాకుండా 24 గంటల్లోనే దీనిని అమలు చేస్తున్నట్లు చెప్పడం కూడా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యాపార సంస్థలు, నిపుణుల్లో మరింత అనిశ్చితికి కారణమైందని పేర్కొంది. 'హెచ్-1బీ వీసా రుసుము ఆదేశాలకు సంబంధించిన వివరాలను విశ్లేషిస్తున్నాం. ఇటువంటి ధోరణి అమెరికా ఆవిష్కరణల వ్యవస్థతోపాటు ఉద్యోగాలపైనా తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఈ వీసాలపై అంతర్జాతీయ, భారత కంపెనీల కోసం అమెరికాలో పనిచేస్తున్న భారతీయులపైనా ప్రభావం చూపుతుంది"అని నాస్కామ్ వెల్లడించింది. తాజా ప్రకటనతో మార్పులకు సంబంధించి క్లయింట్‌లతో ఆయా కంపెనీలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపింది. మరోవైపు హెచ్-1బీ వీసా రుసుము సాధారణంగా 2 వేల నుంచి 5 వేల డాలర్లుగా ఉంటుంది. ప్రస్తుతం దీన్ని లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా నిర్ణయం తీసుకుంది. ఈ వీసా కార్యక్రమం కింద భారత్‌కు చెందిన అనేక కంపెనీలు ప్రయోజనం పొందుతున్నాయి. వేలాది మంది నిపుణులను అమెరికాకు పంపిస్తున్నాయి. అమెరికా ఇమిగ్రేషన్ విభాగం గణాంకాల ప్రకారం ఈ ఏడాది హెచ్-1బీ వీసా ఆమోదం పొందిన వాటిల్లో అమెజాన్ (10,044) అగ్రస్థానంలో నిలిచింది. టీసీఎస్ (5505), మైక్రోసాఫ్ట్ (5189), మెటా (5123), యాపిల్ (4202), గూగుల్ (4181), కాగ్నిజెంట్ (2493), జేపీ మోర్గాన్ చేజ్ (2440), వాల్‌మార్ట్ (2390), డెలాయిట్ కన్సల్టింగ్ (2353) టాప్ 10 జాబితాలో ఉన్నాయి. ఇన్ఫోసిస్ (2004), ఎల్‌టీఐమైండ్‌ట్రీ (1807), హెచ్‌సీఎల్ అమెరికా (1728) టాప్-20 జాబితాలో ఉన్నాయి.

అమెరికాకే భారీ నష్టం

వీసా ఫీజుపై అమితాబ్ కాంత్

న్యూఢిల్లీ: హెచ్-1బీ వీసాల దరఖాస్తు రుసుమును లక్ష డాలర్లకు పెంచుతూ డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం నిర్ణయం తీసుకోవడంపై నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ స్పందించారు. ఆ చర్య అమెరికానే ఉక్కిరిబిక్కిరి చేస్తుందని వ్యాఖ్యానించారు. 'ట్రంప్ విధించిన లక్ష డాలర్ల హెచ్-1బీ వీసా ఫీజు అమెరికా ఆవిష్కరణలకు ఊపిరాడకుండా చేస్తుంది. భారతదేశాన్ని టర్బోఛార్జ్ చేస్తుంది. ప్రపంచస్థాయి ప్రతిభకు తలుపులు మూసేయడం వల్ల అమెరికాలో ఏర్పడాల్సిన ల్యాబ్‌లు, పేటెంట్లు, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు బెంగళూరు, హైదరాబాద్, పూణె, గురుగ్రామ్‌కు వచ్చేస్తాయి. దాంతో భారతదేశంలో అత్యుత్తమ వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు వికసిత్ భారత్ దిశగా దేశ పురోగతికి దోహదం చేసే అవకాశం ఉంది. అమెరికాకు నష్టం కలిగించే ఈ నిర్ణయం భారత్‌కు లాభం చేకూర్చనుంది' అని అమితాబ్‌కాంత్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. మన దేశానికి మేలు చేకూర్చుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కాగా, ఈ నిర్ణయం దురదృష్టకరమని పలువురు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్, టెక్ పరిశ్రమకు నష్టం చేకూర్చనుందని అంచనా వేస్తున్నారు. స్టెమ్ కోర్సు ద్వారా అమెరికా విద్యాభ్యాసం చేసినవారిపై ఇప్పటికే ఏఐ, టారిఫ్‌లు ప్రభావం చూపుతుండగా, ఈ ఫీజు మరింతభారం కానుందని చెబుతున్నారు. ఇకపై అమెరికా వేదికగా పనిచేస్తున్న కంపెనీలు విదేశీ నిపుణులను నియమించుకునేందుకు జారీ చేసే ఒక్కో వీసాపై ఏడాదికి లక్ష డాలర్లు చెల్లించాల్సి వస్తుంది. దాంతో ఆ సంస్థలు వారిని నియమించుకునేందుకు మొగ్గు చూపకపోవచ్చని భావిస్తున్నారు.

మోదీ బలహీన ప్రధాని

హెచ్-1బీ వీసాలపై రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: హెచ్ 1బీ వీసాలకు సంబంధించి లక్ష డాలర్ల దరఖాస్తు రుసుము ఉత్తర్వులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేయడం, ఆ ఉత్తర్వులు ఈనెల 21వ తేదీ నుంచి అమల్లోకి రానుండటంపై విపక్ష కాంగ్రెస్ పార్టీ విమర్శల దాడి చేసింది. ఈ పరిణామంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ శనివారం తప్పుపట్టారు. ట్రంప్ తొలిసారి దేశాధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఈ అంశాన్ని ట్రంప్ దృష్టికి తీసుకురాకపోవడంపై మోదీని తాను 2017లోనే ప్రశ్నించానని రాహుల్ గుర్తుచేశారు. 'మోదీ బలహీన ప్రధాని. మళ్లీ ఇదే మాట చెబుతున్నా' అని రాహుల్ తాజా ట్వీట్‌లో విమర్శించారు. రాహుల్ అభిప్రాయాన్నే కాంగ్రెస్ నేత పవన్ ఖేరా వ్యక్తం చేశారు. ట్రంప్ కుట్రలపై రాహుల్ 2017లోనే హెచ్చరించారని, ఇవాళ యావద్దేశం మోదీని ప్రశ్నిస్తోందని అన్నారు. 'ఇదేమీ కొత్త పరిణామం కాదు. 2017 జులై 5న ఇలాంటి కుట్ర జరుగుతోందని మోదీని రాహుల్ హెచ్చరించారు. ఏదైనా చేయాలని సూచించారు. కానీ మోదీ బలహీన ప్రధాని. అప్పుడు ఏమీ చేయలేదు. ఇప్పుడు కూడా అంతే. దీని ఫలితం ఈరోజు చూడబోతున్నాం. లక్షలాది మంది దేశ యువత నష్టపోనున్నారు. ట్రంప్ ప్రతిరోజూ అవమానిస్తూనే ఉన్నారు. కానీ మోదీ మౌనం వహిస్తున్నారు. ట్రంప్ మోసగాడని పార్లమెంటులో చెప్పాలని మోదీకి రాహుల్ ఒక అవకాశం ఇచ్చారు. ఆయన ఆ మాట చెప్పి ఉంటే యావద్దేశం ఆయన వెనుకే ఉండేది. ఇవాళ యావద్దేశం మోదీని ప్రశ్నిస్తోంది' అని పవన్ ఖేరా అన్నారు. భారతదేశంపై పద్ధతి ప్రకారం అమెరికా పట్టు బిగిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత మనీష్ తివారీ ఆరోపించారు. హెచ్-1బి వీసాపై ఇప్పుడు జరుగుతున్నది యాదృచ్ఛికం కాదని అన్నారు. వరుస పరిణామాలను గమనిస్తే... పాకిస్థాన్ ప్రేరేపణతోనే అమెరికా ముందుగానే కాల్పుల విరమణ ప్రకటన చేసిందని అన్నారు. పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడికి వైట్‌హౌస్‌లో ఆతిథ్యం ఇచ్చారని, ఆ తర్వాత భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారని గుర్తుచేశారు. అమెరికా ఆశీర్వాదం లేకుండా సౌదీ-పాకిస్థాన్ రక్షణ భాగస్వామ్యం కుదిరే అవకాశం ఎంతమాత్రం లేదని తివారీ అన్నారు. పద్ధతి ప్రకారం భారత్‌తో అమెరికా కయ్యానికి కాలుదువ్వుతోందన్నారు.

మోదీకి ట్రంప్ రిటర్న్ గిఫ్ట్: ఖడ్గే

న్యూఢిల్లీ: హెచ్ -1 బి వీసా దరఖాస్తుల వార్షిక రుసుము లక్ష డాలర్లకు పెంచాలనే అమెరికా నిర్ణయాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే తీవ్రంగా విమర్శించారు. ఇది ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల జరుపుకున్న పుట్టినరోజు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ అని ఖడ్గే అభివర్ణించారు. 'మీరందుకున్న రిటర్న్ గిఫ్ట్‌తో భారతీయులు బాధపడుతున్నారు. మీ అబ్కి బార్ ట్రంప్ సర్కార్ ప్రభుత్వం నుండి ట్రంప్ ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ హెచ్ 1బి వీసా లక్ష డాలర్ల పెంపు వల్ల భారతీయ టెక్ కార్మికులను తీవ్రంగా దెబ్బతీసింది. అమెరికాలో హెచ్-1బి వీసాదారుల్లో 70 శాతం మంది భారతీయులే' అని ఖడ్గే శనివారం తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. 'భారత జాతీయ ప్రయోజనాలే అత్యున్నతమైనవి. బేర్ హగ్స్, హలో నినాదాలు, మోదీ... మోదీ అని జపించేలా చేయడం విదేశాంగ విధానం కాదు. విదేశాంగ విధానం అంటే... మన జాతీయ ప్రయోజనాలు కాపాడడం. భారతదేశాన్ని మొదటి స్థానంలో ఉంచడం. జ్ఞానం, సమతుల్యతతో స్నేహాలు నడిపించడం. దీనిని మన దీర్ఘకాలిక స్థితిని దెబ్బతీసే ప్రమాదం ఉన్న ఉపరితల ధైర్యసాహసాలకు తగ్గించలేము' అని ఖడ్గే హితవు పలికారు. పహల్గాం దాడి సందర్భంగా భారత్ తలపెట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపినట్లు ట్రంప్ పదేపదే చెబుతున్నారు. భారత్ ఎగుమతులపై 50 శాతం సుంకాలు విధించారు. దీంతో దాదాపు పది రంగాల్లో భారత్ 2.17 లక్షల కోట్ల డాలర్లు నష్టపోయినట్లు అంచనా వేసినట్లు ఖడ్గే గుర్తుచేశారు. భారతీయ అవుట్‌సోర్సింగ్‌ను లక్ష్యంగా చేసుకుని హెచ్‌ఐఆర్‌ఇ (ఉపాధి పునరుద్ధరణకు ప్రోత్సాహకాల నియామకం) చట్టం, చాబహార్ పోర్టు మినహాయింపు ఎత్తివేయడంతో మన వ్యూహాత్మక ప్రయోజనాలకు నష్టం వాటిల్లింది. భారతీయ వస్తువులపై వందశాతం సుంకం విధించాలని ఈయూ ఇచ్చిన పిలుపు కూడా అంతే అని ఖడ్గే తీవ్రస్థాయిలో విమర్శించారు.

ఇతర దేశాలపై ఆధారపడొద్దు

- అదే భారత్‌కు అతిపెద్ద శత్రువు
- స్వావలంబన ఏకైక పరిష్కారం: మోదీ

భావ్‌నగర్ (గుజరాత్): భారతదేశానికి ప్రధాన శత్రువు ఇతర దేశాలపై ఆధారపడటమేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం అన్నారు. 'ఆత్మనిర్భరత' కోసం నినాదాలు చేస్తూ, (సెమీకండక్టర్) చిప్‌ల నుంచి నౌకల వరకు ప్రతి దానినీ స్వదేశీ ఉత్పత్తికి పిలుపునిచ్చారు. భావ్‌నగర్‌లోని గాంధీ మైదానంలో జరిగిన 'సముద్ర సే సమృద్ధి' కార్యక్రమంలో రూ.34,200 కోట్ల వ్యయంతో కూడిన ప్రాజెక్టులను ప్రారంభించి... శంకుస్థాపన చేసి మోదీ ప్రసంగించారు. భారతదేశంలోని అన్ని సమస్యలకు ఒకే ఒక పరిష్కారం ఉందని, అది స్వావలంబన మాత్రమేనని అన్నారు. 'భారతదేశం ప్రపంచ సోదరభావం స్ఫూర్తితో ముందుకు సాగుతోంది. నేడు ప్రపంచంలో భారతదేశానికి ప్రధాన శత్రువు ఎవరూ లేరు. కానీ నిజానికి భారతదేశానికి అతిపెద్ద శత్రువు ఇతర దేశాలపై ఆధారపడటమే' అని ప్రధాని తెలిపారు. ఈ ఆధారపడటాన్ని సమష్టిగా ఓడించాలని నొక్కి చెప్పారు. 'ప్రపంచ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశం స్వావలంబన పొందాలి' అని మోదీ అన్నారు. ఇతరులపై ఆధారపడటం జాతీయ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. 'జాతీయ అభివృద్ధి కోసం సంకల్పాన్ని విదేశీయులపై ఆధారపడి ఉండకూడదు. రాబోయే తరాల భవిష్యత్‌ను ఇతరులకు వదిలివేయకూడదు. 140 కోట్ల జనాభా ఉన్న దేశం ఇతరులపై ఆధారపడి ఉంటే అది జాతీయ ఆత్మగౌరవాన్ని రాజీ చేస్తుంది' అని తెలిపారు. కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని మోదీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం తర్వాత యువకుల ప్రతిభను అప్పటి పాలక పార్టీ అణచివేసిందని, అది 'లైసెన్స్ రాజ్' వంటి ఆంక్షలను తీసుకువచ్చిందని అన్నారు. 'లైసెన్స్-కోటా పాలనలో దీర్ఘకాలిక చిక్కుముడు, ప్రపంచ మార్కెట్ల నుంచి ఒంటరిగా చూడటం' ప్రధాన కారకాలుగా ఆరోపించారు. ప్రపంచీకరణ యుగం ప్రారంభమైనప్పుడు అప్పటి ప్రభుత్వాలు దిగుమతులపై మాత్రమే దృష్టి సారించాయని, అది వేల కోట్ల కుంభకోణాలకు దారితీసిందని మోదీ అన్నారు. 'ఈ విధానాలు భారతదేశ యువతకు గణనీయమైన హాని కలిగించాయి. దేశం నిజమైన సామర్థ్యం బయటపడకుండా నిరోధించాయి' అని తెలిపారు. విదేశీ షిప్పింగ్ కంపెనీల సేవల కోసం భారతదేశం ప్రతి సంవత్సరం 75 బిలియన్ డాలర్లు లేదా దాదాపు రూ. 6 లక్షల కోట్లు చెల్లిస్తున్నదని ఆయన అన్నారు. 'గత ఏడు దశాబ్దాలుగా ఇతర దేశాలకు సరుకు రవాణాలో ఎంత డబ్బు చెల్లించబడిందో ప్రజలు ఊహించగలరా? ఈ నిధుల ప్రవాహం విదేశాలలో లక్షలాది ఉద్యోగాలను సృష్టించింది. ఈ ఖర్చులో ఒక చిన్న భాగాన్ని కూడా మునుపటి ప్రభుత్వాలు దేశీయ షిప్పింగ్ పరిశ్రమలో పెట్టుబడి పెట్టి ఉంటే, ప్రపంచం నేడు భారతీయ నౌకలను ఉపయోగించుకునేది భారతదేశం షిప్పింగ్ సేవలలో లక్షల కోట్లు సంపాదిస్తూ ఉండేది' అని ప్రధాని తెలిపారు.

ఆగని బాంబు బెదిరింపులు

ముంబై/న్యూఢిల్లీ: దేశంలో బాంబు బెదిరింపులకు అంతం లేకుండా పోతోంది. నిత్యం పాఠశాలలు, విమానాశ్రయాలు, విమానాలకు బాంబు బెదిరింపులు వస్తూనే ఉన్నాయి. తాజాగా శనివారం మహారాష్ట్రలో విమానానికి, న్యూఢిల్లీలోని పాఠశాలలకు బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి. ముంబై నుంచి థాయ్‌లాండ్ వెళ్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపులు రావడంతో అప్రమత్తమైన పైలట్ విమానాన్ని చెన్నైకి దారి మళ్లించారు. ఇండిగోకు చెందిన 6 ఈ 1089 విమానం శుక్రవారం రాత్రి ముంబై నుంచి థాయ్‌లాండ్‌లోని పుకెట్ దీవులకు బయల్దేరింది. విమానం గాల్లో ఉండగా... బాంబు బెదిరింపులు రావడంతో అప్రమత్తమైన పైలట్ సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. ముందు జాగ్రత్త చర్యగా విమానాన్ని చెన్నైకి దారి మళ్లించారు. అక్కడ విమానం సురక్షితంగా దిగినట్టు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలో శనివారం ఉదయాన్నే వివిధ పాఠశాలలకు బాంబు బెదిరింపు ఫోన్లు వచ్చాయి. దీంతో పోలీసులు, ఇతర అత్యవసర సంస్థలు తనిఖీలు ప్రారంభించాయని ఢిల్లీ అగ్నిమాపక సేవల అధికారి తెలిపారు. ఆంధ్రా స్కూల్, బీసీఎస్ ఇంటర్నేషనల్ స్కూల్, రావు మాన్ సింగ్ స్కూల్, కాన్వెంట్ స్కూల్, మాక్స్ ఫోర్ట్ స్కూల్ ద్వారకలోని ఇంద్రప్రస్థ ఇంటర్నేషనల్ తదితర పాఠశాలలకు బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి. అగ్నిమాపక సిబ్బంది, బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌లు, పోలీసు బృందాలు ఆయా పాఠశాలల్లో తనిఖీలు చేశాయి.

శిథిలాల కింద తుదిశ్వాస విడిచిన తల్లీపిల్లలు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో కొన్ని రోజుల క్రితం భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడగా... ఆ భారీ వరదల ధాటికి సమీప గ్రామాలు ధ్వంసం అయ్యాయి. కుంటారి లగాపాలి గ్రామంలో శిథిలాల కింద తల్లి, ఆమె ఇద్దరు కవల పిల్లలను సహాయక దళాలు గుర్తించాయి. కాంతా దేవి(38)తో పాటు ఆమెకు చెందిన పదేళ్ల కవల పిల్లలు కూడా ప్రాణాలు విడిచారు. ఇద్దరు పిల్లలను ఓ చేతితో పట్టుకుని ఆ తల్లి తుది శ్వాస విడిచింది. చివరి నిమిషం వరకు తన పిల్లలను కాపాడుకునేందుకు ఆమె తీవ్రంగా ప్రయత్నించింది. ఆ తల్లీ, పిల్లల శవాలను చూసిన స్థానికులు కన్నీరుమున్నీయ్యారు. ఇంటి భారీ గోడలు కూలడంతో వారు మరణించారు. కాంతా దేవి భర్త కున్వర్ సింగ్ కొండచరియల్లో చిక్కుకున్నా... అతను అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. 16 గంటల తర్వాత ఆ ఇంటిని ఎన్డీఆర్ఎఫ్ దళాలు అన్వేషించాయి. కాంతా దేవి భర్త ప్రాణాలతోనే ఉన్నా... అతడికి ఇప్పుడు కుటుంబం, ఇల్లు లేదు.

ప్రజలు నాతోనే ఉన్నారు

ర్యాలీలకు షరతులతో డీఎంకే ప్రభుత్వంపై విజయ్ విమర్శలు

నాగపట్నం: డీఎంకే ప్రభుత్వం తన రాజకీయ సమావేశాలకు అనేక షరతులు విధించిందని, ప్రధాన మంత్రి లేదా హోం మంత్రి సందర్శనల సమయంలో ప్రభుత్వం అలాంటి షరతులు విధించే ధైర్యం చేస్తుందా అని నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) వ్యవస్థాపకుడు విజయ్ ప్రశ్నించారు. శనివారం పుత్తూరులో జరిగిన భారీ ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ ప్రభుత్వం తన స్వేచ్ఛా కదలికను అడ్డుకుందని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించిందని అన్నారు. 'సీఎం సర్, మీరు ప్రధాన మంత్రి, హోం మంత్రి సందర్శన సమయంలో షరతులు విధిస్తారా, లేదా టీవీకేకి చేసినట్లుగా విద్యుత్‌కు అంతరాయం కలిగిస్తారా? నాపై అనేక ఆంక్షలు విధించారు. నేను నా చేతులను కదపలేకపోతున్నా' అని విజయ్ అన్నారు. ప్రధాన మంత్రి లేదా హోం మంత్రి సందర్శనల సమయంలో డీఎంకే ప్రభుత్వం అలాంటి వ్యూహాలను ఆశ్రయిస్తే అది ఇబ్బందులను ఎదుర్కొంటుందని ఆయన అన్నారు. 'ప్రజలను కలవాలనుకునే నాపై మీరు ఎందుకు షరతులు విధిస్తారు. మళ్లీ చెబుతున్నా... 2026లో పోటీ టీవీకే, డీఎంకే మధ్య మాత్రమే' అని స్పష్టం చేశారు. టీవీకే బెదిరింపులకు లొంగిపోదని, దానికి ప్రజల నుంచి గట్టి మద్దతు లభించిందని విజయ్ అన్నారు. తిరుచిరాపల్లి సమావేశంలో తన ప్రసంగం సందర్భంగా స్పీకర్ వైర్ తెగిపోయిందని, అరియలూర్‌లో విద్యుత్ అంతరాయం ఏర్పడిందని, తన రాజకీయ సమావేశాల్లో కేవలం మూడు నిమిషాలు మాత్రమే మాట్లాడగలిగానని ఆయన ఆరోపించారు. టీవీకే పట్ల 'నిరంకుశంగా' వ్యవహరించవద్దని డీఎంకే ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టడానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విదేశీ పర్యటనల గురించి మాట్లాడుతూ, ఈ పర్యటనలు నిజంగా తమిళనాడుకు పెట్టుబడులు తీసుకురావడానికేనా లేదా మీ కుటుంబం విదేశాల్లోని కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడానికేనా అని విజయ్ వ్యక్తం చేశారు. నాగపట్నం తీరప్రాంత అభివృద్ధికి డీఎంకే ప్రభుత్వం చాలా తక్కువ చేసిందని టీవీకే నాయకుడు ఆరోపించారు. మత్స్యకారులు, శ్రీలంక తమిళుల సమస్యలపై డీఎంకేను విమర్శిస్తూ, తమిళనాడు మత్స్యకారులపై దాడి జరుగుతుండటంపై ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రధాన మంత్రికి లేఖలు రాశారని, కానీ ఆ తర్వాత మౌనంగా ఉన్నారని విమర్శించారు.

సీపీఎం కార్యాలయంపై బీజేపీ గూండాల దాడి

అగర్తల: పశ్చిమ త్రిపురలోని ప్రతాప్‌గఢ్ ప్రాంతంలో బీజేపీ మద్దతు గూండాలు బుల్డోజర్‌తో తమ పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేశారని ప్రతిపక్ష సీపీఎం శనివారం ఆరోపించింది. అర్ధరాత్రి వేళ 1.30 గంటల ప్రాంతంలో గూండాలు బుల్డోజర్‌తో సీపీఎం స్థానిక కమిటీ కార్యాలయానికి వచ్చి ధ్వంసం చేశారని ప్రతిపక్ష నాయకుడు జితేంద్ర చౌదరి తెలిపారు. 'బీజేపీ మద్దతు ఉన్న దుండగులు చేసిన విధ్వంసాన్ని చూపించే వీడియో దృశ్యాలు మా వద్ద ఉన్నాయి' అని ఆయన అన్నారు. ఈ విధ్వంసం బీజేపీ, ఆర్ఎస్ఎస్ 'ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవాన్ని' చూపిస్తుందని తెలిపారు. 'తప్పుడు ప్రకటనలు చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీ 'ప్రజా నిధులను దోచుకుంటూ, రాష్ట్ర ప్రజాస్వామ్య వాతావరణాన్ని నాశనం చేస్తున్నారు' అని ఆయన ఆరోపించారు. ఈ సంఘటనను పిరికి చర్యగా అభివర్ణిస్తూ... దీనికి సంబంధించి దాఖలయిన ఫిర్యాదుపై పోలీసులు ఇంకా చర్య తీసుకోలేదని అన్నారు.

ఏజెంట్ల ఉచ్చులో చిక్కుకోవద్దు

ఇరాన్‌లో ఉద్యోగ అవకాశాలపై కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ: ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశపెట్టి... భారతీయ పౌరులను ఇరాన్ తీసుకెళ్లి కిడ్నాప్ చేసిన ఘటనలపై భారత విదేశాంగశాఖ స్పందించింది. అలాంటి ట్రాప్‌లో పడొద్దని హెచ్చరికలు జారీ చేసింది. 'భారతీయ పౌరులకు ఉద్యోగం ఇప్పిస్తామని, ఇరాన్ వెళ్లమని ప్రలోభాలకు గురిచేసిన కేసులు ఇటీవల కొన్ని వెలుగు చూశాయి. ఇరాన్‌కు చేరుకున్నాక వారిని క్రిమినల్ ముఠాలు కిడ్నాప్ చేశాయి. వారిని విడుదల చేయాలంటే డబ్బులు ఇవ్వాలని బాధిత కుటుంబాలను డిమాండ్ చేస్తున్నాయి. ఇలాంటి ఉద్యోగ ప్రతిపాదనల విషయంలో కచ్చితమైన అప్రమత్తత పాటించాలని భారతీయులను కోరుతున్నాం. పర్యాటక ప్రయోజనాల కోసం మాత్రమే ఇరాన్ ప్రభుత్వం భారతీయులకు వీసా రహిత ప్రవేశాన్ని అనుమతిస్తోందనే విషయాన్ని గమనించాలి. ఉపాధి లేదా ఇతర ప్రయోజనాల కోసం ఇరాన్ వెళ్లాలని సూచించే ఏజెంట్‌లు క్రిమినల్ ముఠాలతో కుమ్మక్కై ఉండవచ్చు. కాబట్టి వారి ట్రాప్‌లో పడకుండా అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాం' అని విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ హెచ్చరించారు. ఆస్ట్రేలియాలో ఉద్యోగం వస్తుందనే ఆశతో వెళ్లిన కేరళకు చెందిన ఓ వ్యక్తిని ఇరాన్‌లో ఓ ముఠా కిడ్నాప్ చేసిన సంగతి తెలిసిందే. హర్యానాలో ఇమిగ్రేషన్ సేవలు అందిస్తున్నట్లు అమన్ అనే వ్యక్తి కేరళకు చెందిన హిమాన్షు మాథుర్‌కు పరిచయమయ్యాడు. ఆస్ట్రేలియాలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి... కొంత డబ్బు తీసుకొని ఇరాన్ తీసుకెళ్లాడు. అక్కడ ఓ గ్యాంగ్ వీరిని కిడ్నాప్ చేసింది. అమన్ కూడా ఆ గ్యాంగ్‌లో భాగమేనని పోలీసులు తెలిపారు. ఆ తర్వాత మాథుర్ కుటుంబానికి కిడ్నాపర్లు ఫోన్ చేసి... రూ.కోటి డిమాండ్ చేశారు. చివరకు రూ.20 లక్షలు తీసుకొని విడుదల చేశారు. అంతకుముందు కూడా ముగ్గురు భారతీయ యువకులు టెహ్రాన్‌లో కిడ్నాప్‌కు గురయ్యారు. ఉద్యోగం కోసం ఏజెంట్ల సాయంతో ఢిల్లీ మీదుగా ఆస్ట్రేలియాకు బయలుదేరిన యువకులను ఇరాన్‌లో ఓ ముఠా వారిని కిడ్నాప్ చేసి డబ్బులు డిమాండ్ చేసింది. ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి పోలీసుల సాయంతో బందీలుగా ఉన్న యువకులను విడిపించింది.

కుల సర్వే అసాధ్యం

కుమారస్వామి

బెంగళూరు: రాష్ట్రంలో మరోసారి కులసర్వే నిర్వహించాలని కర్నాటక ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఈ నెల 22 నుంచి సర్వే ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బలంగా ఉన్న ఒక్కలిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులు శనివారం సమావేశమయ్యారు. రెండు రోజుల్లో మొదలుకానున్న కులసర్వేపై చర్చించారు. ఈ సమావేశానికి కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేంద్ర మంత్రి కుమారస్వామి, బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి హాజరయ్యారు. సమావేశం అనంతరం బయటకు వెళ్తున్న కేంద్ర మంత్రి కుమారస్వామిని మీడియా ప్రశ్నించగా... సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో కులసర్వే సాధ్యం కాదని అన్నారు. కులసర్వే అనేది ఒక పిల్లకాలి నిర్ణయమని ఎద్దేవా చేశారు.

బెంగుళూరు రహదారులు గుంతలమయం

రోడ్లపై జనం నిరసన

బెంగళూరు: గుంతలమయంగా మారిన బెంగళూరు రోడ్ల గురించి స్థానికులు నిరసన తెలిపారు. ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలసులు అక్కడకు చేరుకుని నిరసన నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, పోలీసుల మధ్య ఘర్షణ జరిగింది. బెంగళూరు రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో వివిధ చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్ల సమస్యను అధికారుల దృష్టికి జనం తీసుకెళ్లినప్పటికీ వారు పట్టించుకోవడం లేదంటూ శనివారం ఉదయం బెంగళూరులోని వివిధ కాలనీవాసుల్లో నిరసనలు మిన్నంటాయి. ఐటీ నగరంలో అధ్వానంగా ఉన్న రోడ్ల పరిస్థితిపై ఆందోళన చేపట్టారు. 'బెంగళూరు రోడ్లను కాపాడండి', 'రోడ్లను బాగుచేయండి' అన్న ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. మరోవైపు పోలీసులు ఆయా ప్రాంతాలకు చేరుకుని నిరసనలకు అనుమతి లేదని ... నిరసనలు ఆపాలని కాలనీవాసులను డిమాండ్ చేశారు. నిరసన ముగించకపోతే అరెస్టు చేస్తామని వారిని పోలీసులు బెదిరించారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు, పోలీసుల మధ్య వాగ్వాదం, ఘర్షణ జరిగింది. ఈ వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ప్రకృతి వల్లే గుంతలు: డీకే

బెంగళూరులో గంతల రోడ్లపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. ప్రకృతి వల్లే రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయని అన్నారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. 'ప్రకృతి వల్లే రోడ్లపై గుంతలు ఏర్పడతాయి. ఎవరూ వాటిని సృష్టించాలని అనుకోరు. వాహనాల పెరుగుదల, భారీ ట్రాఫిక్, అధిక వర్షం కారణంగా మరిన్ని గుంతలు ఏర్పడ్డాయి' అని అన్నారు. కాగా, తాము ఇప్పటికే బెంగళూరు రోడ్లపై ఉన్న ఏడువేలకు పైగా గుంతలను పూడ్చినట్లు డీకే తెలిపారు. ఇంకా ఐదువేలకు పైగా గుంతలు మిగిలి ఉన్నాయని చెప్పారు. గుంతల పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని పోలీస్ కమిషనర్‌ను కోరామన్నారు. మరోవైపు వివక్షత లేకుండా బీజేపీ ఎమ్మెల్యేలకూ గ్రాంట్లను విడుదల చేసినట్లు డీకే శివకుమార్ తెలిపారు. వారికి డబ్బు ఇచ్చిన తర్వాత బీజేపీ ఎమ్మెల్యేలు గుంతలను ఎందుకు పూడ్చలేదు అని ప్రశ్నించారు. ఇప్పుడు కూడా వారికి రూ.25 కోట్లు విడుదల చేస్తున్నామని తెలిపారు. కాగా, రోడ్ల దుస్థితిపై ఈ నెల 24న బెంగళూరుతో సహా కర్నాటకలోని అన్ని నియోజకవర్గాల్లో గంట పాటు రోడ్లు నిర్బంధిస్తామన్న బీజేపీ ప్రకటనపై డీకే స్పందిస్తూ 'సమస్యను పరిష్కరించడానికి మేం ఇక్కడ ఉన్నాం. బీజేపీ రాజకీయాలు చేస్తోంది. వారు ఏమి చేయాలనుకుంటే అది చేయనివ్వండి' అని మీడియాతో అన్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

స్వయం ఉపాధితో అభివృద్ధి సాధించాలి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : స్వయం ఉపాధిని కల్పించేందుకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సొంత నిధులను కేటాయించి పలువురికి ఉపాధిని కల్పించే విధంగా చర్యలు చేపట్టారు. శనివారం సర్దార్ పటేల్ నగర్ మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ కొరకు రూ.2,50 లక్షలను అందజేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిధులతో జూకి స్టిచ్చింగ్ మెషిన్లు 5, స్టిచ్చింగ్ మెషీన్లు 5, పికో మేషిన్స్ 2, కట్టింగ్ టేబిల్ 2, ఛైర్స్ 50, మిటింగ్ టేబిల్ 1, మెషీన్ స్టోల్స్ 12, అల్మార 1, ఈ సామాగ్రీ తీసుకునే వీలు కలుగుతుంది. ఈ వస్తువులను తీసుకుని స్వయం ఉపాధిని మెరుగు పర్చుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్, చంద్రకళ, ప్రేమలత, తార, లక్ష్మి, లలిత, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు డోలీ రమేష్, జనార్దన్, బంటి, నవీన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత జీవన శైలిని అవలంభించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ కంపెనీ బ్యాగ్ ఏ సాయిల్ 2 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎలాంటి వేడుకలు నిర్వహించకుండా, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ హిత జీవన విధానాన్ని ప్రోత్సహించేందుకు మునుగోడు నియోజకవర్గంలో అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా, బ్యాగ్ ఏ సాయిల్ బృందం మునుగోడు ప్రభుత్వ అధికారులు ఎం.పి.డి.ఓ, ఎం.ఆర్.ఓ సబ్ ఇన్స్పెక్టర్లను కలిసింది. వారు ఈ కార్యక్రమానికి పూర్తి మద్దతు తెలుపుతూ ప్రోత్సాహం ఇచ్చారు. మునుగోడు ప్రజలు ప్లాస్టిక్-రహిత జీవన శైలి అవలంభించి, తెలంగాణకు ఆదర్శ నియోజకవర్గంగా నిలవడం మా ప్రధాన లక్ష్యం. కో-ఫౌండర్లు తమ ప్రకటనలో పేర్కొన్నది. ఒక వ్యక్తి ఒంటరిగా ఒక్క రోజులో మార్పు తేవడం సాధ్యం కాదు. అందరి సహకారం అవసరం, ప్రతి మునుగోడు ప్రజలు తమ రోజువారీ అవసరాల కోసం ప్లాస్టిక్ బ్యాగ్ల స్థానంలో పర్యావరణహిత బ్యాగులు వాడాలని, అలాగే మాంసం, ఇతర ఆహార పదార్థాల కోసం స్టీల్ బాక్స్లు వాడాలని అభ్యర్థించారు. కో-ఫౌండర్ మక్కెన గిరీశ్ చౌదరి కొంపల్లి గ్రామం నుండి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ ఈ కార్యక్రమానికి భరోసా ఇచ్చి, దీనిని శాశ్వతంగా 100% అమలు చేస్తామని హామీ ఇచ్చారు. బ్యాగ్ ఏ సాయిల్ పునాది స్థాయి నుండి కృషి చేస్తూ, ప్లాస్టిక్-రహిత, పర్యావరణ హిత మునుగోడు లక్ష్యాన్ని సాధించేందుకు కట్టుబడి ఉందని నిర్వహకులు తెలిపారు. స్వంత గ్రామంలో చొరవ తీసుకొని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని నిర్వాహకులు కోరారు. పూర్తి సహకారాన్ని అందించిన మక్కెన అప్పారావు, కుంబం శ్రీనివాస్‌రెడ్డి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ నల్లా కనెక్షన్‌దారులపై కేసు నమోదు

విశాలాంధ్ర - హైదరాబాద్ : జలమండలి సరఫరా చేస్తున్న మంచినీటి పైపులైను నుంచి అక్రమంగా నల్లా కనెక్షన్ పొందిన 49 వ్యక్తుల మీద జలమండలి విజిలెన్స్ అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేసారు. వివరాల్లోకి వెళ్తే% జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ -4, రెడ్‌హిల్స్ హై లెవెల్ సెక్షన్ పరిధిలోని బజార్ ఘాట్ లో మైరాజ్, ఇరామ్ ఫార్చ్యూన్ అపార్ట్‌మెంట్స్, డోర్.11-5-340, అపార్ట్‌మెంట్ అఖీల్, 47 మంది పేరుతో నమోదు చేయబడింది. వీరు జలమండలి అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా 20 ఎంఎం నల్లా కనెక్షన్ తీసుకున్నారు. విజిలెన్స్ అధికారుల తనిఖీలో బయటపడ్డ ఈ విషయం పై సంబంధిత యజమానులు 48 మంది మీద నాంపల్లి పోలీస్ స్టేషన్లో క్రిమినల్ కేసు నమోదు చేసారు.ఓ అండ్ ఎం డివిజన్ -4, హిందీ నగర్ సెక్షన్ పరిధిలో అఘాపురాలో ఇంటి నెం. 5-6-99 ప్రాంగణంలో రెండు 20ఎంఎం అక్రమ నీటి కనెక్షన్లు గుర్తించారు. ఈ భవనం సలాహుద్దీన్ పై విజిలెన్స్ అధికారులు హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్, హైదరాబాద్ పోలీస్‌స్టేషన్లో క్రిమినల్ కేసు నమోదు చేసారు. అధికారుల అనుమతులు లేకుండా అక్రమ నల్లా కనెక్షన్లు తీసుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జలమండలి అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఎవరైనా అక్రమ నల్లా కనెక్షన్లు గుర్తించినా, డొమెస్టిక్ కనెక్షన్ తీసుకుని కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్న వారిని గుర్తించినట్లయితే జలమండలి విజిలెన్స్ బృందంకు లేదా 9989998100 నెంబర్ కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగలరు.

అన్ని దానాల్లో కన్నా గొప్పది అన్నదానం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : హెూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం ఏంతో గొప్పదని రంగారెడ్డి గ్రంథాలయ చైర్మెన్ ఏలుగంటి మధుసూధన్ రెడ్డి తెలిపారు. హెూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 150వ అన్నదాన కార్యక్రమంలో జబర్దస్త్ టీం సభ్యుడు రాంప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సుమారు 2000 మందికి హెూప్ వాలంటీర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టారు. అన్నదాన కార్యక్రమం 150 వారాలుగా కొనసాగడం ఏంతో గొప్ప విషయమని జబర్దస్త్ ఫేం రాంప్రసాద్ తెలిపారు. 2 వేల మంది ఒక పద్ధతి క్రమంలో భోజన కార్యక్రమంలో పాల్గొనడం పట్ల ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా హెూప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3 సంవత్సరాల క్రితం ప్రారంభం చేసిన అన్న సమారాధన నిరంతరం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెూప్ ఫౌండేషన్ సభ్యులు, లయన్స్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో

కోర్టుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

సీఎం.రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో న్యాయ వ్యవస్థకు సంబంధించి మౌలిక సదుపాయాల కల్పన, న్యాయస్థానాల్లో సిబ్బంది నియామకం వంటి అంశాలపై తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్రంలో ముఖ్యంగా కొత్త జిల్లాల్లో కోర్టు భవనాలు, మౌలిక వసతులను కల్పించడంతో పాటు అవసరమైన మేరకు సిబ్బంది నియామకాలను చేపట్టాలని జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సూచించారు. ఈ అంశాలకు సంబంధించి పలు ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ప్రాధాన్యత క్రమంలో వివిధ జిల్లాల్లో కోర్టులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే కాకుండా సిబ్బందిని నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలియజేశారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో జరిగిన ఈ సమావేశంలో జస్టిస్ సామ్ కోశి, జస్టిస్ అభినంద్ కుమార్ శావిలి పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సెప్టెంబర్ 28న భగత్ సింగ్ 118వ జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, భగత్ సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్, గంజాయి మాధకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ 118వ జయంతికి సంబంధించిన కర పత్రాన్ని హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ భగత్ సింగ్ జీవితం భారత దేశ యువతకు స్ఫూర్తి దాయకమని, అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలపాల్సిన భాధ్యత పాలకులదేనని వారు ఉద్ఘాటించారు. భగత్‌సింగ్ జయంతిని పాలకులు అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల ఐక్యతను చీల్చే మతోన్మాద రాజకీయాలు నేడు దేశంలో విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని, స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనైనా, నేటి కాలంలోనైనా అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చి దోపిడీదారులకు ఉపకరించే, దేశ ద్రోహ కర్తవ్యాన్నే మతోన్మాద శక్తులు నెరవేరుస్తున్నాయని ధ్వజమెత్తారు. దేశ స్వాతంత్ర్య సముపార్జన ధ్యేయంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన భగత్ సింగ్ స్వాతంత్ర్య అనంతరం కుల, మతాలకు అతీతంగా ధనిక, పేద తారతమ్యాలు లేని, అవినీతి రహిత సమసమాజ స్థాపన కలలు కన్నాడన్నారు. మతోన్మాద ముక్త భారతం సాదించడానికి భగత్ ఆలోచనలు, ఆయన చూపిన కార్యాచరణ, మనకు తరగని స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఇనుప కండరాలు, ఉక్కునరాలు గల యువత దేశానికి అవసరం అని ప్రభోదించి సూక్తిగా నిలిచి "ఆత్మ విశ్వాసంకు మించిన ఆయుధం లేదని చాటి చెప్పిన భగత్ సింగ్ ప్రేరణతో, యువజనులతో మమేకమై ఉత్తేజ, ఉద్వేగభరితమైన ఉద్యమాలు సాగిస్తూ ఏఐవైఎఫ్ యవజనుల గుండెల్లో నిలిచిందన్నారు. సామాజిక, న్యాయం, లౌకిక వాదన పరిరక్షణ, శాస్త్రీయ సోషలిజం, తీవ్రవాదానికి వ్యతిరేకంగా శాంతి స్థాపన కోసం, అశ్లీల సాహిత్యం, అశ్లీల సినిమాల నిషేధం కోసం, దేశాన్ని చీల్చడానికి కుట్రలు చేసే వచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా, దేశ ఐక్యత, సమైక్యత కోసం ఏఐవైఎఫ్ కృషిచేస్తున్నదన్నారు. ఇంతటి పోరాట చరిత్ర కలిగిన ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 118వ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా క్రీడోత్సవాలు, వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు, సదస్సులు, ర్యాలీలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్,శ్రీమాన్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాల కృష్ణ,శివకుమార్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్, కళ్యాణ్,మధుకర్, వెంకటేష్, రాజ్ కుమార్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

90 ఏళ్లు దాటిన ఆశ్రమ వాసులను ఘన సత్కారం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ (సి ఆర్ ఫౌండేషన్) వృద్ధాశ్రమంలో సుదీర్ఘకాలం పాటు నివసిస్తూ 90 ఏళ్లు దాటిన ఆశ్రమ వాసులను ఘనంగా సత్కరించడం జరిగింది. ముందుగా 101 సంవత్సరం దాటి ఆరోగ్యంగా చురుకుగా తిరుగుతున్న స్వాతంత్ర సమరయోధు డు ఎడమ రామిరెడ్డిని సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ శాసన సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి శాలువా కప్పి సత్కరించారు. ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో గత 23 సంవత్సరాలుగా నివసిస్తూ ఇటీవలే 90 జన్మదినం జరుపుకున్న సీనియర్ పాత్రికేయులు ఏ బి కె ప్రసాద్, బి వేణుగోపాల్, పాలడుగు సీతాదేవి, బాలమ్మ, ఏలినేని సత్యనారాయణ, కె.సుమిత్ర చౌదరి, వైదేహి, ముప్వ గురవయ్య, పర్వతనేని లీలా కుమారి, జయప్రదంబ, ఈశ్వరమ్మ, సుబ్బలక్ష్మి, డాక్టర్ పి సరస్వతి, పి సంపూర్ణమ్మ ను సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి, శాసనమండలి మాజీ సభ్యులు పీజె చంద్రశేఖరరావు, సిఆర్ పాలి క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కూనంనేని రజని, మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జోస్య భట్ల కల్పన, వృద్ధాశ్రమం సలాహకమిటి సభ్యులు టీ. రాజేంద్ర రావు, డాక్టర్ మండవ గోపీచంద్, మహిళా సంక్షేమ కేంద్ర సభ్యురాలు వి. లలిత, మల్లంపాటి వెంకటేశ్వరరావు ఆశ్రమ వాసులను సన్మానిం చారు. సిఆర్ ఫౌండేషన్ ట్రెజరర్, వృద్ధాశ్రమ డైరెక్టర్ వి చెన్నకేశవరావు సభకు అధ్యక్షత వహించారు. విశ్రాంత ప్రొఫెసర్ బి వేణుగోపాల్ మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా సి ఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఉంటూ, ఇక్కడి ప్రశాంత వాతావరణం వల్ల, ఆయన సతీమణి డాక్టర్ రంగనాయకితో కలసి పలు గ్రంథాలు రచించ గలిగామని చెప్పారు. ఈ సందర్భంగా సన్మానితులు మాట్లాడుతూ ఈ వృద్ధాశ్రమంలో నివసిస్తున్నందు వల్ల తాము ఆయు రారోగ్యాలతో ఉన్నామని, తమ జీవిత కాలం పెరుగుతున్నదని, ఫౌండేషన్ అందిస్తున్న సేవలను స్మరిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. సన్మానితుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మాట్లాడుతూ సీఆర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను కొనియాడారు. తమ కుటుంబం కూడా అందించలేని ఆప్యాయతలు, సౌకర్యాలను ఫౌండేషన్ కల్పిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. 90 సంవత్సరాల పైబడిన వారిపై డాక్టర్ సరస్వతి, తమ్మారెడ్డి తాన్యా రచించిన కవితలు ఆశ్రమవాసి పి భాస్కరరావు చదివి వినిపించారు.

ప్రతిభ చాటిన శ్రేయా శుక్లా



విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: కూతురిని డాక్టర్ ని చేయాలన్నది ఆ తండ్రి కష్టపడి చదివి ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకును సాధించి సాధించింది. కోరుకున్న కళాశాలలో మెడిసిన్ చేయగలిగే స్థాయిని అందుకుంది. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం ఎలికట్ట గ్రామ పరిధిలోని దేవశ్రీ పరిశ్రమలో మేనేజర్‌గా పని చేస్తున్న శుక్లాజి కూతురు శ్రేయా శుక్లా ఈ ఘనతను సాధించింది. హెరిటేజ్ స్కూల్లో పదవ తరగతి వరకు చదివి అనంతరం శ్రీ చైతన్యలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఈ బాలిక మెడిసిన్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 29188 ర్యాంకును అందుకుంది. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రస్థాయిలో 388 ర్యాంకును సాధించింది. శనివారం షాద్ నగర్ పట్టణంలోని బీకే ఛాంబర్స్‌లో సీనియర్ న్యాయవాదులు కరీం, మోముల బసప్ప తదితరులు శుక్ల అతని కూతురు శ్రేయను ఘనంగా సన్మానించడం జరిగింది.

బతుకమ్మ తెలంగాణ అస్తిత్వాన్ని తెలిపే పూలపండుగ

విశాలాంధ్ర - హైదరాబాద్ : బతుకమ్మ పండుగ తెలంగాణ అస్తిత్వాన్ని తెలిపే పూల పండుగ అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ నగర ఎన్ఎస్యుఐ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన బతుకమ్మ పండుగ సంబరాలకు ఎమ్మెల్యే, నారాయణ పేట ఎమ్మెల్యే డాక్టర్ పర్ణికా రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలకు ఎంతో చరిత్ర ఉందన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఎమ్సెస్సి ఎంట్రెన్స్ టెస్ట్‌లో టాప్ రెండు ర్యాంకులు మన కళాశాలకు వచ్చాయని ప్రిన్సిపాల్ చెప్పగానే ఎంతో సంతోషంగా ఉందన్నారు. మీరు అనుకుంటే ఎంతటి లక్ష్యాన్ని అయినా చేరుకోగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ పర్ణికా రెడ్డి మాట్లాడుతూ మంచిగా చదువుకొని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో వారం రోజుల పాటు జరిగిన ఓరియంటేషన్ శిక్షణ పొందిన విద్యార్థులకు నారాయణ పేట ఎమ్మెల్యేతో కలిసి ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్ పి వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు అజ్మత్ అలి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు జాజి మొగ్గ నర్సింహులు, ఖాజా పాషా, ఉమర్, ఎన్ఎస్యుఐ నరేష్, ఎన్ఎస్యుఐ రాష్ట్ర కార్యదర్శి ముకుందం రమేష్, ముకుందం రమేష్ లీడర్ రఘు, అర్షద్, శ్యాం, అలీం, వైస్ ప్రిన్సిపాల్ అనురాధ పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం

విద్యార్థుల భవిష్యత్తే తనకు ముఖ్యమని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నగరంలోని క్రౌన్ ఫంక్షన్ హాల్ లో జిల్లా ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు 2025 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అవార్డు గ్రహీతలకు పురస్కారాలను ప్రదానం చేశారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ ను ఎడ్యుకేషనల్ హబ్ గా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు తాను కృషి చేస్తున్నానని ఆయన చెప్పారు. మన మహబూబ్ నగర్ జిల్లా పిల్లల కోసమే ఎన్నో ఉత్తమ విద్యాసంస్థలు మహబూబ్ నగర్ జిల్లాకు తెస్తున్నామన్నారు. రానున్న పదవ తరగతి వార్షిక ఫలితాల్లో తెలంగాణ రాష్ట్రంలో మన మహబూబ్ నగర్ ను మొదటి స్థానంలో నిలపాలని ఆయన సూచించారు. ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల జీతాలు చాలా తక్కువగా ఉంటాయని, వారికి ఏ చిన్న ఆపద వచ్చినా వారు తట్టుకోవడం కష్టమే అన్నారు.

ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక బతుకమ్మ

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ఆడబిడ్డలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించుకునే గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయలకు ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఆడపడుచులందరూ కలిసి సంతోషంగా జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. తెలంగాణ సాముహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనం అని అన్నారు. ఎంగిలిపూల నుంచి సద్దుల వరకూ తొమ్మిది రోజులు బతుకమ్మ ఆట పాటలతో అందరూ వైభవంగా ఈ పండుగను జరుపుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, అందరూ ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలని గౌరమ్మను సీఎం ప్రార్థించారు.

నేటి నుండి బతుకమ్మ సంబరాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ సంబురాలు రేపటి (ఆదివారం) నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మొదలుకానున్నాయి. బతుకమ్మ ప్రారంభ వేడుకలకు చారిత్రక వేయి స్తంభాల గుడి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. పర్యాటక శాఖ, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అనసూయ బతుకమ్మ అరంభ వేడుకలో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం ఈ ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. సకల జనులు, సబ్బండ వర్ణాలు కలిసి ఏకత్వస్ఫూర్తిని చాటేలా రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు రూపొందించింది. చారిత్రక ప్రదేశాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రాంతాల్లో 9 రోజుల పాటు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నహాలు చేసిందని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. ప్రకృతితో మమేకమైన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యాన్ని బతుకమ్మ పండుగ విశ్వవ్యాప్తంగా చాటుతోందని అన్నారు. తెలంగాణ ఆడ్డబిడ్డలందరికీ ఈ సందర్భంగా బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజలందరి బతుకుల్లో వెలుగులు నింపుతూ, మరింతగా సుఖ సంతోషాలతో జీవించేలా దీవించాలని ప్రార్థించారు. బతుకమ్మ పండగను సంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని కోరారు.

బతుకమ్మను జాతీయ పండుగగా గుర్తించాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : తెలంగాణ సంస్కృతిలో భాగమైన ప్రపంచం వ్యాప్తంగా గుర్తింపు పొందిన బతుకమ్మ పండగను జాతీయ పండుగ గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సగర ఉప్పరి సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈనెల 24న ట్యాంక్ బండ్ బతుకమ్మ ఘాట్ వద్ద నిర్వహించ తలపెట్టిన బతుకమ్మ వేడుకలను కులమతాలకు పార్టీలకతీతంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బతుకమ్మ సంబరాల వాల్ పోస్టర్‌ను సంఘం రాష్ట్ర మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గనుల స్రవంతి, రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్, గౌరవ అధ్యక్షులు ముత్యాల హరికిషన్, గ్రేటర్ అధ్యక్షులు వెంకట్ స్వామి, బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, నాయకులు కుందారం గణేష్ చారి, మణిమంజరిలతో కలసి ఆవిష్కరించి మాట్లాడారు. మానవ సంబంధాలు, నైతిక విలువలకు ప్రతీక బతుకమ్మ పండగ అన్నారు. మైనార్టీ మహిళకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాన్ని బీసీ మహిళలకు కూడా వర్తింపజేసి రూ.1 లక్ష అందజేయాలని డిమాండ్ చేశారు. మహిళా అధ్యక్షురాలు స్రవంతి సగర మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో గత 2015 నుంచి ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసారి కూడా సుమారు 2500 నుంచి 3000 మందితో భారీ ఎత్తున బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండ సురేఖ, సంస్కృతిక సారధి చైర్పర్సన్ వెన్నెల గద్దర్, బీసీ కమిషన్ సభ్యురాలు బాల బీసి కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి హాజరవుతారని తెలిపారు. సంఘం నాయకులు సత్యం, రవి, పల్లవి పాల్గొన్నారు.

అలై బలై కార్యక్రమానికి నాగార్జునకు ఆహ్వానం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ బండారు విజయలక్ష్మి చైర్ పర్సన్ అలై బలై ఫౌండేషన్ ప్రసిద్ధ తెలుగు సినిమా నటులు, నిర్మాత అక్కినేని నాగార్జునని శనివారం అన్నపూర్ణ స్టూడియో, బంజారా హిల్స్, హైదరాబాద్‌లో తాము నిర్వహిస్తున్న "అలై బలై - 2025" లో పాల్గొనవలసిందిగా ఆహ్వాన పత్రిక అందజేశారు.

యుపిహెచ్‌సి భవన నిర్మాణానికి మోక్షం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఏకలవ్య నగర్‌లో యుపిహెచ్‌సి భవన నిర్మాణానికి పెట్టకేలకు మోక్షం లభించింది. గత కొన్ని సంవత్సరాలుగా గౌతమ్ నగర్‌లో యుపిహెచ్‌సి ఉన్నప్పటికీ సొంత భవనం లేకపోవడంతో అద్దె ఇళ్లలో కేంద్రాన్ని నడిపారు. సొంత భవన నిర్మాణం చేయించాలనే లక్ష్యంతో మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి రూ.1 కోటి 43 లక్షలను భవన నిర్మాణానికి మంజూరు చేయించారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, మల్కాజ్గిరి తహసీల్దార్ కార్యాలయం ఆర్ఐ పరమేశ్వర్ రెడ్డి, సర్వేయర్ ప్రశాంతలతో కలిసి ఆమె ఏకలవ్య నగరంలో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏకలవ్య నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు స్థల నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి, స్థానిక కార్పొరేటర్ మేకల సునీత యాదవ్‌కి సంక్షేమ సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో భవన నిర్మాణం చేపట్టేలా కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఏకలవ్య నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు మైసయ్య, నర్సింగరావు, చిట్టిబాబుతో పాటు స్థానిక నాయకులు మేకల రాము యాదవ్, సిద్ధిరాములు, బైరు అనిల్, కావాలి శ్రీనివాస్, భరత్ ప్రజలు పాల్గొన్నారు.

రైతులు, నిరుపేదలకు భరోసా ఉపాధి హామీ పథకం

విశాలాంధ్ర - పినపాక: నిరుపేద కుటుంబాలతోపాటు సన్న చిన్నకారు రైతుల ఆర్థిక అభివృద్ధికి భరోసా ఇచ్చేది మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఎంతో దూర దృష్టితో 2005 ఏడాది దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్ నాయకత్వంలో కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టిందని గుర్తు చేశారు. ఇలాంటి మహత్తర పథకాన్ని బిజెపి మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు పెద్ద స్థాయిలో నిధులు తగ్గించినట్లు విమర్శించారు. శనివారం పినపాక మండల కేంద్రంలో ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన పనిముట్లను ఆయన కూలీలకు కమిటీ చేశారు. ఏడిఏ తాతారావు, ఎంపీడీవో సునీల్ కుమార్, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఏవో వెంకటేశ్వర్లు, డాక్టర్ మధు, వెంకటేశ్వర్లు, ఏపీవో వీరభద్ర, హౌసింగ్ ఏఈ గుమ్మడి వినీత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామనాథం, మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, మాజీ సర్పంచులు గోగ్గల నాగేశ్వరరావు, తోలేం కళ్యాణి, లక్ష్మారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిల్డింగ్ వర్కర్స్‌కు దేశంలోనే ఎక్కువ ఎక్స్‌గ్రేషియా ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ బోర్డులో నమోదైన 25 లక్షల మంది కార్మికుల కొరకు, తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన, గౌరవ లేబర్ మినిస్టర్ వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర మంత్రివర్గం నిన్న తీసుకున్న నిర్ణయం, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో నిలకడగా ఉన్నటువంటి 17 లక్షల కుటుంబాలకు మేలు జరిగే విధంగా, గతంలో ఉన్నటువంటి ప్రమాదవశాత్తు మరణానికి ఎక్స్రేషియా ఆరు లక్షలు దానిని పది లక్షలకు పెంచటం, గతంలో సాధారణ మరణానికి ఉన్న ఎక్స్రేషియా ను 1,30,000 నుండి 2 లక్షలకు పెంచటం, హర్షించదగ్గ విషయమని, ఈ సందర్భంగా రాష్ట్ర లేబర్ మినిస్టర్ వివేక వెంకట స్వామిని సోమాజిగూడలోని వారి నివాసంలో కలిసి కృతజ్ఞతలు శుభాకాంక్షలు తెలియజేస్తున్న, తెలంగాణ రాష్ట్ర ఐఎన్టీయూసీ అనుబంధ రాజీవ్ గాంధీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, నాయకులు, గౌరవ అధ్యక్షులు ఎరగాని నాగన్న గౌడ్, ఐ ఎన్ టి యు సి రాష్ట్రఉపాధ్యక్షు లు విజయ్ కుమార్ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దపూర బ్రహ్మయ్య, యూనియన్ అధ్యక్షులు, ఇరుగు యాదయ్య, దారముల వెంకటేష్ కిన్నెర లాలయ్య, ఆకారపు రాము, చాగంటి ప్రభాకర్, చూడుత మహేష్, కృపాటి యాదగిరి, సుబ్బారావు, బి.అచ్యుత్, దూరు యాకన్న పాల్గొన్నారు.

పెన్షన్‌దారులు, దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఎన్నికల ముందు అబద్ధాల వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పెన్షన్ దారులకు, వికలాంగులకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ 4000 నుంచి 6000, 2000 నుంచి 4000 రూపాయలను అర్హుల ప్రకారం అందించాలని ప్రభుత్వాని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్, వి.హెచ్.పి.ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ కార్యదర్శులకు మున్సిపాలిటీలలో కౌన్సిలర్లకు, జిహెచ్ఎంసి కార్పొరేటర్లకు వినతి పత్రాన్ని అందించే కార్యక్రమంలో భాగంగా ఎమ్మార్పీఎస్, వి.హెచ్.పి.ఎస్ నాయకులు కార్పొరేటర్ ను శనివారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమవుతుందని చెప్పారు. ఎమ్మార్పీఎస్, వి.హెచ్.పి.ఎస్ చేస్తున్న ఉద్యమాన్ని మా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి మా వంతు సహకారాన్ని పెన్షన్ దారులకు, వికలాంగులకు న్యాయం జరిగే విధంగా, సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇన్చార్జీ తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, జాతీయ నాయకులు ఎంఆర్.పిఎస్. జిల్లా అధ్యక్షులు కేశపాగ రామచందర్ మాదిగ, ఎం.జె.ఎఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్, మేడ్చల్ జిల్లా వి.హెచ్.పి.ఎస్ అధ్యక్షులు వినయ్, నాయకులు కే.బి.జె హరి, పి.రాములు, సోను, నరసింహ, రాములు యాదవ్, రమాదేవి, జ్యోతి కీర్తి, ఎస్.ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

డెక్కన్ స్ప్రింగ్ గ్లోబల్ స్కూల్లో బతుకమ్మ సంబరాలు

విశాలాంధ్ర - కాప్రా : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు దసరా ఉత్సవాలు అద్దం పడతాయి. దసరా నవరాత్రుల సందర్భంగా జగన్మాతను రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ రూపంలో గౌరమ్మను రంగు రంగుల పూలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో సోదరీమణులు రోజూ పూజలు చేస్తారు. బతుకమ్మ వేడుకలను నాచారంలోని డెక్కన్ స్ప్రింగ్ గ్లోబల్ స్కూల్‌లో శనివారం ఘనంగా యాజమాన్యం నిర్వహించింది. విద్యార్థులు రంగు రంగుల పూలతో బతుకమ్మను అలంకరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ అక్కినేని స్వర్ణ, ప్రైమరీ వైస్ ప్రిన్సిపాల్ రమ్య, కో ఆర్డినేటర్ రిధిమ అలంకరించిన బతుకమ్మలను వేదికపై ఉంచి, విద్యార్థులతో కలసి పూజలు జరిపారు. స్వర్ణ మాట్లాడుతూ చెడుపై మంచి గెలుపొందడం, దసరా ఉత్సవాల అంతరార్థం అని గుర్తు చేశారు. చైర్మన్ నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, డైరెక్టర్ కమలా మనోహర్, కోర్ హెడ్ ఆపరేషన్స్ కిషోర్ కుమార్ పాల్గొని, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

మాంటిస్సోరి పాఠశాలలో బతుకమ్మ సంబరాలు..

విశాలాంధ్ర - కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ కేంద్రంలో గల మాంటిస్సోరి పాఠశాలలో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థినిలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని అంగరంగ వైభవంగా సంబరాలు జరుపుకున్నారు. గత 20 ఏళ్లుగా పాఠశాల నిర్వాహకులు విద్యార్థులకు చదువుతోపాటు పండగలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు మంచి ప్రాధాన్యత కల్పిస్తారని తల్లిదండ్రులు కొనియాడారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం బతుకమ్మ సంబరాలతో పాటు దసరా శుభాకాంక్షలు తెలిపారు. నిర్వాహకులు జాండగూడెం సుదర్శన్ గౌడ్, సరాపు రమేష్, జార్జ్ థామస్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన మాజీ మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పోచమ్మకుంటలో జరుగుతున్న సిసి రోడ్డు పనులు పార్వతాపూర్ అరోరా కాలేజ్ సమీపంలోని ఎస్ఎన్‌డిపి పనులను మాజీ మేయర్ అమర్ సింగ్ శనివారం సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్శనలో స్థానిక నివాసితులతో మాట్లాడి, జరుగుతున్న పనులపై అభిప్రాయాలు సేకరించి, పనుల నాణ్యత పురోగతిని పరిశీలించారు. అధికారులు ఈ క్రింది అంశాలను నిర్ధారించాలని ఆదేశించారు. పనులు సమయానికి, నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేయడం, పునరావృత నష్టాలు రాకుండా మన్నికైన పదార్థాల వినియోగం, పనులు పూర్తయ్యాక కాలనీ ప్రజలకు రవాణా సౌలభ్యం కల్పించడం, ఈ తనిఖీ ద్వారా కాంట్రాక్టర్లపై బాధ్యత కల్పించి, పౌరులకు దీర్ఘకాలిక ఉపశమనం మరియు మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన పౌర మౌలిక వసతులు అవసరమని హైలైట్ చేస్తూ, ప్రజల సమస్యలను తక్షణమే సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోడిగె కృష్ణ గౌడ్, మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్, వీరాంజనేయులు దేవాలయం మేడిపల్లి కె. రాంరెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

యువ కళాకారుల ప్రతిభ వెలుగులోకి తెచ్చేందుకు

బతుకమ్మ యంగ్ ఫిల్మ్‌మేకర్స్ ఛాలెంజ్ పోటీలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ ఆద్వర్యంలో ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న "బతుకమ్మ యంగ్ ఫిల్మ్‌మేకర్స్ ఛాలెంజ్" బ్రోచర్, పోస్టర్‌లను రాష్ట్ర రోడ్ల భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, కళారూపాలు, ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వీడియోలను రూపొందించి, యువ కళాకారులు తమలోని సృజనాత్మకతను ప్రపంచానికి చాటే ఈ మహత్తర అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పోటీలో పాల్గొని బహుమతులు గెలుచుకోవాలని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎఫ్డీసి చైర్మన్ దిల్ రాజును మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్ళేందుకు, యువ కళాకారుల ప్రతిభ వెలుగులోకి తెచ్చేందుకు ఈ పోటీ సరైన వేదిక కానుందని మంత్రి పేర్కొన్నారు.

బతుకమ్మ యంగ్ ఫిల్మ్‌మేకర్స్ ఛాలెంజ్" పోటీ వివరాలు..

ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం (మహిళలకు ఉచిత బస్సు, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ తదితరాలు), తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిమ్స్, పాటల పోటీలు ఉంటాయి. షార్ట్ ఫిలిమ్స్ నిడివి 3 నిమిషాలకు, పాటల వ్యవధి 5 నిమిషాలకు మించి ఉండకూడదు. ఈ పోటీలో పాల్గొనే వారందరూ 40 ఏళ్ళ లోపు వయసు కలిగి ఉండాలి. రిజల్యూషన్ కలిగి ఉండాలి. షార్ట్ ఫిల్మ్స్/ వీడియో సాంగ్స్ ఏవైనా ఈ పోటీలలో సూచించిన 'థీమ్' ల పైనే ఉండాలి. మీరు చేసిన వీడియోలు గతంలో ఎక్కడా ప్రదర్శించి ఉండకూడదు. బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ కోసమే చిత్రీకరించినవై ఉండాలన్నారు. పోటీల్లో ఎంపికైన థీమ్స్‌కు ప్రథమ బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.2 లక్షలు, తృతీయ బహుమతి రూ.1 లక్ష, కన్సోలేషన్ బహుమతి రూ.20 వేలు (అయిదుగురికి) ఇవ్వడంతో పాటు విజేతలందరికీ ప్రశంసా పత్రం, జ్ఞాపిక ప్రదానం చేస్తారు. నిర్దేశిత గడువులోగా వచ్చిన ఎంట్రీలను నిపుణులతో కూడిన జ్యూరీ వీక్షించి వివిధ కేటగిరీలలో ఎంపికలు పూర్తి చేస్తుంది. ఎంట్రీలను ఈ కింది మెయిల్ ఐడీ youngfilmmakerschallenge @gmail.com లేదా వాట్సాప్ నెంబర్ - 8125834009కు పంపాలి. ఎంట్రీలను పంపించేందుకు తుది గడువు సెప్టెంబరు 30వ తేదిగా నిర్ణయించారు.

యువత రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - కొత్తూరు: నేటి సమాజంలో యువత చదువుతోపాటు రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండలం, రంగాపూర్ గ్రామ శివారులో గల హిప్పో క్యాంపస్ పాఠశాలలో శనివారం పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు నేషనల్ యూత్ పార్లమెంట్ స్కీం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాక్ పార్లమెంట్ లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పార్లమెంట్ సమావేశాల తరహాలో చిన్నారి విద్యార్థులు పాలకపక్ష, ప్రతిపక్ష నాయకుల మధ్య జరిగే వాదనలను చక్కగా ప్రదర్శించారు. అదేవిధంగా అభివృద్ధి పట్ల పాలకపక్ష నాయకులు వివరించగా జరగని అభివృద్ధిపై ప్రతిపక్షాల నాయకులు నిలదీసిన తీరు చూపరులను ఆకట్టుకుంది. చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన యాజమాన్యంతో పాటు వివిధ బాధ్యతలు చేపట్టి చక్కగ వ్యవహరించిన విద్యార్థులను ఎమ్మెల్యే శంకర్ అభినందించారు. చిన్నారి విద్యార్థు లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు తరగతి గది నుండే ప్రారంభం అవుతుంది కాబట్టి ఇష్టపడి చక్కగా చదువుకుంటే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు. నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదగాలని, అంతేకాకుండా విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు కలిగి ఉందని అన్నారు. అందుకు విద్యార్థులు, యువత రాజకీయాలు, పార్లమెంటు వ్యవహారాలపై అవగాహన పెంచుకొని ప్రజా స్వామ్య విలువలను కాపాడాలని అన్నారు. పాఠశాల వైస్ ప్రెసిడెంట్ లలిత రెడ్డి, సీనియర్ అకాడమిక్ కన్సల్టెంట్ పూజా రామచంద్రాని, ప్రిన్సిపల్ జయ శ్రీ,మేనేజర్ శ్రావణ్ కుమార్,కాంగ్రెస్ నందిగామ మండల పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహ యాదవ్, నాయకులు కొమ్ము కృష్ణ, కుమారస్వామి గౌడ్, చిల్క మారి నరసింహ, జ్ఞానేశ్వర్, శ్రీపాల్ రెడ్డి, జంగయ్య యాదవ్, విగ్నేశ్వర్ రెడ్డి, పర్వతాలు, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దర్గా గంధోత్సవం

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గు మండల కేంద్రంలో ఎంతో భక్తిశ్రద్ధలతో దర్గాహ్ ఖాదిమ్ మహమ్మద్ నవాజ్ ఖాద్రి చిష్తీ అల్ రఫియా ఆధ్వర్యంలో హజ్రత్ సయ్యద్ షా అలి ఖాద్రి ఘనంగా దర్గా గంధోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమమంలో కొందుర్గు మండల అధ్యక్షులు కృష్ణా రెడ్డి, షాద్ నగర్ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్, సీనియర్ నాయకులు రఘు, సయ్యద్ సాధిఖ్ రఫీఖ్ పటేల్, ఎండీ. ఇబ్రహీం, ముబారక్ అలీ ఖాన్, జితేందర్ రెడ్డి, ఖదీర్, ఇసాఖ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతకు ప్రతీకగా ప్రాచీనమైన హజరత్ సయ్యద్ షా అలి ఖాద్రి దర్గా గందొత్సవం అనాదిగా భక్తుల మొక్కులు తీరుస్తూ ఆధ్యాత్మికతకు ప్రతికగా ఉంటున్న ఈ దర్గాను దర్శించిన భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి, మనశ్శాంతి లభిస్తుందని, ప్రతి దర్గా దర్శనంలో భక్తులలో మానవత్వం పెంచి, సత్యం ధర్మం న్యాయం వైపు నడిపిస్తుంది. ఇది గంగా జాముని తహజీబ్ కు నిదర్శనమని అన్నారు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజకవర్గంలోని దర్గాలకు అభివృద్ధి చేస్తున్నారన్నారు. అదేవిధంగా కుందుర్గులోని ఈ హజరత్ సయ్యద్ షా అలి ఖాద్రి దర్గాహ్ అభివృద్ధి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు భక్తులు తదితరులు హాజరయ్యారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్ కాలనీకి చెందిన నౌసిన్ బేగంకి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.70,000 ల ఆర్థిక సహాయానికి సంబంధించిన సీఎంఆర్ ఎఫ్ మంజూరి పత్రాన్ని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి బాధిత కుటుంబానికి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందచేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని తెలిపారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని గాంధీ తెలియచేశారు. వైద్య చికిత్స కి సహకారం అందించిన ఆరెకపూడి గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నామని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, మంత్రిప్రగడ సత్యనారాయణ, అష్రాఫ్, గోపాల్, లింగం,సత్యనారాయణ, దర్శన్, వేణు గోపాల్ రెడ్డి, మంజుల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్లో ఘనంగా బతుకమ్మ, దసరా సంబరాలు

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ నారాయణ పాఠశాలలో శనివారం ఉదయం బతుమ్మ, దసరా సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సంబరాలకు ముఖ్య అతిథిగా జియం గోపాల్ రెడ్డి, ఏజీయం బాలపరమేశ్వర్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హాజరై ఈ పండుగ సంబరాలను ప్రారంభించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, విద్యార్థినీలు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. బతుకమ్మ సంబరాల తర్వాత విద్యార్థులు వేసిన నాటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దసరా పండుగ, దుర్గమాత విశిష్టతను తెలిపే రామలీల నాటక ప్రదర్శన మన సంస్కృతి, సంప్రదాయా లను భవిష్యత్ తరాలకు అందించాలనే స్ఫురణను కలిగించాయని జియం గోపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు. బాల్యం నుంచే పిల్లలలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం వల్ల వారిలో సృజనాత్మకత పెంపొందుతుందని ముఖ్య అతిథులు అన్నారు. పండగల సందర్భంగా స్కూల్ యాజమాన్యం, సిబ్బంది ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. పిన్సిపాల్, వైస్ పిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదులను సన్మానించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: పలువురు న్యాయవాదులను సన్మానించిన ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాపు కార్యాలయంలో ఫోక్సో కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సబియా సుల్తానా, 16వ అదనపు సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రశేఖర్ రెడ్డి తదితర స్థానిక సీనియర్ న్యాయవాదులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సైతం నూతనంగా ఎంపికైన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సబియా సుల్తానా, చంద్రశేఖర్ రెడ్డిలను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థానిక న్యాయవాదులు రఘునాథ్ శర్మ, మంగుమోహన్రావు, ప్రభాకర్ గౌడ్, తదితరు లను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ న్యారంగంలో ఎల్లవేళలా బాధితుల పక్షాన నిలబడి వారికి న్యాయం పొందే విధంగా కృషి చేయాలని కోరారు. న్యాయం ఎంతో విలువైనదని దానిని పైతుల పక్షాన నిలబడి వారికి న్యాయం దక్కేవరకు పోరడాల్సిన అవసరం ఉంటుందన్నారు. షాద్ నగర్ న్యాయస్థానంలో ఎన్నో ఏళ్లుగా నాణ్యమైన న్యాయ సేవలు అందిస్తూ ఎంతో పేరు ప్రఖ్యాతలు సాధించిన సబియా సుల్తానా, చంద్రశేఖర్ రెడ్డిలకు పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా ప్రభుత్వం అవకాశం కల్పించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పలువురు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు సైతం ధన్యవాదాలు తెలిపారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, తిరుపతిరెడ్డి, బస్వం, ఇబ్రహీం, ఆలియా సుల్తానా, మసూద్ పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో సానుకూలంగా స్పందించిన కేంద్రం

సెప్టెంబర్‌లో రాష్ట్రానికి అదనంగా 1.17 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయింపు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలోని రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం యూరియా సరఫరాల కోసం నిరంతరం కృషి చేస్తూ వస్తోంది. ముఖ్యంగా రబీ పంటల సాగు కూడా ఆరంభం అవుతున్న ఈ సమయంలో రైతులకు అవసరమైన యూరియా సరఫరాలో లోపం కలగకుండా చూసే చర్యలను ప్రభుత్వం ఎప్పటి మాదిరిగానే ప్రాధాన్యతగా తీసుకుంటోంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిరంతర వినతులు, ఢిల్లీ వెళ్లి ప్రత్యక్షంగా మంత్రులను పలు మార్లు కలసి చేసిన అభ్యర్థనలకు కేంద్రం సానుకూలంగా స్పందించింది. సెప్టెంబర్ నెలలో రాష్ట్రానికి మొత్తం 1.17 లక్షల మెట్రిక్ టన్నుల ఇంపోర్టెడ్ యూరియా కేటాయింపును కేంద్రం ఆమోదించింది. ఈ కేటాయింపులో భాగంగా కాకినాడ, విశాఖపట్నం, గంగవరం, మంగళూరు, జైగడ్, కృష్ణపట్నం వంటి ప్రధాన నౌకాశ్రయాల ద్వారా యూరియా రాష్ట్రానికి చేరుతుంది. ఇందులో కాకినాడ నుండి 15,900 మెట్రిక్ టన్నులు, విశాఖపట్నం నుండి 37,650 మెట్రిక్ టన్నులు, గంగవరం నుండి 27,000 మెట్రిక్ టన్నులు, మంగళూరు నుండి 8,100 మెట్రిక్ టన్నులు, జైగడ్ నుండి 16,200 మెట్రిక్ టన్నులు, కృష్ణపట్నం నుండి 13,000 మెట్రిక్ టన్నులు సరఫరా అవుతున్నాయి. ఇప్పటికే సెప్టెంబర్ 1 నుండి రాష్ట్రానికి 1.44 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయ్యింది. కేంద్రం అదనంగా కేటాయించిన ఇంపోర్టెడ్ యూరియాలో ప్రస్తుతం 30,000 మెట్రిక్ టన్నులు లోడింగ్‌లో ఉండగా, రాబోయే వారంలో మరో 50,000 మెట్రిక్ టన్నులు లోడింగ్ పూర్తి కానున్నాయి. అలాగే 30,000 మెట్రిక్ టన్నులు ఇప్పటికే ట్రాన్సిట్‌లో ఉన్నాయి. ఈ సరఫరా వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రాష్ట్రానికి యూరియా సరఫరా చేసే ప్రధాన వనరుల్లో రామగుండం ఎరువుల కర్మాగారం కీలకమైనది. గత 90 రోజులుగా ప్లాంట్ షట్‌డౌన్ కారణంగా ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ పరిస్థితి రాష్ట్ర రైతులకు అంతరాయం కలిగించకుండా ఉండేందుకు రాష్ట్ర మంత్రి స్వయంగా కేంద్ర రసాయనాల మంత్రిని, కార్యదర్శిని కలుసుకుని రామగుండం యూనిట్‌ను త్వరితగతిన పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్రం సానుకూలంగా స్పందించింది. రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఎరువుల కొరత లేకుండా, సాగుకు ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు అవసరమైన ప్రతి చర్యను తీసుకుంటోంది. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదు. యూరియా సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు ప్రభుత్వం కేంద్రంతో సమన్వయం చేస్తూ ఉంటుంది" అని మంత్రి తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : కేబిఆర్ పార్క్‌లో చిట్, చాట్ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి హైదరాబాద్ ఇంచార్జ్ పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ నగర్ ఏ, బి బ్లాక్ సమస్యలకు పరిష్కారం చూపాలని బి బ్లాక్ నివాసితులు, లక్ష్మి రెడ్డి తదితరులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఉదయం కె.బి.ఆర్ పార్క్‌లో వాకింగ్ సందర్భంగా కంటెస్టెడ్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్, గుర్రం మురళి గౌడ్, రహమత్ నగర్ కార్పొరేటర్ సి ఎన్. రెడ్డి, మాజీ కార్పొరేటర్ యూసుఫ్ గూడా గుర్రం సంజయ్ గౌడ్, స్టీఫెన్, కునాల్ జాదవ్ తదితరులు నియోజకవర్గంలో జరగబోయే ఎన్నికల విషయంలో సమాలోచన కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో రోడ్డు పనులను పూర్తి చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని తోల్కట్ట - నక్కపల్లి వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని రోడ్ల నిర్మాణాలు కోసం ప్రభుత్వం ఎన్నో నిధులు విడుదల చేస్తుందని తెలియజేశారు. సకాలంలో రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పనుల్లో జాప్యం వహించకుండా పనులు చేపట్టాలన్నారు. పనుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలు అమలు చేయండి

విశాలాంధ్ర - బషీర్ బాగ్: ప్రభుత్వ అధికారులు హైకోర్టు ఆదేశాలు అమలు చేయాలని కిషన్ చంద్ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ త్రిలోక్ చంద్ కోరారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదర్‌గూడలో ఉన్న కిశన్ చంద్ ఫౌండేషన్ ట్రస్ట్ ఎంఏ గార్డెన్ ఫంక్షన్ హాల్‌కు సంపూర్ణ యజమానులు, లీజుదారులుగా ఉన్నామన్నారు. అయితే, సెప్టెంబర్ 11న ప్రభుత్వ అధికారులలో కొందరు మండల రెవెన్యూ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి సహాపై అధికారుల ఆదేశాల మేరకు చట్టపరమైన విధి విధానాలు పాటించకుండా బలవంతంగా తమ ఆస్తిలోకి ప్రవేశించి తాళం వేశారని వివరించారు. ఆస్తి ప్రభుత్వానికి చెందిందని బోర్డులు ప్రదర్శించారని పేర్కొన్నారు. సెప్టెంబర్ 12న తెలంగాణ హైకోర్ట్ ఆదేశాలు జారీ చేసిందని, తక్షణ చర్యలు తీసుకోవద్దని, తాళాలు తొలగించమని చెప్పిందని తెలిపారు. అధికారులు ఆ ఆదేశాలను పాటించడం లేదని ఆరోపించారు. ఇమ్రాన్ బిన్ హాజీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చట్టాలను అమలు చేయడంలో అలసత్వం వహించడం దురదృష్టకరమన్నారు. ఉన్నతాధికారుల ప్రోద్బలంతో మండల రెవెన్యూ అధికారి అన్యాయంగా తాళం వేశారన్నారు. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి తాళం తొలగించాలని ఆదేశిస్తూ, యాజమాన్య ప్రకటన కోసం ట్రస్ట్‌కు 10 రోజుల సమయం ఇచ్చారన్నారు. అయినా తాళం తొలగించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రస్టీ కైలాష్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

విశాలాంధ్ర - మొయినాబాద్: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలకు దసరా సెలవులు ప్రకటించడంతో పాఠశాల చివరి రోజు అయిన శనివారం పాఠశాలలో చిన్నారులు బతుకమ్మను పేర్చి పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు ఆహ్లాదకరమైన వేషధారణలో బతుకమ్మను అమర్చి తోటి విద్యార్థులతో, పాఠశాల ఉపాధ్యాయునులతో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలో పండుగ వాతావరణం సంతరించుకుంది. సుమారు 8 రోజుల పాటు బతుకమ్మ వేడుకలను గ్రామాల్లో ఘనంగా నిర్వహించేందుకు మహిళలు నిమగ్నమయ్యారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ సేవలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. సూరారం కాలనీలో గల పట్టణ ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ పేరిట నిర్వహిస్తున్న ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాన్ని, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ 15 రోజుల పాటు దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఇతర ఆరోగ్య కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారని, మహిళలు, చిన్నారులు వారి సేవలను వినియోగించుకోవాలని సురేష్ రెడ్డి కోరారు. అలాగే మహిళలకు బీపీ, షుగర్, స్క్రీనింగ్, నోటి క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తారని, యువతులకు, మహిళలకు అనీమియా పరీక్షలు నిర్వహించడంతో పాటు తగిన కౌన్సెలింగ్ అందిస్తారని అన్నారు. క్షయ పరీక్షలతో పాటు గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ వ్యాధి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించడమే కాకుండా ఈ శిబిరాల్లో గైనకాలజిస్టులు, నేత్ర వైద్యులు, చర్మ వైద్యులు, మానసిక వైద్యులు, డెంటల్ డాక్టర్లు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరనాజ్, స్పెషలిస్ట్ డాక్టర్ అంజలి మాధురి, ల్యాబ్ టెక్నీషియన్ బి రమేష్, ఫార్మసిస్ట్ నవీన్, ఏఎన్ఎం రాజేశ్వరి మహిళలు స్థానికులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ మహాసభలు ఆదివారం నుంచి చండీగఢ్‌లో ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి ఏర్పాట్లు చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ కామ్రేడ్లు.

కేంద్రం నియంత్రణలో వ్యవస్థలు

మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ: నారాయణ

న్యూదిల్లీ: చండీగఢ్‌లో ఆదివారం నుంచి ఐదు రోజులపాటు సీపీఐ జాతీయ మహాసభలు జరగనున్నాయి. దాదాపు 750 మంది ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై జాతీయ మహాసభల్లో చర్చించి... భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు. యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. సీపీఐలో 75 ఏళ్ల వయోపరిమితి అమలుపై మహాసభల్లో చర్చిస్తామని చెప్పారు. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకలో అవినీతి, నిరుద్యోగం పెరిగి యువత తిరగబడ్డారన్నారు. కేంద్రం అన్ని వ్యవస్థలను తమ చెప్పుచేతల్లో పెట్టుకుందని విమర్శించారు. అదానీ గ్రూప్‌కు సెబీ క్లీన్‌చిట్ ఇచ్చిందని, అండమాన్ నికోబర్ దీవులను అదానీకి అప్పగించారన్నారు. అదానీకి మద్దతుగా ప్రధాని మోదీ నిలుస్తున్నారని ఆరోపించారు. అదానీకి వచ్చే ఆదాయాన్ని సగటుగా వచ్చే ఆదాయంతో పోల్చి తలసరి ఆదాయం లెక్కగడతారా అని ప్రశ్నించారు. సెల్ ఫోన్లు, కార్లు పెరిగాయని, రేషన్ బియ్యం తినేవారు లేరంటూ రేషన్ కార్డులను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. రేషన్ బియ్యం అమ్మేవారిని పట్టుకోకుండా రేషన్ కార్డులు తొలగించాలని చూస్తున్నారని విమర్శించారు. గతంలో కాకినాడలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారని అన్నారు. ఫుట్ పాత్‌పై పడుకునే వాడు కూడా సెల్ ఫోన్ వాడుతున్నారని తెలిపారు. ఫోన్ వాడినంత మాత్రాన పేదరికం లేనట్లా అంటూ నారాయణ ప్రశ్నించారు.

వెంకన్న సొత్తు దోచిన వైసీపీ గజదొంగలు: లోకేశ్ ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి: జగన్ ఐదేళ్ల పాలనలో అవినీతి రాజ్యమేలింది. అరాచకం పెచ్చరిల్లింది. దొంగలు, దోపిడీదారులు, మాఫియా డాన్లకు ఏపీని కేరాఫ్ అడ్రస్ చేశారు అని మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. గనులు, భూములు, అడవులు, సమస్త వనరులతోపాటు జనాన్ని దోచుకున్న జగన్ గ్యాంగ్...చివరకు తిరుమల శ్రీవారి సొత్తునూ వదలలేదన్నారు. జగన్ హయాంలో తిరుమల శ్రీవారి పరకామణిలో సిబ్బంది కానుకలను తస్కరిస్తున్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. సీసీ కెమెరా ద్వారా రికార్డు అయిన ఈ వీడియోను లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేస్తూ విమర్శలు గుప్పించారు. తాడేపల్లి ప్యాలెస్ ఆశీస్సులు, నాటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అండదండలతో తిరుమల పరకామణిలో దొంగలు పడ్డారని, కోట్ల సొత్తు కొల్లగొట్టారని, ఈ డబ్బు రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టారని, ఇందులో వాటాలను తిరుపతిలో భూమన నుంచి తాడేపల్లి ప్యాలెస్ వరకు అందాయని నిందితులే చెబుతున్నారన్నారు. భక్తులు కట్టిన ముడుపులు, హుండీలో వేసిన కానుకలు వందల కోట్లు రవికుమార్ దోచుకుని వెళ్లినప్పుడు భూమన ...అతడి మనుషులు ఈ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేయడానికి ప్రయత్నించారన్నారు. భక్తులు మహా ప్రసాదంగా భావించే లడ్డూని కల్తీ చేశారని, అన్న ప్రసాదాన్ని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. తిరుమల దర్శనాలను అమ్మేసి సామాన్య భక్తులకు స్వామి దర్శనం దుర్లభం చేశారని విమర్శించారు. ఏడుకొండలవాడు చాలా శక్తిమంతమైన స్వామి...ఆయనకు అపచారం తలపెట్టినా, ఆయన సన్నిధిలో అవినీతికి పాల్పడినా...ఏం జరుగుతుందో తెలిసినా జగన్, భూమన ఏకంగా పరకామణినే దోచేశారని ధ్వజమెత్తారు. రేపు నిందితులే వైసీపీ పాపాల చిట్టా విప్పబోతున్నారన్నారు.

అంబేద్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: అంబేద్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ యువతకు పోటీ పరీక్షల కోసం ఉచితంగా ఇచ్చే శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏపీ అంబేద్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రసన్న వెంకటేశ్ శనివారం తెలిపారు. ఐబీపీఎస్, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ వంటి పరీక్షల కోసం తిరుపతి, విశాఖపట్నం కేంద్రాలుగా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. శిక్షణా కాలంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కలిస్తామన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 24 నుంచి అక్టోబరు 6 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులకు ఆయా జిల్లా కేంద్రాల్లో అక్టోబరు 12న స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని, మెరిట్ సాధించిన వారికి రిజర్వేషన్ల ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. మరిన్ని వివరాలకు https://apstdc.apcfss.in వెబ్‌సైట్ లేదా సెల్ నం.9949686306కు సంప్రదించాలని వెంకటేశ్ సూచించారు.

రైతులకు 'ఎస్ఎంఎస్ సలహా' సేవలు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రైతులకు మరింత చేరువగా సాంకేతిక సలహాలను అందించేందుకు ప్రభుత్వం కొత్త పద్ధతిని ప్రవేశపెట్టింది. రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు డిల్లీ రావు ప్రారంభించిన ఏపీఏఐఎంఎస్ 2.0 (ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సమాచార యాజమాన్య వ్యవస్థ 2.0)లో భాగంగా రైతులకు ఎస్ఎంఎస్ ద్వారా సాగు సూచనలు ఇవ్వనున్నారు. ఈ పద్ధతిలో వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యత, పురుగులు–తెగుళ్ల యాజమాన్యం, పోషకలోపం సమస్యలపై కృత్రిమ మేధ ఆధారంగా రైతులకు ముందస్తు హెచ్చరికలు చేస్తారు. బల్క్ ఎస్ఎంఎస్ పుల్ డౌన్ విధానం ద్వారా ఒకేసారి వేలాది మంది రైతులకు తక్షణ సలహాలు అందుతాయని డిల్లీరావు తెలిపారు. వాసర్ లాబ్స్ అభివృద్ధి చేసిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా పంటల వారీగా, ప్రాంతాల వారీగా సలహాలు రూపొందుతాయన్నారు.

మరిన్ని అరెస్టులు తప్పవా?

- ఈడీ రాకతో వైసీపీ నేతల్లో గుబులు
- మద్యం కేసు దర్యాప్తు వేగవంతం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. మనీలాండరింగ్ కోణంలో ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ఈడీ... ఇప్పటికే అనేక నగరాల్లో సోదాలు నిర్వహించింది. ఢిల్లీ, హైదరాబాద్, విజయవాడ, అమరావతి సహా అనేక ప్రాంతాల్లో జరిగిన సోదాల్లో కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలను ఈడీ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈడీ దర్యాప్తు వేగం పెరగడంతో నిందితుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. త్వరలో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం అందుతోంది. ఏపీ మద్యం విధానాల్లో 2019 తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మార్పులపై బహిరంగంగా విమర్శలు రావడం, కొద్దిమందికి లాభాలు వచ్చేలా వ్యవస్థను మలచినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రైవేట్ మద్యం దుకాణాలను తొలగించి... ప్రభుత్వ నియంత్రిత విక్రయాన్ని ప్రవేశపెట్టడంలో పారదర్శకత కొరవడిందని అనేక మంది పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా మద్యం ఆర్డర్ల వ్యవహారంలో కొద్ది కంపెనీలకే అవకాశం కల్పించడంలో భారీ అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కుంభకోణంలో సుమారు రూ.4 వేల కోట్ల లావాదేవీలు జరిగాయనే అనుమానంతో ఈడీ విచారణ చేపట్టింది. షెల్ కంపెనీల ద్వారా నిధుల మళ్లింపు, హవాలా లావాదేవీలు, బ్యాంకు ఖాతాల్లో అనుమానాస్పద డిపాజిట్లు మొదలయిన అంశాలపై ఈడీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే కొంతమంది వ్యాపార వేత్తలు, బినామీ కంపెనీలు, మధ్యవర్తులపై ఏపీ సీఐడీ కేసు నమోదు చేసి విచారణ జరుపుతోంది. 12 మందిని అరెస్టు చేసింది. ఇందులో నలుగురు బెయిల్‌పై విడుదల కాగా... మిగిలిన నిందితులు వివిధ జైళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఈ వ్యవహారంలో రాజకీయ నేతల ప్రమేయం ఉందన్న సంకేతాలు స్పష్టమవుతున్నాయి. నాటి ప్రభుత్వ పెద్దలతో అనుబంధాలు ఉన్న వ్యాపారవేత్తలు మద్యం ముడుపుల సొమ్మును షెల్ కంపెనీల ద్వారా విదేశాలకు తరలించినట్లు ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. దీంతో ఈడీ రంగంలోకి దిగింది. ప్రస్తుతం ఈడీ మూడు దశల్లో దర్యాప్తు సాగిస్తోంది. మొదటగా సోదాలు, రెండవ దశలో డేటా విశ్లేషణ, మూడవ దశలో నేరుగా అరెస్టులు జరగనున్నాయి. ఇప్పటికే దాదాపు 40కు పైగా బ్యాంకు ఖాతాలను గుర్తించిన ఈడీ... వాటిలో లావాదేవీలపై సమగ్రంగా పరిశీలన చేపట్టింది. డిజిటల్ డేటా నుంచి కొంతమంది పేర్లు స్పష్టంగా వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ కేసుపై అధికార పార్టీ స్పందించకపోవడం రాజకీయంగా గమనార్హం. ప్రతిపక్షం మాత్రం ఇది రాజకీయ ప్రేరేపిత కేసుగా అభివర్ణిస్తోంది. అయితే ఈ కేసు దర్యాప్తు ప్రక్రియ కేవలం వ్యాపారుల వరకే పరిమితం కాకుండా అసలు వ్యవస్థను నడిపించిన వారి వరకు వెళ్లాలని డిమాండ్ వినబడుతోంది. మద్యం పాలసీలో జరిగిన అవకతవకలు కేవలం ఆర్థిక కుంభకోణంగా కాదు. సామాజికంగా, ఆర్థికంగా ప్రజలపై తీవ్ర ప్రభావం చూపిన సంఘటనగా ముద్రపడుతోంది. వేలాదిమంది అసంఘటిత మద్యం విక్రేతలు ఉపాధి కోల్పోయారు. ప్రభుత్వ ఆదాయం ఆశించిన స్థాయిలో రాలేదు. ప్రజలు అధిక ధరలకు మద్యం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇప్పుడు ఈడీ దర్యాప్తు కీలక మలుపు తిరగబోతున్నది. అరెస్టులు ఎప్పుడయినా సంభవించవచ్చన్న చర్చ రాజకీయవర్గాల్లో నెలకొంది. ఈ కుంభకోణంలో అంతిమ లబ్ధిదారు ఎవరనేది రాబోయే రోజులలో స్పష్టత రానుంది. ఇప్పటికే నాటి ప్రభుత్వంలో కీలకంగా పని చేసి ఈ కేసులో నిందితులుగా ఉన్న అనేక మంది ఉన్నతాధికారులు, నాటి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కొందరిని సిట్ అధికారులు అరెస్టు చేయడం, కేసులో నిందితులుగా గుర్తించడం తెలిసిందే. ఈ క్రమంలో ఈడీ దర్యాప్తు రాజకీయంగా ప్రకంపనలు సృష్టించే అవకాశం ఉందని అంటున్నారు. ఈ పరిణామాలు వైసీపీ శ్రేణుల్లో గుబులు రేకెత్తిస్తున్నాయి.

జడ్జిలకు నిష్పాక్షికత అవశ్యం

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు ఇవ్వడంలో విముఖత తగదు
- అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ సదస్సులో సీజేఐ గవాయ్

న్యూదిల్లీ: న్యాయమూర్తులు నిష్పక్షంగా వ్యవహరించాలని భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాల్ అన్నారు. అవసరమైనప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదేశాలు ఇవ్వడానికి విముఖత వద్దని సూచించారు. అలాంటి వారు ఆత్మవిమర్శ చేసుకోవడం ఎంతో అవసరమని ట్రిబ్యునళ్ల నాన్–జ్యుడీషియల్ సభ్యులకు సూచించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సమానమని, కలిసి పని చేస్తేనే చివరి వ్యక్తికి న్యాయం జరుగుతుందని తెలిపారు. దిల్లీలో శనివారం జరిగిన సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ 2025 10వ అఖిలభారత సదస్సులో న్యాయ వ్యవస్థ, ట్రిబ్యునళ్ల పనితీరు, సమస్యలపై సీజేఐ మాట్లాడారు. కోర్టులకు అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునళ్లకు తేడా ఉంటుందని, పరిపాలన యంత్రాంగానికి, న్యాయ వ్యవస్థకు మధ్య అసాధారణ స్థానాన్ని అవి కలిగివుంటాయని చెప్పారు. ట్రిబ్యునళ్ల సభ్యుల్లో చాలా వరకు ప్రభుత్వ పదవుల్లో పనిచేసిన వారు ఉంటారని, మిగతా వారు న్యాయ వ్యవస్థ నేపథ్యం నుంచి వచ్చిన వారు ఉంటారన్నారు. పాలనా యంత్రాంగాన్ని, న్యాయ వ్యవస్థ అనుభవాన్ని ఐక్యవేదిక కల్పించే ఈ వైవిధ్యత శక్తికి సంకేతమే అయినప్పటికీ, సభ్యులు ఎప్పటికప్పుడు శిక్షణ పొందడం, ఏకరూప పరిణామాలను పాటించడం, ప్రవర్తనా నిబంధనావళికి కట్టుబడటం ప్రధానమని సీజేఐ గవాయ్ వెల్లడించారు. 'ఒక జడ్జిగా నేను ఓ విషయాన్ని గమనించాను. అడ్మినిస్ట్రేటివ్ సభ్యులలో, జడ్జిలలో కొందరు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదేశాలివ్వడానికి ఇష్టపడటం లేదని గుర్తించాను. ఇలాంటి వారు ఆత్మపరిశీలన చేసుకోవడం అవసరమని చెబుతాను. న్యాయ విద్యా నిపుణులతో వర్క్‌షాపులు, సదస్సులు, శిక్షణా కార్యక్రమాలను తరచూ నిర్వహించడం వల్ల ఈ పరిస్థితిలో మార్పు వస్తుంది. ట్రిబ్యునల్ సభ్యులు మరింత సమర్థంగా పనిచేసే వీలు కలుగుతుంది' అని సీజేఐ సూచించారు. నియామకాల్లోనూ పారదర్శకత పద్ధతిని అనుసరించడం, సమర్థులను నియమించడం ద్వారా ట్రిబ్యునళ్లపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించవచ్చన్నారు. అదే విధంగా కోర్టురూమ్‌లలో కొందరు జడ్జిలు, న్యాయాధికారుల ప్రవర్తనపై సీజేఐ అభ్యంతరం తెలిపారు. న్యాయమూర్తులు తమ అధికారాల వినియోగంలో వినయంగా, బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. 'ఇటీవల కొందరు జడ్జిల తీరుపై బార్ అసంతృప్తి వ్యక్తంచేసింది. నేను ఈ మధ్య ఓ వార్తాపత్రికలో హైకోర్టు న్యాయమూర్తి గురించి వార్త చూశాను. ఆ జడ్జి ఎవరు, అది ఏ హైకోర్టు అనేది చెప్పను కానీ న్యాయమూర్తి ధాటికి యువ న్యాయవాది స్పృహ కోల్పోయారని అందులో ఉంది. జడ్జిలుగా మనం మనం హుందాగా వ్యవహరించాలి. మన హోదాను గౌరవించాలి. న్యాయమూర్తులు, న్యాయవాదులు న్యాయ వ్యవస్థ స్వర్ణరథానికి రెండు చక్రాల వంటివారు. ఎవరూ ఎక్కువ–తక్కువ కాదు. జడ్జిలు, లాయర్లు కలిసి పనిచేస్తేనే న్యాయ వ్యవస్థ సమర్థంగా పని చేయగలదు. చివరి పౌరునికి న్యాయం చేకూర్చగలదు' అని సీజేఐ అన్నారు. తమ సమస్యలతో మన వద్దకు వచ్చే వ్యాజ్యదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని న్యాయం జరిగేలా నిష్పాక్షికంగా తీర్పులు ఇవ్వాలని సీజేఐ గవాయ్ సూచించారు. సదస్సులో కేంద్రమంత్రులు అర్జున్ రామ్ మేఘువాల్, జితేంద్ర సింగ్ పాల్గొన్నారు.

రాష్ట్రాలను చంపేస్తున్న కేంద్రం: సూర్జేవాలా

న్యూదిల్లీ: రాష్ట్రాలను అధికారంలేని మున్సిపాలిటీలుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం యత్నిస్తోందని, వాటి స్వయంప్రతిపత్తిని హరించే కఠిన ఫెడరలిజాన్ని ప్రదర్శిస్తోందని కాంగ్రెస్ శనివారం విమర్శించింది. గత పదేళ్లలో రాష్ట్రాలపై అప్పు రూ.60లక్షల కోట్లకు పెరిగిందన్న కాగ్ నివేదిక పేర్కొనడంతో కేంద్రాన్ని దుయ్యబట్టింది. ద్వంద్వ ప్రమాదం (డబుల్ జియోపార్డీ) వల్ల అప్పులు పెరిగి ఆదాయం కుదిరించుకుపోతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సూర్జేవాలా విమర్శించారు. భారత సమాఖ్యవాదం కళంకితమవుతోందని అన్నారు. రాష్ట్రాలపై ఉన్న అప్పు గత దశాబ్దంలో మూడు రెట్లు పెరిగిందని, జీఎస్టీ పరిహార సెస్, ఏకపక్షంగా విధించే కేంద్ర లెవీల వల్ల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని రాష్ట్రాలు కోల్పోయాయని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. సహకార సమాఖ్యవాదం, అధికార వికేంద్రీకరణ పణంగా పెట్టబడ్డాయని, రాష్ట్ర పరిపాలన అంతానికి, కేంద్రం వద్ద అధికారం కేంద్రీకృతమయ్యేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు.

జగన్ సోదరుడి నివాసంలో ముగిసిన సిట్ సోదాలు

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి : మద్యం ముడుపుల కుంభకోణం కేసులో చెన్నై, హైదరాబాద్‌లో సిట్ అధికారులు చేపట్టిన సోదాలు ముగిశాయి. చెన్నైలో మూడు కంపెనీల్లో శనివారం మధ్యాహ్నం వరకూ సోదాలు జరిగాయి. జగన్ సోదరుడు (పెద్దనాన్న కుమారుడు) వైఎస్ అనిల్ రెడ్డికి చెందిన మొత్తం ఎనిమిది కంపెనీలు, ఆయన నివాసాలపై సిట్ దాడులు చేసింది. కీలక డేటాను స్వాధీనం చేసుకుంది. చెన్నైలో ఆయా కంపెనీలకు చెందిన బ్యాంక్ లావాదేవీలు చూసే అకౌంటెంట్లు ఆడిటర్లను విచారణకు రావాల్సిందిగా నోటీసులు ఇవ్వాలని సిట్ అధికారులు భావిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్, విశాఖపట్నంలో సునీల్ రెడ్డి కంపెనీలపై నిర్వహించిన సోదాల్లో అనిల్ రెడ్డి కంపెనీలకు నగదు బదిలీ అయినట్లు అధికారులు గుర్తించారు. ఈ సమాచారం ఆధారంగానే సిట్ బృందాలు చెన్నై, హైదరాబాద్‌లో అనిల్ రెడ్డి నివాసాలు, కంపెనీలపై సోదాలు చేపట్టింది. మద్యం ముడుపులను అనిల్ రెడ్డి ఈ కంపెనీల ద్వారా విదేశాల్లోని షెల్ కంపెనీలకు పంపారని సిట్ భావిస్తోంది. 2019 నుంచి 2024 వరకు ఈ కంపెనీల్లోకి వచ్చిన పెట్టుబడులు, అనిల్ రెడ్డి కొనుగోలు చేసిన ఆస్తులు తదితర వివరాలపై అధికారులు ఆరా తీశారు. చెన్నై, హైదరాబాద్‌లో ఉన్న ఏడు బృందాలు విజయవాడకు బయలుదేరాయి. ఆది, సోమవారాల్లో సోదాలకు సంబంధించి డేటాను విశ్లేషించి తదనంతర దర్యాప్తును చేపట్టాలని సిట్ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఏపీ హైకోర్టు రద్దు చేసిన ఏపీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షను తిరిగి నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. '2018లో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకనంలో లోపాల వల్ల ఏపీ హైకోర్టు గ్రూప్–1 మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2018లో నిర్వహించిన గ్రూప్–1 పరీక్షల ఫలితాలను 2022 మే 26న ప్రకటించింది. ఈ ఫలితాలలో అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలతో ప్రశ్నాపత్రాల డిజిటల్ వాల్యుయేషన్‌పై అనేక మంది అభ్యర్థులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. 2024 మార్చి 13న గ్రూప్–1 మెయిన్స్ పరీక్షను హైకోర్టు రద్దు చేస్తూ, మరో 6 నెలల్లో మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని ఏపీపీఎస్సీని ఆదేశించింది. ప్రభుత్వరంగమైన ఏపీపీఎస్సీకి సంబంధించిన ఉద్యోగాల వాల్యుయేషన్‌ను ప్రైవేటు కంపెనీ మాదిరిగా హ్యాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో చేయడం, అందుకు రూ.1.19 కోట్లు ఖర్చు చేయడం, అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.ఎస్.ఆర్.ఆంజనేయులు మూల్యాంకనం బాధ్యతను ఒక థర్డ్ పార్టీ ఏజెన్సీకి అప్పగించడం అనేక వివాదాలకు దారితీసింది. ఈ ఉద్యోగాలకు సంబంధించి కోట్లాది రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలొచ్చాయి. ఇందులో ఎవరెవరి పాత్ర ఉందో, ఎంత మొత్తాలు చేతులు మారాయో సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ డిమాండ్ చేసింది. అప్పట్లో ప్రతిపక్షంగా ఉన్న తెలుగుదేశం పార్టీ కూడా ఏపీపీఎస్సీ అక్రమాలపై ఆందోళన చేయడం గమనార్హం. అయినప్పటికీ ప్రతిపక్షాలు చెప్పేది ఏమాత్రం ఖాతరు చేయకుండా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మూర్ఖంగా ఫలితాలను ప్రకటించింది. చివరకు రాష్ట్ర హైకోర్టు ఆ ఫలితాలను రద్దు చేస్తూ మళ్లీ పరీక్షలు నిర్వహించాలని తీర్పు ఇచ్చింది. కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలానికిపైగా గడుస్తున్నా గ్రూప్–1 పరీక్ష నిర్వహించకుండా తాత్సారం చేయడం విచారకరం' అని రామకృష్ణ పేర్కొన్నారు. ఉద్యోగాల సాధన కోసం ఏళ్ల తరబడి శిక్షణ తీసుకుని, నిరీక్షిస్తున్న అభ్యర్థులను తగు న్యాయం చేసేందుకు, తక్షణమే ఏపీపీఎస్సీ గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

కర్నాటక సీఐడీకి ఈసీ సమాచారం ఇవ్వలేదు

ఓట్ల దొంగతనంపై రాహుల్ గాంధీ

వయనాడ్ (కేరళ): రాష్ట్రంలో 'ఓట్ల దొంగతనం' ఆరోపణలకు సంబంధించి కర్నాటక సీఐడీ కోరిన సమాచారాన్ని భారత ఎన్నికల సంఘం అందించలేదని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ శనివారం ఆరోపించారు. శుక్రవారం తన తల్లి సోనియా గాంధీతో కలిసి వయనాడ్‌కు వచ్చిన రాహుల్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ 'ఓటు చోరీ'లో ఉపయోగించిన సంఖ్యల గురించి సమాచారం కోరుతూ కర్నాటక సీఐడీ ఈసీకి అనేక లేఖలు పంపిందని, కానీ ఎన్నికల సంఘం దానిని అందించడం లేదని అన్నారు. జ్ఞానేశ్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) పోలీసులు కోరిన సమాచారాన్ని ఆయన అందించడం లేదని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు. సీఈసీపై ఇంతకంటే పెద్ద నేరారోపణ మరొకటి ఉండదు. పోలీసులు సమాచారం అడుగుతున్నారు. ఆయన దానిని అందించడం లేదు. ఇది నా ప్రకటన కాదు. ఇది వాస్తవం. ఇది నలుపు, తెలుపులో ఉంది' అని ఆయన అన్నారు. ఆరోపించిన 'ఓటు చోరీ'కి కాంగ్రెస్ సాక్ష్యాలను చూపుతుంది. ప్రధాని నరేంద్ర మోదీ అది చేశాడు. ఎన్నికలలో గెలిచాడనే విషయంలో ఎవరికీ అనుమానం లేదని తెలిపారు. 'నేను నా రెండు విలేకరుల సమావేశాలలో చెప్పినట్లుగా పరిస్థితి వాస్తవికతను పూర్తిగా నాశనం చేసే హైడ్రోజన్ బాంబును మేము బహిర్గతం చేయబోతున్నాము. మేము ఏమి చెబుతున్నామో దానికి మా వద్ద బహిరంగ, రుజువులు ఉన్నాయి' అని అన్నారు. 'మేము రుజువు లేకుండా ఏమీ చెప్పడం లేదు. నా పని నేను చేస్తాను' అని తెలిపారు.

రాంచిలో బాంబులు తయారీ...

విద్యార్థి అరెస్టు

రాంచి: హోటల్ పేరుతో ఐసిస్ ఉగ్రవాదుల కోసం బాంబులు, ఇతర పేలుడు పదార్థాలు తయారు చేస్తున్న విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. రాంచీలోని ఓ మారుమూల ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని హోటల్‌గా నడుపుతున్నారని పోలీసులు తెలిపారు. పైకి హోటల్‌గా చెప్పుకుంటున్నప్పటికీ అందులోని భూగర్భ గదుల్లో ఉగ్రవాదుల కోసం బాంబులు తయారు చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. హోటల్‌లో పని చేస్తూ... ప్రభుత్వ ఉద్యోగం కోసం సిద్ధమవుతున్న అషర్ దానిష్ అనే విద్యార్థిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొన్నేళ్లుగా రహస్యంగా బాంబులు తయారు చేస్తూ... ఉగ్ర ముఠాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోని కొంతమంది రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడానికి ఈ ఉగ్రముఠా ప్రణాళికలు రచించినట్లు పోలీసులు వెల్లడించారు. దానిష్ గది నుంచి గన్‌పౌడర్, బాంబులు,పెద్ద మొత్తంలో పొటాషియం నైట్రేట్, ఇతర ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరికీ అనుమానం రాకుండా ఈ పేలుడు పదార్థాలను స్థానికంగా ఉన్న సుబర్ణరేఖ నదిలో పేల్చి... పరీక్షించేవారని అధికారులు వెల్లడించారు. కేవలం బాంబులు తయారు చేయడమే కాకుండా దానిష్, మరికొంతమంది ఉగ్ర మద్దతుదారులు స్థానికంగా ఉన్న యువతను ఉగ్రవాదం వైపు ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. సిగ్నల్ యాప్ ద్వారా ఐసిస్ ఉగ్రవాదులతో వీరు నిరంతరం సంప్రదింపులు చేస్తున్నట్లు తెలిపారు. రాంచీలోని ఇస్లామ్‌నగర్‌లో ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన ఐసిస్ అనుమానిత ఉగ్రవాది అజార్‌తో దానిష్‌కు సంబంధాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటివరకు 8 మంది అనుమానిత ఉగ్రవాదులను పట్టుకున్నామని, వారిని విచారిస్తున్నామని తెలిపారు.

ఉగ్ర కుట్ర భగ్నం



శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద కుట్రను భద్రతా దళాలు భగ్నం చేశాయి. 20 చైనా హ్యాండ్ గ్రెనేడ్‌లతో పాటు కొన్ని ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాయి. పూంచ్ సెక్టార్‌లోని ఒక చోట ఆయుధాలున్నట్లు నిఘా సమాచారం అందింది. దీంతో భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఉగ్రవాద కార్యకలాపాల కోసం తరలించేందుకు వాటిని అక్కడ దాచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకోవడంతో ఉగ్ర కుట్రను భగ్నం చేసినట్లు అధికారులు తెలిపారు. శ్రీనగర్, బారాముల్లా, అనంత్‌నాగ్, కుప్వారా, హంద్వారా, పుల్వామా, షోపియన్‌లో జమ్ముకశ్మీర్ పోలీసులు, కౌంటర్ ఇంటెలిజెన్స్ సిబ్బంది సోదాలు నిర్వహించారు. ఉగ్రవాద నేరాలకు సంబంధించిన డిజిటల్ పరికరాలు, పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.